ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తాడేపల్లిగూడెం : fb.com/vaartha Digital

Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam

8-4-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 67 పేజీలు: 8+4 వెల: 6.50



చంద్రుని ఆవలివైపు ఏం ఉంది? 5లో

నవ్‌జోత్ సిద్ధూ భార్య కొత్త పార్టీ


# ఇక సౌరవిద్యుత్ పుష్కలం

## సీమలో భారీగా సోలార్ ప్రాజెక్టులు

## ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల తయారీపై ప్రత్యేక దృష్టి

## వ్యవసాయ వ్యర్థాల వినియోగానికి మరిన్ని యూనిట్ల ఏర్పాటు

## అమరావతి క్వాంటం వ్యాలీలో 3 సంస్థలు

## ఎస్ఐపిబి 16వ సమావేశంలో సిఎం చంద్రబాబు



**విజయవాడ,ఏప్రిల్ 7,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో సౌర విద్యుత్ ఉత్పత్తి చేసే పూర్తి సామర్థ్యాన్ని వినియోగించుకునేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రత్యేకించి రాయలసీమ జిల్లాల్లో సౌరవిద్యుత్ ప్రాజెక్టులను పెద్ద ఎత్తున ఏర్పాటు చేసి పునరుద్పాదక విద్యుత్ ను తయారు చేసుకునేందుకు వీలుందని ఆయన సూచించారు. దీనికి అనుగుణంగా ఈ రంగంలో పెట్టుబడులను ఆకర్షించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అలాగే ఉత్పాదనకు అనుగుణంగా భవిష్యత్తులో ఆ విద్యుత్‌ను ఇతర రాష్ట్రాలకు సరఫరా చేసేలా ట్రాన్స్ మిషన్ లైన్లను కూడా సిద్ధం చేసుకోవాలని సీఎం సూచించారు. సచివాలయంలో మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన 16వ ఎస్ఐపీబీ సమావేశం రాష్ట్రంలో వివిధ రంగాల్లో పెట్టుబడి ప్రతిపాదనలకు ఆమోదం తెలియచేసింది. ఈ సమావేశానికి మంత్రులు నారా లోకేష్, కె.అచ్చెన్నాయుడు, పి. నారాయణ, కందుల దుర్గేష్, అనగాని సత్యప్రసాద్, టీజీ భరత్, గొట్టిపాటి రవికుమార్, బీసీ జనార్ధన్ రెడ్డి, వాసంశెట్టి సుభాష్ , సీఎస్ జి.సాయి ప్రసాద్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. పరిశ్రమలు, విద్యుత్, ఐటీ, పర్యాటకం, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో రూ. 39,436.84 కోట్ల విలువైన ప్రతిపాదనలకు రాష్ట్రస్థాయి పెట్టుబడుల బోర్డు ఆమోదం తెలియచేసింది. 31 ప్రాజెక్టుల ద్వారా 1,11,278 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలు దక్కనున్నాయి. ప్రత్యేకించి రాయలసీమ జిల్లాల్లో సౌర విద్యుత్ ఉత్పత్తి చేసే సామర్థ్యానికి అనుగుణంగా పెట్టుబడులను ఆకర్షించాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. పస్తుతం రాష్ట్రంలో 325 గిగావాట్ల సౌరవిద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఉత్పత్తి అయిన విద్యుత్ ను స్టేట్ గ్రిడ్, సెంట్రల్ గ్రిడ్ కు కనెక్ట చేసేలా చూడాలని మంత్రి లోకేష్ సూచనలు చేశారు. దీనిపై స్పందించిన సీఎం సమీప భవిష్యత్తులో ఉత్పత్తి అయిన విద్యుత్ ను ఇతర రాష్ట్రాలకు కూడా సరఫరా చేసేలా ట్రాన్స్ మిషన్ లైన్లను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం రాజస్థాన్‌లో సౌర విద్యుత్ ఉత్పత్తి జరుగుతున్నా పూర్తిస్థాయిలో వినియోగించుకోలేని పరిస్థితి ఉందని, ఇలాంటి పరిస్థితి తలెత్తకుండా ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎలక్ట్రానిక్స్ రంగంలో కంజ్యూమర్ ప్రొడెక్ట్స్ తయారీలో ఏపీ కీలకంగా మారాలని ముఖ్యమంత్రి సూచించారు. శ్రీసిటీ, కొప్పర్తి, అనంతపూర్‌లలో ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్ >>2

# పాఠ్యాంశాల నవీకరణ

## కాలేజీ విద్య రీఓరియెంటేషన్

## ఉచిత ఇళ్ల స్థలాల పంపిణీ వేగవంతం కావాలి

## ఆర్టీజీఎస్ నుంచి వివిధ శాఖల సమీక్షలో సిఎం చంద్రబాబు

## అవేర్ 2.0 మొబైల్ యాప్‌ను ప్రారంభించిన ముఖ్యమంత్రి

**విజయవాడ, ఏప్రిల్ 7,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా తీసుకున్న పథకాలు.. కార్యక్రమాలను పక్కా ప్రణాళికలతో అమలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయడంతోపాటు.. సంతృప్తి కలిగించే రీతిలో సేవలు అందించినప్పుడే మంచి ఫలితాలు వస్తాయన్నారు. నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకునే విషయంలో ఎలాంటి జాప్యమూ జరగకూడదని ముఖ్యమంత్రి ఆదేశించారు. మంగళవారం ఆర్టీజీస్ నుంచి వివిధ శాఖల పని తీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఈ ఏడాదిలో మరోసారి సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించుకున్నామని, ఆ దిశగా గృహ నిర్మాణశాఖ వేగంగా పనిచేయాలన్నారు. టిడ్కో ఇళ్లు కాకుండానే మరో 5 లక్షలకు ఇళ్ల నిర్మాణాన్ని పూర్తిచేసి లబ్దిదారులకు అందించాలని, ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసే విషయంలో ఎక్కడా ఆలస్యం కాకూడదన్నారు. ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం చేయని విధంగా ఇళ్ల నిర్మాణం చేపడుతున్నామని లబ్దిదారుల్లో సంతోషం వ్యక్తమవుతోందని పేర్కొన్నారు. ఇది కొనసాగాలి. ఇళ్ల నిర్మాణంతోపాటు ఇంటి స్థలాల పంపిణీ ప్రక్రియను వీలైనంత త్వరగా ప్రారంభించాలి. సుమారు 2లక్షల మంది ఇళ్ల స్థలాలు కోరినట్టు సర్వేలో తేలింది. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఇళ్లనిర్మాణాన్ని ఎంత వేగంగా చేపడుతున్నారో ఇళ్ల స్థలాల పంపిణీని కూడా అదే స్థాయిలో చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి. ఇక వర్షాకాలంలో ఇసుక సరఫరాలో ఇబ్బందులు రాకుండా ఇప్పటి నుంచే జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రజలకు ఇసుకను ఉచితంగా ఇస్తున్నాం. ప్రభుత్వానికి వచ్చే ఆదాయాన్ని వదులుకుంటున్నాం. రీచుల వద్ద, స్టాక్ యార్డుల వద్ద రవాణ పేరుతో కానీ >>2



మంగళవారం మంత్రి వర్గ ఉపసంఘం భేటీలో మాట్లాడుతున్న మంత్రి లోకేష్

## పెట్టుబడులు, పరిశ్రమల

# గ్రౌండింగ్‌పైనే దృష్టి

## 20లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యం

## ఒప్పంద కంపెనీలను ట్రాక్ చేస్తున్నాం

## కేబినెట్ సబ్‌కమిటీ భేటీలో మంత్రి లోకేష్

**గుంటూరు, ఏప్రిల్ 7 ప్రభాత వార్త ప్రతినిధి :** రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యమని, ఇప్పటివరకు ప్రభుత్వం కల్పించిన ప్రతి ఉద్యోగాన్ని ట్రాక్ చేయాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లి నివాసంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనపై ఏర్పాటుచేసిన మంత్రుల ఉపసంఘం సమావేశం జరిగింది. రాష్ట్రానికి ఇప్పటివరకు వచ్చిన పరిశ్రమలు, కల్పించిన ఉద్యోగాలతో పాటు ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న ప్రాజెక్టుల గ్రౌండింగ్ పై సమావేశంలో చర్చించారు.ఇప్పటివరకు రాష్ట్రంలో యువతకు 6.25 లక్షల ఉద్యోగాలు కల్పించినట్లు అధికారులు తెలిపారు. 20లక్షల ఉద్యోగాల కల్పనకు తీసుకుంటున్న చర్యలను >>2

## అట్టుడుకుతున్న పశ్చిమాసియా

# ప్రతిక్షణం..అగ్నిగోళం



## ఇరాన్‌పై భూతల, వైమానిక, నావికా దళాలతో దాడులు జరుపుతున్న అమెరికా- ఇజ్రాయెల్ దళాలు

## గడువు ముగియడంతో కత్తులు దూసిన ట్రంప్

## గజగజ వణికిన ఖర్గ్‌దీవి

## ప్రతీకార దాడులు ముమ్మరం చేసిన ఇరాన్

## నాతోపాటు ఇరాన్ ప్రజలంతా ప్రాణత్యాగానికి సిద్ధమే: ప్రెసిడెంట్ పెజెష్కియాన్

2లో

# అటు ఎండ.. ఇటు వాన

## మరో 48గంటలు విభిన్న వాతావరణం

**విజయవాడ,ఏప్రిల్ 7,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో రానున్న 48గంటల పాటు వాతావరణం రెండు రకాలుగా ఉండనుందని విపత్తు నిర్వహణ సంస్థ వెల్లడించింది. కొన్ని జిల్లాల్లో తీవ్రమైన ఎండలు మండిపోతుండగా, మరి కొన్ని ప్రాంతాల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముంది. దక్షి ణకోస్తాంధ్ర పశ్చి మమధ్య బంగాళాఖాతంపై ఒక ఉపరితల ఆవర్తనం, రాయలసీమ పరిసర ప్రాంతాలపై మరోఉపరితల ఆవర్తనంకొన సాగుతున్నాయి. వీటి ప్రభావంతో వర్షాలు పడనున్నాయి.
**వర్షాలు కురిసే జిల్లాలు ఇవే :** శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, పోలవరం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, >>2

# రాజ్ కెసిరెడ్డికి బెయిలు మంజూరు

## ఎపి లిక్కర్ స్కాం కేసు

**విజయవాడ,ఏప్రిల్ 7,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రాజ్ కెసిరెడ్డికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు భారీ ఊరటను కల్పించింది. ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. సుమారు యేడాది కాలంగా జైల్లో ఉన్న ఆయనకు ఈ నిర్ణయం ఊరటనిచ్చింది. గతేడాది ఏప్రిల్ 25న సిట్ అధికారులు రాజ్ కెసిరెడ్డిని అరెస్ట్ చేశారు. అప్పటి నుంచి ఆయన జ్యుడీషియల్ కస్టడీలోనే ఉన్నారు. గతంలో పలుమార్లు బెయిల్ పిటిషన్లు దాఖలు చేసినప్పటికీ కోర్టు వాటిని తిరస్కరించింది. అయితే, తాజాగా విచారణ చేపట్టిన హైకోర్టు కొన్ని నిబంధనలతో కూడిన బెయిల్‌ను >>2

## అగరబత్తీలు కాదు..

# రూ.25కోట్ల కుచ్చు టోపీ!

## మాయలోపడిన 3వేల మంది మహిళలు

## రాజమహేంద్రవరంలో వెలుగు చూసిన మోసం

**రాజమహేంద్రవరం, ఏప్రిల్7,ప్రభాతవార్త ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి:** రాజమండ్రి కేంద్రంగా సాగుతున్న భారీ ఆర్థిక మోసం వెలుగులోకి వచ్చింది. అగరబత్తీలు, ఇతర వస్తువుల తయారీ పేరుతో సుమారు 3,000 మంది మహిళలను నమ్మించి, వారి నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేసి ముంచేసిన ఉదంతంపై రాజమండ్రి త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. అనకాపల్లికి చెందిన వరదా మోహన్ కృష్ణ అనే వ్యక్తి నాలుగేళ్ల క్రితం ఒక పథకాన్ని ప్రవేశపెట్టాడు. ఇంటి వద్దే ఖాళీగా ఉండే మహిళలకు ఉపాధి కల్పిస్తామంటూ ఆశ చూపాడు. ఇందులో భాగంగా అగరబత్తీలు, ఇతర గృహోపకరణాలు తయారు చేస్తే వాటిని తిరిగి తమ సంస్థే కొనుగోలు చేస్తుందని నమ్మించాడు. అయితే ఈ పథకంలో చేరాలంటే ఒక్కొక్కరు రూ. 1 లక్ష డిపాజిట్ చేయాలని, అలా చేస్తే నెలకు రూ. 12,500 చొప్పున ఆదాయం వస్తుందని భారీ ఆఫర్ ప్రకటించాడు. ఈ స్కీంను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి సంధ్యారాణి అనే మహిళ ద్వారా యూట్యూబ్ లో వీడియోలు చేయించి విపరీతమైన పబ్లిసిటీ కల్పించారు. ఈ ప్రచారానికి ఆకర్షితులైన ఉభయ గోదావరి జిల్లాలతో పాటు పలు ఇతర జిల్లాలకు చెందిన మహిళలు లక్షలాది రూపాయలు డిపాజిట్ చేశారు. దాదాపు 3,000 మంది బాధితులు సుమారు రూ. 25 కోట్ల వరకు ఈ సంస్థలో పెట్టుబడి పెట్టినట్లు ప్రాథమిక అంచనా. గత నాలుగు నెలలుగా డిపాజిట్‌దారులకు రావాల్సిన నెలవారీ >>2



## అక్రమాస్తుల కేసు

## దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్

# శాంతి అరెస్టు



స్వాధీనం చేసుకొన్న నగదు, బంగారు ఆభరణాలు

**గుంటూరు, ఏప్రిల్ 7 ప్రభాతవార్త ప్రతినిధి :** దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ కాలింగిరి శాంతి అక్రమాస్తుల కేసులో అరెస్టు అయ్యారు. ఆమె ఆదాయానికి మించి ఆస్తులను కూడ గట్టారనే విశ్వసనీయ సమాచారం మేరకు విజ యవాడ రేంజ్ ఏసీబీ అధికారులు గుంటూరు జిల్లా తాడేపల్లి, ఉండవల్లి గ్రామాల్లోని ఆమె నివాసంతో సహా నాలుగు వేర్వేరు ప్రదేశాల్లో మంగళవారం ఏకకాలంలో సోదాలు నిర్వహించారు.
ఈ సోదాల్లో కొన్ని ఆస్తిపత్రాలతోపాటు >>2

# జలసంరక్షణపై ప్రజల్లో చైతన్యం

## 100రోజుల స్పెషల్ డ్రైవ్‌కు శ్రీకారం: జలవనరులపై చర్చలో డి.సిఎం పవన్




మంగళవారం జలవనరుల స్థిరత్వంపై ఒక రోజు వర్క్‌షాపును ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

**విజయవాడ,ఏప్రిల్ 7,ప్రభాతవార్తప్రతినిధి:** జలమే జీవం, జీవమే జల సంరక్షణకు మూలం అనే చైతన్యం ప్రతి ఒక్కరిలో రావాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యానించారు.సాధారణ ప్రజలు ఇళ్లలో వాడే నీటిని తిరిగి భూమిలోకి పంపే చర్యలు నుంచి వాగులు, వంకలు, నదుల ద్వారా వృథాగా సముద్రంలో కలుస్తున్న నీటిని కాపాడుకునే వరకు ఈ చైతన్యం అందరిలో వెల్లివిరియాలని ఆకాంక్షి ంచారు. భూమి మీద మనిషికి అవసరం అయ్యే నీటి శాతం చాలా తక్కువగా ఉంది. దాన్ని జాగ్రత్తగా కాపాడుకోకపోతే భవి ష్యత్తు తరాలకు తీరని అన్యాయం చేసినట్లేనని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ రాజ్, గ్రామీ ణాభివృద్ధి శాఖల పరిధిలో గ్రామీణ తాగునీటి సరఫరా వ్యవస్థలో జలవనరుల స్థిరత్వంపై ఒక రోజు వర్క్ షాపు కానూరులోని ఏపీఎస్ఐఆర్డీ భవన్ లో గురువారం ఉదయం మొదలైంది. ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి పవన్ కళ్యాణ్ ప్రారంభించారు. అనంతరం పవన్ కళ్యాణ్ ప్రసంగిస్తూ నీరు ఎక్కడుంటే అక్కడ అభివృద్ధి బాగుంటుంది. ప్రజల జీవన స్థితిగతులు మెరుగుపడతాయి. ఆంధ్రప్రదేశ్ ప్రజల జీవన విధానం మెరుగవడానికి గోదావరి, కృష్ణా, పెన్నా, వంశధార వంటి నదులే జీవనాధారం. వ్యవసాయ ఆధారిత రాష్ట్రంగా దేశంలో ముందు వరుసలో ఉండటానికి మనకు సమృద్ధిగా ఉన్న నీటి వనరులే కారణం. అలాంటి నీటిని సంరక్షి ంచుకునే పెద్ద సవాల్ ఇప్పుడు మన ముందుంది. ఉపరితల జలాలను జాగ్రత్తగా కాపాడుకోవడం, రానురాను తగ్గుతున్న భూగర్భ జలాలను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. దీనిపై ప్రతి ఒక్కరిలో చైతన్యం రావాలి. భవిష్యత్తును సుందరంగా నిర్మించు కోవాలంటే ప్రతి నీటి చుక్క ఎంత విలువైందో తెలుసుకోవాలి. గ్రామీణ ప్రాంతాల్లో లభ్యమయ్యే నీటి సంరక్షణ చర్యలు, వృథా అయ్యే నీటిని కాపాడుకునే చర్యలను వేగవంతం చేయడం ద్వారా భవిష్యత్తు తరాలకు మనం భరోసాని చ్చినట్లు అవుతుంది.

**నీటి సంరక్షణకు ప్రాధాన్యం:** ప్రతి కుటుంబానికి తగినంత తాగునీరు అందించాలనే బృహత్ సంకల్పంతో జల్ జీవన్ మిషన్ కార్యక్రమాన్ని మొదలుపెట్టిన ప్రధాన మంత్రి >>2

# రుషికొండ భవనాలకు మోక్షం!



## వాటి వినియోగానికి సబ్‌కమిటీ నివేదిక రెడీ: రాష్ట్ర పర్యాటక మంత్రి కందుల దుర్గేష్

**విజయవాడ,ఏప్రిల్ 7,ప్రభాతవార్తప్రతినిధి:** రుషికొండపైన ఉన్న భవనాలను ఏ విధంగా వినియోగించాలి, అదనంగా ఏఏ నిర్మాణాలు చేపట్టాలనేది ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటామని రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.ఈ మొత్తం భవనాల వివరాలు, వాటిని ఎలా వినియోగిస్తే బాగుంటుంది అనే అంశాలపై నివేదిక ఇప్పటికే సిద్ధంగా ఉందని తెలిపారు. దాని ప్రకారం ప్రజల సందర్శనానికి అందుబాటులో ఉంచడమా, ఆసక్తి చూపుతున్న పలు సంస్థలకు ఇవ్వడమా అనేది ఇంకా తేల్చాల్సి ఉందన్నారు. విశాఖ రుషికొండపై నిర్మించిన ప్యాలెస్‌ను ఎలా ఉపయోగంలోకి తేవాలన్న అంశంపై మంత్రివర్గ ఉపసంఘం >>2

# ఇక సౌరవిద్యుత్ పుష్కలం

>> పరిశ్రమలు ఏర్పాటు అయ్యేలా పెట్టుబడుల్ని ఆకర్షించాలన్నారు. రాష్ట్రంలో జీసీసీల ఏర్పాటుపై కూడా దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. ఏపీ జీసీసీలకు కేంద్రంగా కూడా తీసుకోవాలని సూచించారు. ఏపీ జీసీసీలకు కేంద్రంగా మారాలన్నారు. వ్యవసాయం, ఉద్యాన, ఆక్వా కల్చర్‌రంగాల్లో వస్తున్న వ్యర్థాలను సద్వినియోగం చేసుకునేలా ప్రాజెక్టులను ఆహ్వానించాలని సీఎం స్పష్టం చేశారు. ఈ రంగాల్లో కాలుష్య కారకాలు లేకుండా ఇథనాల్ తరహా బైప్రాడెక్టులు వచ్చేలా చూడాలని దీనికి సంబంధించిన అంశాలపై అధ్యయనం చేయాలన్నారు. దీనిపై కేంద్రం నుంచి సహకారం కూడా తీసుకోవాలని సూచించారు.

**ప్రాజెక్టుల గ్రౌండింగ్ వేగంగా జరగాలి:** రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డులో ఆమోదం పొందిన ప్రాజెక్టులు త్వరితగతిన ప్రారంభం అయ్యేలా చూడాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. వీటితో పాటు భాగస్వామ్య సదస్సులో కుదుర్చుకున్న ఒప్పందాలు కూడా సాకారమయ్యేలా చర్యలు చేపట్టాలని ప్రత్యేకించి ఆయా ప్రభుత్వ శాఖలు వీటిపై దృష్టి పెట్టాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువు లోగా ఆయా ప్రాజెక్టులు గ్రౌండ్ అయ్యేలా చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు. భారీప్రాజెక్టులపై ప్రతీ ఎస్ఐపీబీ సమావేశంలోనూ సమీక్షి ద్దామని సీఎం స్పష్టంచేశారు. ఫుడ్ ప్రాసె సింగ్ రంగంలో ఉత్పత్తి సామర్థ్యం పెరగాలన్నారు. పామా యిల్, కోకో లాంటి ఉద్యాన ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించేలా చూడాలని సీఎం సూచించారు. ఉద్యాన ఉత్ప త్తులు 200 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 400 లక్షల మెట్రిక్ టన్నులకు పెరగాలని అన్నారు. దీనికి తగినట్టుగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు కూడా పెరిగితే రైతులకు ప్రయోజనం చేకూరుతుందని స్పష్టం చేశారు.



మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన 16వ ఎస్ఐపీబీ సమావేశ దృశ్యం

ప్రాడెక్టు పర్ఫెక్షన్ పై కూడా దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంఎస్ఎంఈ పార్కుల్లో పారిశ్రామిక యూనిట్ల ఏర్పాటు వేగంగా జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రంలో ఏర్పాటు అవుతున్న ప్రాజెక్టులు, పెట్టుబడులు, ఉద్యోగాల కల్పన వివరాలను వెబ్ సైట్ లో పొందుపరచాలని సీఎం సూచించారు. తాజాగా 16వ ఎస్ఐపీబీ సమావేశం ఆమోదించిన పెట్టుబడులతో కలిపి రాష్ట్రంలో గడచిన 22 నెలల్లో ఇప్పటి వరకు 264 ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. వీటి ద్వారా రూ.9.36 లక్షల కోట్ల పెట్టు బడులు, 9.60 లక్షల మందికి ఉద్యోగాలు దక్కనున్నాయి. విశాఖలో జరిగిన భాగస్వామ్య సదస్సు ద్వారా 538 ఎంఓయూలకు గానూ రూ.11.38 లక్షల పెట్టుబడులు, 13.95 లక్షల మందికి ఉద్యోగాలు రానున్నాయి. మొత్తంగా 802 ప్రాజెక్టులద్వారా రూ.20.74 లక్షల కోట్ల పెట్టు బడులు, 23.55 లక్షల ఉద్యోగాల కల్పన జరుగనుంది.

**పారిశ్రామిక ప్రాజెక్టుల్లో ఆధునిక భద్రతా ప్రమాణాలు:** రాష్ట్రంలో వివిధ పెట్టుబడి ప్రతిపాదనతో వస్తున్న పరిశ్రమల్లో ఆధునిక భద్రతా ప్రమాణాలను ఏర్పాటు చేసుకోవటం పై కూడా దృష్టి సారించాలని ముఖ్యమంత్రి సూచించారు. భవిష్యత్తులో ఉత్పన్నమయ్యే ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కోనేలా ఈ సేఫ్టీ స్టాండర్డ్స్ ను నిర్దేశించాలన్నారు. ఫార్మా, స్టీల్, గ్రీన్ ఎనర్జీ, బీఈఎస్ లాంటి ప్రాజెక్టులు ఏర్పాటు అవుతున్న నేపథ్యంలో భద్రతా ప్రమాణాలపై ప్రత్యేకంగా ఓ ఎస్ఓపీని సిద్ధం చేయాలని సూచించారు. డిజాస్టర్ మేనేజ్మెంట్ నిబంధనలకు అనుగుణంగా ఈ భద్రతా ప్రమాణాలనుపారిశ్రామిక యూనిట్లు కలిగి ఉండాలని తేల్చి చెప్పారు. ఇటీవల రాష్ట్రంలోని బాణా సంచా తయారీ యూనిట్లలో జరిగిన ప్రమాదాల నేపథ్యంలో ప్రత్యేకంగా జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. బాణా సంచా తయారీ యూనిట్లు, మిల్క్ డెయిరీలు లాంటి అంశాల్లో ఉల్లంఘనలు లేకుండా ప్రామాణిక విధానాలు జారీ చేయాలని సూచించారు. నిర్దేశిత ప్రమాణాలను పాటించే విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అమరావతి క్వాంటం టవర్స్ ను త్వరితగతిన పూర్తి అయ్యేలా చూడాలని సీఎం స్పష్టం చేశారు. భూములు కేటాయించిన పర్యాటక ప్రాజెక్టులు నిర్దేశిత గడువులోగా కార్యకలాపాలు ప్రారంభించేలా చూడాలని, ఈ విషయంలో ఎలాంటి మినహాయింపు లేదన్నారు.

# అక్రమాస్తుల కేసు: దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతి అరెస్టు



మంగళవారం శాంతి నివాసంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఎసిబి అధికారులు

>> కీలక డాక్యుమెంట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటిల్లో విశాఖపట్నం జిల్లా యెన్నాడలో ఒక నివాసఫ్లాట్, తాడేపల్లి మండలం కుంచనపల్లిలో మూడు అంతస్థుల భవనం, 770 గ్రాముల బంగారు ఆభరణాలు, 3 కిలోల వెండి వస్తువులు, రూ.1.15లక్షల నగదు, బ్యాంకు ఖాతాల్లో రూ.3 లక్షల క్యాష్, ఒక కారు, ద్విచక్ర వాహనం, విలువైన ఎలక్ట్రానిక్ పరి కరాలు, విలువైన గృహోపకరణాలను ఏసీబీ అధి కారులు గుర్తించారు. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న పూర్తి ఆధారాలతో శాంతి పై ఏసీబీ అధికారులు అక్రమాస్తుల కేసును నమోదు చేసి అరెస్టు చేశారు. మరిన్ని సోదాలు ఇంకా కొనసాగుతున్నాయని నిందితురాలిని విజయవాడలోని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరు పరుస్తున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. నిందితురాలు కాలింగిరి శాంతి 2020వ సంవత్సరంలో ఏపీపీఎస్సీ ద్వారా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా నియమితులయ్యారు. ఆమె విశాఖపట్నం, విజయవాడల్లో విధులు నిర్వర్తించారు. జూలై 2024 నుండి మార్చి 2026 వరకు ఆమె సస్పెన్షన్‌లో ఉన్నారు ప్రస్తుతం పోస్టింగ్ కోసం వేచి చూస్తున్నారు.

**పలు వివాదాల్లో కాలింగిరి శాంతి:** దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ గా పనిచేసిన కాలింగిరి శాంతి వ్యవహారం గతంలో వివాదాస్పదంగా మారిన సంగతి తెలిసిందే. శాంతి పై పలు ఆరోపణలు రావడంతో ఆమెపై సస్పెన్షన్ వేటు పడింది. అదే సమయంలో శాంతి భర్త మదన్ మోహన్ మంత్రి నారా లోకేష్‌ను కలిసి తన భార్యపై ఫిర్యాదు చేశారు. నాటి వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి తన భార్య శాంతిని లోబర్చుకొని విశాఖలో ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకు పెద్దఎత్తున భూములు కొల్లగొట్టారని ఫిర్యాదు చేశారు. తాను ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్యాకింగ్‌లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేస్తున్నానని విజయసాయి రెడ్డి అక్రమాలు, అసాంఘిక కార్యకలాపాలపై పోరాడుతున్నందుకు తనను ఇటీవల హైదరాబాద్ నుంచి కోల్‌కతాకు బదిలీ చేయించారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తనకు న్యాయం చేయాల్సిందిగా రాష్ట్రపతి, ప్రధాని కార్యాలయాలతో పాటు రాష్ట్ర హోంమంత్రి, డీజీపీలను కలిసి మదన్ మోహన్ విన్నవించారు.

# పెట్టుబడులు, పరిశ్రమల గ్రౌండింగ్‌పైనే దృష్టి

>> పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

**ఒప్పందాలు చేసుకున్న 787 కంపెనీలను ట్రాక్ చేస్తాం:** 20 లక్షల ఉద్యోగాల కల్పన ప్రజా ప్రభుత్వ వాగ్దానమని, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యంగా ప్రతిఒక్కరు కంకణబద్దులై పనిచేయాలని మంత్రి లోకేష్ అన్నారు. నైపుణ్యం పోర్టల్ మాదిరిగానే ప్రతిఒక్క ఉద్యోగాన్ని ఆధార్ ,ఈ కే వైసీ లింకేజీతో ట్రాక్ చేయాలని మా దృష్టిలో చిన్న పరిశ్రమలు, పెద్ద పెట్టుబడులు రెండూ సమానమేనని అన్నారు. ఉద్యోగాల కల్పనే ముఖ్యమని పరిశ్రమల స్థాపన, అనుమతుల విషయంలో సింగపూర్, దుబాయ్ కంటే సులభతరంగా ఉండాలన్నారు. పరిశ్రమలకు అవసరమైన అన్ని శాఖలవారీ అనుమతులు, ఎన్వోసీలను మ్యాపింగ్ చేసి వాటి స్థితి, గడువు ట్రాకింగ్ వ్యవస్థను అభివృద్ధి చేయాలని తెలిపారు. పెట్టుబడులు గ్రౌండింగ్ పై అధికారులు ప్రధానంగా దృష్టిసారించాలని సమస్యలను గుర్తించాలని. దీనిపై ప్రతివారం సమీక్షి స్తామని అన్నారు. ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకున్న 787 కంపెనీలను ట్రాక్ చేస్తామని, ఈడీబీని మరింత బలోపేతం చేస్తామని ప్రతి శాఖ ఈడీబీ ట్రాకర్ ను పర్యవేక్షి ంచేందుకు సింగిల్ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ ను నామినేట్ చేయాలని ఆదేశించారు. ఎంఎస్ఎంఈ పార్క్ లు, టెక్స్ టైల్ ఇండస్ట్రీకి పవర్ బ్యాంకింగ్ అంశాలపైనా ఈ సమా వేశంలో చర్చించారు. ఈ కార్యక్రమంలో మం త్రులు టీజీ భరత్, కొల్లు రవీంద్ర, పి.నారాయణ, గొట్టిపాటి రవికుమార్, కందుల దుర్గేష్, కొండపల్లి శ్రీనివాస్ తో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రుషికొండ భవనాలకు మోక్షం!

>> మరోసారి చర్చలు జరిపింది. రుషికొండ భవనాల వినియోగంపై ఏర్పాటైన కేబినెట్ సబ్ కమిటీ అధ్యయన తుది నివేదిక సిద్ధం చేసింది. సచివాలయంలో మంత్రి కందుల దుర్గేష్ కార్యాలయంలో సబ్ కమిటీ 5వ సారి భేటీ అయింది. మంత్రులు పయ్యావుల కేశవ్, డోలా వీరాంజనేయస్వామి వర్చువల్‌గా భేటీకి హాజరయ్యారు. గత 4 భేటీల్లో తీసుకున్న నిర్ణయాలపై చర్చించిన మంత్రులు, తీసుకోవాల్సిన అంశాలపై తుది నివేదికను సిద్దం చేశారు. రుషికొండ ప్యాలెస్‌ను ప్రజల సందర్శనకు అనుమతించడంతో పాటు, ప్రభుత్వానికి ఆదాయ వనరుగా మార్చే దిశగా చర్చలు జరిగాయి. రుషికొండ ప్యాలెస్‌ను ప్రజల సందర్శనకు అనుమతించడంతో పాటు, ప్రభుత్వానికి ఆదాయ వనరుగా మార్చే దిశగా చర్చలు జరిగాయి. సీఆర్ జెడ్ నిబంధనల ప్రకారం హిల్ టాప్ పైన 2400 చదరపు మీటర్లు, కొండ కింద మరో 2400 చదరపు మీటర్లు మొత్తంగా 4800 చదరపు మీటర్ల భూమి అందుబాటులో ఉన్నట్లు కమిటీ గుర్తించింది. అందుబాటులో ఉన్న భూమి ఆధారంగా ఏ రకంగా ముందుకు వెళ్లాలన్న దానిపై కమిటీ ఆలోచన చేసింది. ఈ భవనాల నిర్వహణకు తాజ్, ఎట్మాస్పియర్ కోర్, లీలా, ఫెమా వంటి అంతర్జాతీయ హోటల్ గ్రూపులు ఆసక్తి చూపుతున్న దృష్ట్యా ముందుకు వచ్చే సంస్థలకు కూడా అవకాశం కల్పించే అంశంపై కమిటీ చర్చించింది. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్ర కేబినెట్‌లో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని మంత్రి దుర్గేష్ తెలిపారు.

# రూ.25కోట్ల కుచ్చు టోపీ!

>> ఆదాయం నిలిచిపోవడంతో బాధితుల్లో ఆందోళన మొదలైంది. అలాగే నిర్వాహకుల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో తాము మోసపోయామని గ్రహించిన మహిళలు, రాజమండ్రిలోని సంస్థ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. అప్పులు చేసి మరీ డబ్బులు కట్టామని, ఇప్పుడు తమ పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సత్యసాయి ఎంటర్ ప్రైజెస్ పేరుతో వ్యాపారం చేయడానికి తమ వద్ద నుంచి సుమారు 25కోట్ల వరకు డిపాజిట్లు కట్టించుకుని బోర్డు తిప్పేసిన నిర్వాహకుడిని వెంటనే అరెస్టు చేసి తమకు న్యాయం చేయాలని బాధితులు రాజమండ్రి త్రీటౌన్ పోలీస్ స్టేషన్ వద్ద డిమాండ్ చేశారు. స్థానిక గోకవరం బస్టాండ్ వద్ద సత్య సాయి ఎంటర్ ప్రైజెస్ పేరుతో అగరబత్తీలు, దూప్ స్టిక్స్, పేపర్ ప్లేట్లు తదితర వస్తువులు తయారు చేసి ఇచ్చేందుకు అవసరమైన మిషనరీ ఇప్పిస్తానని సుమారు 200 బాధితుల వద్ద నుంచి 25 కోట్ల వరకు వసూలు చేసిన నిర్వాహకులు బోర్డు తిప్పేసారని వారు తెలిపారు. తాము తయారు చేసిన వస్తువులను మళ్లీ అతడే కొనుగోలు చేసేలా ఒప్పందం కుదుర్చుకున్నాడు. అతడి ఆచూకీ పత్తా లేకుండా పోవడంతో బాధితులు త్రీ టౌన్ వద్దకు చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేసారు. అతడి ఫోన్ను ట్రాక్ చేస్తున్నామని, నిందితుడిని త్వరలోనే అరెస్టు చేస్తామని వారికి భరోసా ఇచ్చారు. తణుకు, రావులపాలెం, భీమవరం ఏరియాల్లో మేనేజర్లను కూడా నియమించుకుని వారి వద్ద నుంచి పెద్ద ఎత్తున డిపాజిట్లు వసూలు చేసినట్టు బాధితులు చెబుతున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు రాజమండ్రి త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# పాఠ్యాంశాల నవీకరణ

>> ఇతర పేర్లతో ఎక్కువ ఛార్జీలు వసూలు చేయడానికి వీల్లేదు. దీనిపై పటిష్ట నిఘా పెట్టాల్సి అని ముఖ్యమంత్రి ఆదేశించారు.

**కాలేజ్ కరిక్యులంను రీస్ట్రక్చర్ చేయాలి:** కాలేజీ విద్యను మరింత పటిష్టంగా తీర్చిదిద్దాలి. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా కాలేజీ విద్యను రీ ఓరియేంటేషన్ చేయాల్సి ఉంది. ఈ మేరకు అధ్యయనం చేయండి. యూనివర్శిటీలతో నిత్యం అనుసంధానం చేసుకోవాలి. ట్రెడిషన్ కోర్సులతో పాటు... డిమాండ్ ఉన్న కోర్సులను, కొత్త కరిక్యులంను ప్రవేశపెట్టేలా కసరత్తు చేయాలి. ఈ మేరకు కరికుల్యంను రీస్ట్రక్చర్ చేసేలా చూడాలి. అలాగే యూనివర్శిటీల ర్యాంకింగులు కూడా మరింతగా పెరగాల్సి ఉంది. విశాఖలోని ఆంధ్రా యూనివర్శిటీ తోపాటు, మిగిలిన యూనివర్శిటీలు కూడా ర్యాంకింగులను మరింతగా పెంచుకోవాల్సి ఉంది. ఇదే సందర్భంగా హయ్యర్ ఎడ్యుకేషనల్ కౌన్సిల్ కూడా మరింత యాక్టివ్‌గా ఉండాలి. ఈ మేరకు విద్యా శాఖ అధికారులు కృషి చేయాలి. మధ్యాహ్న భోజన పథకం విషయంలో ఎలాంటి ఫిర్యాదులు కానీ... విమర్శలు కానీ రాకూడదు. శాప్ విభాగం తన యాక్టివిటీని మరింత పెంచుకోవాలి. 5కే రన్ వంటి కార్యక్రమాలు చేపట్టాలి. ప్రజల్లో, యువతలో ఆరోగ్య రక్షణ పట్ల అవగాహన కల్పించేలా శాప్ చర్యలు చేపట్టేలా శాప్ చర్యలు తీసుకోవాలి. రోడ్డు ప్రమాదాలు తగ్గించేలా చర్యలు తీసుకోవాలి. ప్రజల్లో అవగాహన కల్పించాలి. ట్రిపుల్ రైడింగ్ వల్ల ఎక్కువ ప్రమాదాలు.. మరణాలు జరుగుతున్నాయి. ఇలాంటి వాటిని నివారించాలి. కఠినంగా నిబంధనలు అమలు చేయడానికంటే ముందు... ప్రజలను ఎడ్యుకేట్ చేయాలి. హెల్మెట్ వల్ల ప్రమాదాల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించాలి. ట్రాఫిక్ నిబంధనలు తమ కోసమేననేది ప్రజలు అర్థం చేసుకునేలా అవగాహన కల్పించాలి. విద్యుత్, కేబుల్ తీగలు కిందకు వేలాడుతున్న కారణంగా అగ్ని ప్రమాదాలు జరిగి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇలాంటివి ఇకపై జరగడానికి వీల్లేద్దు అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**పిడుగుపాటుపై మరింత అప్రమత్తత అవసరం..**

"పిడుగు పాటుకు ప్రజల ప్రాణాలు పోకూడదనే ముందస్తుగా అలెర్ట్ మెసేజ్‌లు పంపిస్తున్నాం, అయినా అక్కడక్కడా మరణాలు సంభవిస్తున్నాయి. టెక్నాలజీని వినియోగిస్తున్నాం కానీ ప్రజల్లో దానిపై అవగాహన కలిగించేలా చేయకుంటే ఏం ఉపయోగం? ఫోన్లల్లో మెసేజీలు పెట్టడమే కాదు, క్షేత్ర స్థాయిలో ఉన్న సిబ్బందినీ అలెర్ట్ చేయాలి. అలాగే ఫలానా టవర్ లోకేషన్ పరిధిలో పిడుగులు పడే ప్రమాదం ఉందని నెట్ వర్క్ ద్వారా ప్రజలకు తెలియచేసేలా చూడాల్సి అని సీఎం ఆదేశించారు. సమీక్ష అనంతరం ఆర్టీజీఎస్ రూపొందించిన అవేర్2.0 మొబైల్ యాప్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సమీక్ష సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జలసంరక్షణపై ప్రజల్లో చైతన్యం

>> నరేంద్ర మోడీ ఆశయానికి అనుగుణంగా ముందుకు వెళ్తాం. కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకంలో నీటి పొదుపు చర్యలు తీసుకుంటాం. జల్ జీవన్ మిషన్ 2.0 కార్యక్రమంలో భాగంగా నీటి సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తాం. నీటిని జాగ్రత్తగా వినియోగించుకునేలా, వృథా నీటిని పునర్వినియోగించుకునేలా ప్రజల్లో అవగాహన తీసుకురావడం ప్రధానం. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 100 రోజుల నీటి వినియోగ డ్రైవ్ అనే కార్యక్రమాన్ని ఈ ఏప్రిల్ 6వ తేదీ నుంచి జూలై 14వ తేదీ వరకు చేపట్టింది. దీనిలో ప్రజల్లో చైతన్యం కలిగించి భూగర్భ జలాల పెంపుదల, నీటి వృథాను అడు కోవడం, నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవడం, వర్షపు నీటిని ఒడిసి పట్టడం వంటి చర్యలను తీసుకుంది. ప్రకృతిలో మన జీవనం.. జీవితం ముడిపడి ఉందనేది భారతీయ సంస్కృతికి మూలం. ప్రకృతిని కాపాడుకుంటే, ప్రకృతి మనకు మంచి చేస్తుందన్నారు. ఈ వర్క్‌షాపులో పంచాయతీరాజ్, గ్రామీణా భివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూ షణ్ కుమార్, కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ డా.పి కృష్ణయ్య గారు, ఏపీ ఎస్ఐఆర్డీ కమిషనర్ ముత్యాల రాజు అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రాజ్ కెసిరెడ్డికి బెయిలు మంజూరు

>> మంజూరు చేసింది.

**రాజ్ కెసిరెడ్డిపై ఉన్న ప్రధాన ఆరోపణలు:** రాష్ట్రంలో మద్యం సరఫరా ప్రక్రియను తన గుప్పిట్లోకి తీసుకోవడం. వివిధ డిస్టిలరీల నుంచి భారీ ఎత్తున ముడుపులు వసూలు చేయడం. ప్రైవేట్ వ్యక్తులతో కుమ్మక్కై ప్రభుత్వ ఖజానాకు నష్టం చేకూర్చడం.

# అటు ఎండ.. ఇటు వాన

>> తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయని అధికారులు తెలిపారు. ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, మార్కాపురం ప్రాంతాల్లో జల్లులు పడే అవకాశం ఉందన్నారు. వేసవి తీవ్రతను, వడగాల్పులను ఎప్పటికప్పుడు అంచనా వేసేందుకు ప్రభుత్వం 'అవేర్'ప్లాట్‌ఫామ్‌ను ఉపయోగిస్తోంది. రానున్న 4,5 రోజుల్లో ఎండల తీవ్రత ఎలా ఉంటుందనే సమాచారాన్ని దీని ద్వారా ముందుగానే తెలుసుకుంటారు. ఏ ప్రాంతాల్లో వడగాల్పులు ఎక్కువగా ఉంటాయో గుర్తించి, ఆ సమాచారాన్ని జిల్లా కలెక్టర్లకు, సంబంధిత అధికారులకు చేరవేస్తారు. ప్రస్తుతానికి తీవ్ర వడగాల్పులు లేకపోయినా, రానున్న రోజుల్లో ఎండలు పెరిగే అవకాశం ఉందని, వడదెబ్బ తగలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

## వారం - వర్జ్యం

08-04-2026, బుధవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, కృష్ణపక్షం, రేవతి కార్తె
షష్ఠి రా.7.01
మూల పూర్తి
వర్జ్యం : లేదు
దు.ఉ.11.44-మ.12.34
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం:** జీవిత భాగస్వామితో స్వల్ప విభేదాలు తలెత్తుతాయి. సంతాన విద్యా విషయంలో స్థిరమైన నిర్ణయం తీసుకుంటారు.

**వృషభం:** మీ ఆధ్వర్యంలో నడిచే సంస్థలకు కొన్ని అవార్డులు రావచ్చు. ఆరోగ్యపరంగా కొన్ని జాగ్రత్తలు అవసరం.

**మిథునం:** వృత్తి, ఉద్యోగాల పరంగా మీ వ్యక్తిగత రహస్య సమాచారం ఇతరులకు చేరుతుంది. మీ నిర్లక్ష్యం వలనే జరుగుతుంది.

**కర్కాటకం :** మీవైరి వర్గానికి కొమ్ముకాస్తున్న వారు బలహీనులవడం మీకు ఆయాచితవరంగా మారుతుంది. వాహనసౌఖ్యం.

**సింహం:** ఆర్థిక పురోభివృద్ధి, పొదుపు మొదలగు అంశాలు నామ మాత్రంగా ఉంటాయి. నూతన విద్యావకాశాలు కలవు.

**కన్య :** మహోన్నతమైన పనులు సాధించుకోవడానికి ముఖ్యవ్యక్తుల సహకారం అవసరం లేదని నిరూపిస్తారు.

**తుల :** అప్రయత్నంగా పనులు చేస్తారు. ఇంటిలో శుభకార్యాలు నిర్వహిస్తారు. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. వస్త్రలాభం.

**వృశ్చికం:** స్థిరాస్తి తగాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. కొత్త పెట్టుబడులకు తగిన సాయం అందుతుంది.

**ధనుస్సు:** పరిశ్రమలు, వ్యాపారాలలో ఎదరైన ఆటంకాలు తొలుగుతాయి. శత్రువులు సమస్యలు సృష్టించినా అధిగమిస్తారు.

**మకరం:** కాంట్రాక్టులు లభిస్తాయి. విదేశాల నుండి అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు. ఋణాలు తీరుస్తారు.

**కుంభం:** కార్యాలయంలో ఉన్నతాధికారులు మీ సేవలను పరిజ్ఞానంను వినియోగించుకుని లాభపడతారు.

**మీనం :** ఊహించని రీతిలో అవకాశాలు దగ్గరకు వస్తాయి. సద్వినియోగం చేసుకోండి. ప్రయాణాలు లభిస్తాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోలి, హైదరాబాద్

# ప్రతిక్షణం..అగ్నిగోళం



**టెహ్రాన్, టెల్‌అవీవ్, వాషింగ్టన్, ఏప్రిల్ 7:** మధ్యప్రాచ్యం మరోసారి బాంబులు క్షిపణులతో అట్టుడికిపోతోంది. ఇరాన్‌తమతో ఒప్పందానికి రావాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ ఇచ్చిన గడువు ముగియడంతో ఇక కాల్పులు ప్రారంభిస్తామని ట్రంప్ చేసిన హెచ్చరికలు ఇరాన్‌లో ఉద్రిక్తతలను మరింతపెంచాయి. ఇంధన కేంద్రాలు, విద్యుత్ కేంద్రాలు, వంతెనలను పేల్చివేస్తామన్న ట్రంప్ హెచ్చరికలను బేఖాతరుచేస్తూ ఇరాన్ ప్రజలు వేలాదిగా ఇళ్లనుంచి బయటకు వచ్చి విద్యుత్, ఇంధన కేంద్రాలవద్ద మానవ హారాలుగా ఏర్పడ్డారు. వందలాదిమంది వంతెనలపైకి కూడా చేరుకుని తమ దేశభక్తిని చాటుకున్నారు. ఇరాన్ జాతీయ జెండాలను చేతపట్టుకుని కొందరు, అతిపెద్ద జాతీయ పతాకంతో విద్యుత్, ఇంధన కేంద్రాలవద్ద వేలాదిగా ప్రజలు మానవహారంగా ఏర్పడి రక్షణకవచంగా నిలిచి ఉన్న విడియోలు వైరల్ అయ్యాయి. ఈ పరిస్థితులను నిశితంగా గమనిస్తున్న అమెరికా ఇజ్రాయెల్‌లు మాత్రం తమ దాడులు ఆపడంలేదు. ఇజ్రాయెల్ ఇప్పటికి ఇరాన్‌పై దాడులుచేస్తూనే ఉంది. అలాగే ఇరాన్ చమురు కేంద్రంగా భావిస్తున్న ఖర్గ్ దీవిపై మరోసారి అమెరికా దాడులుచేసింది. నావికా దళాలతో ఖర్గ్‌దీవిని స్వాధీనంచేసుకోవాలన్న వ్యూహంతో అమెరికా ముందుకుపోతోంది. ఇరాన్‌కు చెందిన 50 టార్గెట్లపై దాడులుచేసినట్లు చెపుతోంది.

ఇజ్రాయెల్‌కూడా ఇరాన్‌రైల్వేలు, కీలక మౌలికవనరుల వ్యవస్థలపై దాడులు చేసినట్లు చెపుతోంది. ప్రత్యేకించి పెట్రోకెమికల్ ప్లాంట్లే లక్ష్యంగా దాడులుచేస్తోంది. ఇరాన్‌కు గడువు ముగిసిన తరుణంలోనే పశ్చిమాసియా సముద్రజలాల్లో ఉంచిన అమెరికా అతిపెద్దనౌక అబ్రహాంలింకన్‌నుంచి యుద్ధవిమానాలు ఇరాన్ వైపు తరలివెళ్లడం చూస్తుంటే ఇక ఇరాన్‌ను తీవ్రస్థాయిలోనే దెబ్బతీసేందుకు ఇజ్రాయెల్, అమెరికాలు కంకణం కట్టుకున్నట్లు తెలుస్తోంది. ట్రంప్‌తన సోషల్‌మీడియా ట్రూత్‌పోస్టులో 47 ఏళ్లుగా సాగిన నియంతృత్వం, ఏకపక్ష పాలన అంతం కానునన్నదని, 47ఏళ్ల అవినీతి, దోపిడీరాజ్యం అంతం కావడం ఖాయమన్న పోస్టుపై ఇరాన్ కూడా అంతే ధీటుగా స్పందించింది. ఆనాటి మొత్తం నాగరికత ఈరోజు రాత్రితో అంతం అవుతుందని పోస్టులో పేర్కొనడంపై ఇరాన్ ఘాటుగా స్పందించింది. అధ్యక్షుడు పెజెష్కియాన్ స్వయంగా తనతో పాటు ఇరాన్‌ప్రజలు సైతం ప్రాణత్యాగాలకు సిద్ధమేనని, దేశం కోసం తామంతా ఒక్కటిగా ఉన్నట్లుప్రకటించారు. ఎలాంటి చర్యలకు పాల్పడినా అమెరికా, ఇజ్రాయెల్‌లకు అంతే ధీటుగా స్పందన ఉంటుందని హెచ్చరించారు. ఇదిలా ఉంటే గల్ఫ్‌ఆఫ్ ఒమన్‌లో కీలకంగా ఉన్న ఎర్రసముద్రంలోని బాబ్ అల్‌మండెబ్ జలసంధిని మూసివేస్తామని హౌతీలు హెచ్చరించడంతో ఇపుడు హార్ముజ్‌తోపాటు రెండోజల సంధికూడా మూతపడుతుం డటంతోప్రపంచ దేశాలకు చమురురవాణాలో తీవ్ర ఆటంకాలు ఎదురవుతాయన్న ఆందోళన మొదలయింది. మరోవైపు హార్ముజ్ జలసంధిని తెరవకుంటే ఇరాన్‌కు తీవ్రస్థాయిలో నాశనం తప్పదని ట్రంప్ చేసిన హెచ్చరికలను కూడా ఇరాన్ ఖాతరుచేయలేదు.

శతృదేశాలుమినహా ఇతర దేశాలన్నింటికీ ప్రస్తుతం హార్ముజ్‌నుంచి నౌకలు వెళుతున్నాయని గుర్తుచేసింది. తెరిచే ఉన్న హార్ముజ్‌పై ఎందుకింత ట్రంప్‌నకు ఆరాటం కేవలం తమ చమురుకేంద్రాలు స్వాధీనంకోసమేనని, యురేనియం నిల్వలు అక్రమంగా స్వాధీనంచేసుకోడానికేనని ప్రత్యారోపణలుచేసింది. అలాగే ఇరాన్‌సైతం గల్ఫ్‌దేశాలపై తన దాడులను ఎక్కడా ఆపిన దాఖలాలులేవు. మంగళవారం కూడా ఎయిర్‌పోర్టులు, చమురుశుద్ధికేంద్రాలు, గ్యాస్ రిఫైనరీలపై దాడులు చేసినట్లు ప్రకటించింది. అలాగే అమెరికాతో కొనసాగించతలపెట్టిన అన్ని చర్చలను, సంప్రదింపుల నిర్ణయాలనుకూడా ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించిన ఇరాన్ తనవంతు రక్షణకవచాల ఏర్పాటులో తలమున కలయింది. 48గంటలపాటు రైళ్లలోప్రయాణించవద్దంటూ ఇజ్రాయెల్‌చేసిన హెచ్చరికలను బట్టి ఇక రైల్వేస్టేషన్లు, ఎయిర్‌పోర్టులే లక్ష్యంగా దాడులుచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడి అయింది.

# అందుబాటులోకి ఎన్టీఆర్ వైద్యసేవలు

**విజయవాడ,ఏప్రిల్ 7,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో ఎన్టీఆర్(ఆరోగ్యశ్రీ) సేవల బంద్‌కు తాత్కాలికంగా సంబంధిత నెట్‌వర్క్ ఆస్పత్రులు విరమించాయి. ఇందుకు సంబంధించి వైద్య ఆరోగ్యశాఖా అధికార యంత్రాంగం వారితో చర్చలు జరిపింది. పది రోజుల్లో బకాయిలు చెల్లిస్తామని రాతపూర్వకంగా హామీ ఇచ్చిన ట్రస్ట్ అడిషనల్ సీఈవో రూ.వెయ్యికోట్లు వడ్డీతో కలిపి చెల్లిస్తామని ప్రకటించారు. నెలకు రూ.150కోట్ల నుంచి రూ.170 కోట్లు విడుదల చేస్తామని, యూనివర్సల్ హెల్త్ స్కీంపై కమిటీ ఏర్పాటు చేసి కమిటీ నిర్ణయం తర్వాత యుహెచ్‌సీ అమలు చేస్తామని పేర్కొన్నారు.

# వీధి కుక్కల దాడిలో చిరుతపులి పిల్ల మృతి



**దువ్వూరు, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** కడప జిల్లా మైదుకూరు నియోజకవర్గంలోని దువ్వూరు మండలం చిన్న భాకరాపురం గ్రామంలో మంగళవారం వీధి కుక్కల దాడిలో చిరుత పులి పిల్ల మృతి చెందినట్లు గ్రామస్థులు గుర్తించారు. సుమారు 11 గంటల ప్రాంతంలో గ్రామంలోని కుక్కలు ఎక్కువగా అరుపులు వేశాయని అయితే అవి ఎందుకు వేస్తున్నాయో గమనించలేదని తెలిపారు. వీధి చివర ఎవరైనా కొత్త మనుషులు వచ్చారేమో అని పరిశీలించామని ఎవరు లేనట్టు తెలుసుకొని వెళ్ళిపోయామన్నారు. అనం తరం ఉదయం ఆ ప్రాంతంలో ఉన్న రైతులు పొలాల వద్దకు వెళ్లగా సమీపంలో చిరుత పులి పిల్ల మరణించి ఉండటం పై గమనించారు. వెంటనే ఈ విషయాన్ని ఫారెస్ట్ అధికారులకు ఫోన్ ద్వారా తెలి యజేశారు. ఈ విషయం తెలుసుకున్న వనిపెంట డిఆర్‌ఓ అన్వర్ హుస్సేన్, బీట్ ఆఫీసర్ సుచరిత, సిబ్బంది కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. చిరుతపులి పిల్ల ఏ విధంగా మరణించింది అనే వివరాలను రైతులతోనూ, గ్రామస్తులతోనూ ఆరా తీశారు. ఎక్కడైనా విద్యుత్ తీగలు ఏమైనా ఉన్నాయా లేక ఇతర సంఘటనలు ఏమైనా జరిగాయా అని తనిఖీ చేశారు. చిరుత పులి పిల్లను పోస్టుమార్టం నిమిత్తం దువ్వూరు పశు వైద్యశాలకు తరలించారు. అక్కడ పశు వైద్యాధికారి డాక్టర్ ఫణింద్ర రెడ్డి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం వనిపెంట ఫారెస్ట్ అధికారి అన్వర్ హుస్సేన్ మాట్లాడుతూ చిరుత పులి పిల్లను వీధి కుక్కలు గాని, అడవి కుక్కలు కానీ దాడి చేసి ఉంటాయని భావిస్తున్నామని అయితే చివరగా పోస్ట్ మార్టం నివేదిక అలాగే ల్యాబ్ పరీక్ష నివేదిక వచ్చిన తర్వాతే విచారణ చేస్తా మన్నారు. దాని వయస్సు సుమారు 1సంవత్సరం పైగా ఉంటుందని తెలిపారు. ఈ సంఘటనపై ఫారెస్ట్ అధికారులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## స్వదేశీ పరిజ్ఞానంతో క్రిటికాలిటీని సాధించడం దేశానికి గర్వకారణం

### - సిఎం చంద్రబాబునాయుడు

**విజయవాడ,ఏప్రిల్ 7,ప్రభాతవార్తప్రతినిధి:** పకల్పక్కంలో స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన ప్రోటోటైప్ ఫాస్ట్ బ్రీడర్ అణు రియాక్టర్ క్రిటికాలిటీని సాధించడంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఇది ప్రతి భారతీయుడు గర్వించదగ్గ క్షణమని, దేశ పౌర అణు ప్రస్థానానికి ఇదొక గొప్ప ప్రోత్సాహమని ఆయన అన్నారు. ఈ చరిత్రాత్మక విజయం సాధించిన శాస్త్రవేత్తలు, ఇంజనీర్లకు చంద్రబాబు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సోషల్ మీడియాలో స్పందిస్తూ, "భారత అణు కార్యక్రమం రెండో దశలో ఇది ఒక కీలక ముందడుగు. ఈ విజయంతో మన దేశంలో ఉన్న విస్తారమైన థోరియం నిల్వలను మూడో దశలో వినియోగించుకోవడానికి మరింత చేరువయ్యాం" అని వివరించారు. ఈ పరిణామం దేశ దీర్ఘకాలిక ఇంధన భద్రతకు మార్గాన్ని బలోపేతం చేస్తుందని అభిప్రాయ పడ్డారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోనే ఇంధన భద్రత దిశగా దేశం బలమైన అడుగులు వేస్తోందని చంద్రబాబు ప్రశంసించారు. శాస్త్ర, సాంకేతిక రంగాలలో స్వయం సమృద్ధి సాధించడంలో ఇటువంటి విజయాలు ఎంతో స్ఫూర్తినిస్తాయని ఆయన పేర్కొన్నారు.

## కేంద్ర మంత్రులను కలిసిన విద్యా భారతి ప్రతినిధి బృందం

### ఉచిత సివిల్ సర్వీసెస్ కోచింగ్ కార్యక్రమానికి ఆహ్వానం

**గుంటూరు ఏప్రిల్ 7 ప్రభాత వార్త ప్రతినిధి :** రాష్ట్ర వెటర్నరీ కౌన్సిల్ ఛైర్మన్ డాక్టర్ పారా వెంకట లక్ష్మయ్య, స్వచ్ఛ ఆంధ్ర మిషన్ మాజీ ఛైర్మన్ డాక్టర్ సి.ఎల్. వెంకటరావు, విద్యా భారతి సౌత్ సెంట్రల్ జోన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ లింగం సుధాకర్ రెడ్డిలు మంగళవారం ఢిల్లీలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారాంలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విజయవాడ సమీపంలోని కేతనకొండలో పార అసోసియేషన్ ఫర్ రూరల్ డేవేలప్మెంట్ (పార్డ్), సీబీఆర్ అకాడమీ, డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ స్టడీ సర్కిల్ సంయుక్త ఆధ్వర్యంలో 200 మంది యువతి యువకులకు మూడు సంవత్సరాలపాటు ఉచిత సివిల్ సర్వీసెస్ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు ఉచిత కోచింగ్‌తో పాటు ఉచిత నివాసం, భోజన ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా కేతనకొండలో విద్యా భారతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నేతాజీ సైనిక్ స్కూల్ శిక్షణ తరగతుల ప్రారంభోత్సవానికి కేంద్ర మంత్రులను ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన కేంద్ర మంత్రులు హాజరవుతారని తెలిపారు. పేద, ప్రతిభావంతులైన విద్యార్థులకు మూడు సంవత్సరాలపాటు నివాస సదుపాయాలతో కూడిన ఉచిత శిక్షణ అందిస్తున్నందుకు సీబీఆర్ ప్రసాద్ , డాక్టర్ లక్ష్మయ్య , డాక్టర్ సి.ఎల్. వెంకటరావుల కృషిని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ సందర్భంగా అభినందించారు.

## దేశంలోనే ఆదర్శంగా ఎపి అగ్నిమాపక శాఖ

### అధునాతన ఫైర్ టెండర్ వాహనాలను ప్రారంభించిన సిఎం

**గుంటూరు ఏప్రిల్ 7 ప్రభాత వార్త ప్రతినిధి :** దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండేలా ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక , విపత్తుల నిర్వహణ శాఖను తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. విపత్తుల సమయంలో పొరుగు రాష్ట్రాలకు సహాయం చేసిన చరిత్ర ఏపీకి ఉందని గుర్తు చేశారు. అమరావతి పరేడ్ గ్రౌండ్‌లో అగ్నిమాపక శాఖ నూతన వాహనాలు, పరికరాలను ముఖ్యమంత్రి చంద్రబాబు జెండా ఊపి ప్రారంభించారు. రూ.252.93 కోట్లతో అగ్నిమాపక శాఖ ఆధునీకరణలో భాగంగా రూ.33.25 కోట్ల విలువైన వాహనాలు, వివిధ పరికరాలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. రూ.18 కోట్ల వ్యయంతో తొలిదశలో 25 అధునాతన అగ్నిమాపక శకటాలు, రూ.10 కోట్లతో హై ప్రెషర్ పంప్‌లు కలిగిన 40 క్విక్ రెస్పాన్స్ వాహనాలు, రూ.2.49 కోట్లతో 50 ఇన్‌ఫ్లేటబుల్ రబ్బర్ బోట్లు, రూ.2.08 కోట్లతో 30 బీఏ సెట్ కంప్రెసర్లను కొనుగోలు చేసింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ప్రజల ప్రాణాలు కాపాడడానికి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అమరావతి రాజధానితో పాటు ఇప్పుడు ప్రధాన నగరాల్లో హై రైజ్డ్ బిల్డింగ్‌లు నిర్మాణం అవుతున్నాయని.. వాటికి అనుగుణంగా అగ్నిమాపక శాఖ అన్ని విధాలా ఆధునిక పరికరాలు సమకూర్చుకోవాలని సీఎం సూచించారు. అన్ని సవాళ్ళను అధిగమించి కేంద్ర పథకాలను, రాష్ట్ర ప్రభుత్వ నిధులను సద్వినియోగం చేసుకుని అగ్నిమాపక శాఖను బలోపేతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హోం మంత్రి అనిత, స్థానిక ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్, అగ్నిమాపక శాఖ డీజీ పీవీ రమణ, హోంశాఖ ముఖ్యకార్యదర్శి కుమార్ విశ్వజిత్, పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



## వేడిగాలుల నివారణకు ముందస్తు చర్యలు

### - వేసవిలో తాగు నీటి కొరత లేకుండా కృషి : కలెక్టర్ వెంకటేశ్వర్

**తిరుపతి,ఏప్రిల్ 7ప్రభాతవార్తప్రతినిధి:** ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలతో తిరుపతి జిల్లాలో వేసవి కాలంలో త్రాగు నీటి ఎద్దడిని, వడగాలులు నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్ పేర్కొన్నారు. వేడిగాలులకారణంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామీణ ,పట్టణ ప్రాంతాల్లో తాగునీటి కొరత లేకుండా బోర్లు, పైపులైన్లు, ట్యాంకర్ల ద్వారా నీటిసరఫరాను నిరంతరం కొనసాగించాలని సూచించారు. జిల్లాలో మరమ్మతుకు గురైన చేతి పంపులను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకొని వినియోగంలోకి తీసుకురావాలన్నారు. వడ దెబ్బ కేసులను ఎదుర్కొనేందుకు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు సిద్ధంగా ఉండాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఔషధాలు అందుబాటులో ఉంచాలని వైద్య అధికారులకు తెలిపారు. ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రజలు అత్యవసమైతే తప్ప మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలనే సందేశాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. మంగళవారం సాయంత్రం తిరుపతి కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌నుండి జిల్లా అధికారులతో ప్రత్యక్షంగా, రెవెన్యూ డివిజన్, మండల, మున్సిపల్ కమిషనర్లు, తదితర అధికారులతో వర్చువల్ గా పలు అంశాలపై జిల్లా కలెక్టర్ సమీక్షించారు. జనాభా లెక్కల ప్రక్రియను అత్యంత ఖచ్చితత్వంతో నిర్వహించాలని, ప్రతి ఇంటి వివరాలను సక్రమంగా సేకరించి, డేటా నమోదు ప్రక్రియలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. ప్రభుత్వ ప్రణాళికలకు ఇది ఆధారంగా ఉండే కీలక సమాచారం కాబట్టి బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. పీ-3 కార్యక్రమం కింద గ్రామీణ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, గ్రామాల అభివృద్ధి, మౌలిక వసతుల మెరుగుదల, జీవనోపాధి అవకాశాల పెంపు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ, ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థవంతంగా ప్రజలకు అందించాల్సిన బాధ్యత ఉందని కలెక్టర్ తెలిపారు. క్షేత్రస్థాయిలో అధికారులు పర్యవేక్షణ పెంచి, ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వం చేపట్టిన ప్రతి కార్యక్రమం ప్రజల సంక్షేమం కోసం కాబట్టి, అమలులో ఎటువంటి నిరక్ష్యం ఉండకూడదని కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్. భరత్ నాయక్, అటవీ అధికారి పవన్ కూమార్, డి ఆర్ డి ఎ పి డి శోభన్ బాబు, డ్వామా పిడి శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ అధికారి ప్రసాద రావు, సిపిఓరాజశేఖర్ ,జి ఎస్ డబ్ల్యూ ఎస్ కోఆర్డినేటర్ జగదీష్, జిల్లా ఆరోగ్య అధికారి బాలకృష్ణ నాయక్, డి సి హెచ్ ఎస్ ఆనంద మూర్తి, డి ఎస్ ఒ రాజు తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వానికే ఆమె 'హెడ్' కానిస్టేబుల్..



హెడ్‌కానిస్టేబుల్ రేవతి

**9 మంది పోలీసు అధికారులకు మరణశిక్ష వేయించింది ఆమె వాంగ్మూలమే**

**సాతంకుళం తండ్రి, కొడుకు లాకప్‌డెత్ కేసులో ఆమె సాక్ష్యమే కీలకం**

**పోలీసుల కాకమ్మ కథలకు తెరవేసిన సాహసి**

**డ్యూటీలోని బ్యూటీకి అద్దంపట్టిన లేడీ పోలీస్‌గా ప్రశంసలు**

**చెన్నై, ఏప్రిల్ 7:** తను ఉద్యోగంచేస్తున్న సొంతశాఖను, సాటి ఉద్యోగుల భవితవ్యాన్ని, ఉన్నతోద్యోగుల హుంకారాలను కూడా లెక్కచేయకుండా తనలోని మానవత్వాన్ని నిద్రలేపింది. చెప్పాలంటే తెగించి నిర్భయంగా సాక్ష్యం చెప్పి 9 మంది రాక్షసులను ఉరికంబమెక్కిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ రేవతి సాహసాన్ని గురించి వింటే ఆమెను అభినందించకుండా ఉండలేం.

తమిళనాడులో సాతానుకుళంలో కొవిడ్‌లో లాక్‌డౌన్ నిబంధనలు ఉల్లంఘించారన్న మిషతో ఓ తండ్రికొడుకులను లాకప్‌లో నిర్బంధించి హింసించగా వారుచనిపోయారు. అందుకు ప్రత్యక్ష సాక్షి అదే పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ ఆ తండ్రీ కొడుకులను హింసించడం కళ్లారాచూసింది. నిస్సహాయురాలై నిలబడింది. సాతంకుళం లాకప్‌డెత్‌కేసులో మదురై కోర్టు ఇచ్చిన సంచలన తీర్పునకు ఆమె వాంగ్మూలమే కీలకంగా మారింది. ఆ తండ్రీకొడుకులను లాకప్‌లో చిత్రహింసలు పెట్టి చంపిన కేసులో 9 మంది పోలీస్ అధికారులకు ఉరిశిక్ష విధిస్తూ తీర్పుచెప్పింది. ఈ లాకప్ మరణాలకు సాధారణంగా ప్రత్యక్ష సాక్షులుండరు. ఒకవేళ ఉన్నా వారు సాక్ష్యం చెప్పేందుకు బయటకు రాలేరు. ఇలాంటిపరిస్థితిలో ధైర్యం తెచ్చుకుని ఆనాడు పోలీస్ స్టేషన్‌లోజరిగింది, జరుగుతున్నది, పోలీసులు సాక్ష్యాలను తారుమారుచేసేప్రయత్నాలను లాకప్‌లో రక్తపు మరకలను తుడిచిన తీరును మేజిస్ట్రేట్‌కి వివరించి చెప్పింది. ఇదేఈ కేసులో అతికీలకమైన వాంగ్మూలంగా దోహదపడింది. ఈ ఘటన జరిగిన వెంటనే పోలీసులు సాక్ష్యాలనుతుడిచేసి కాకమ్మ కథలు చెపిచూసినా వారి పథకం పారలేదు. సాక్ష్యాలన మార్చేసారు. కేవలం డ్యూటీ మాత్రమేచేయాలని కాకుండా తన కళ్లముందు జరిగిన దారుణానికి స్పందించాలని ఆమె హృదయం పరితపించింది. బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని రేవతి నిర్ణయించుకోవడం విశేషం. ఆమె తెగువ ఇపుడు న్యాయాన్ని నిలబెట్టిందని అంతా మనసులోనే పొగుడుతున్నారు. ఆమెమేజిస్ట్రేట్‌ముందు చెప్పిన ప్రతి విషయం కేసు దిశను అమాంతం మార్చేసింది. రేవతి కేవలం ఒక స్టేట్‌మెంట్‌కే పరిమితం కాలేదు. ఆరాత్రి జరిగిన వాస్తవాన్ని కళ్లకు కట్టినట్లు చెప్పి సాక్ష్యాలు మార్చడానికి పోలీసులు పడిన అవస్థలనుప్రత్యక్షంగాచూపింది. పోలీసులు స్టేషన్‌నుశుభ్రంచేసి సాక్ష్యాలను తుడిచివేసినా ఆమె అత్యంత చాకచక్యంగా గోడల మూలల్లో టేబుళ్లకింద మిగిలిపోయిన రక్తపు మరకలను గుర్తించి మేజిస్ట్రేట్‌కు చూపించింది. ఈ రక్తపు చుక్కలేనిందితుల నేరాన్ని శాస్త్రీయంగా నిరూపించడంలోప్రధాన భూమిక పోషించాయని చెప్పాలి. సిసిటివి ఫుటేజిని మాయం చేసినా ఆమె జ్ఞాపకశక్తినుంచి అవేమీ మాయం కాకపోవడం చెప్పుకోదగిన అంశం. ఆమె అసాధారణ నిర్ణయమే నిందితులకు శిక్షపడేలా చేసింది. సాధారణ విషయం పోలీసుగా విధులునిర్వర్తిస్తూ పోలీసులకే వ్యతిరేకంగా శిక్షపడేలాచేసింది.

## పట్టపగలు తనిఖీ పేరుతో బంగారం షాపులో లూటీ

### బంగారం వ్యాపారికి బేడీలు వేసి ఉడాయించిన దొంగలు

### కిలో బంగారు ఆభరణాలు అపహరణ

### ఘటనా స్థలాన్ని పరిశీలించిన క్రైమ్ ఎఎస్పీ శ్రీనివాసరావు

**పలాస, ఏప్రిల్ 7:** పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని నిత్యం రద్దీగా ఉండే కాశీ బుగ్గ నిత్యానంద నగర్ లో ఉన్న శ్రీ వెంకటేశ్వర జ్యుయలరీ దుకాణంలో మంగళవారం చోరీ జరిగింది. రూ. 1.65 కోట్లు విలువ చేసే బంగారు ఆభరణాలను ముఠా దొంగలు దోచుకున్నారు. బంగారు యజమానికు బేడిలు వేసి లాకర్, దుకాణంలో ఉన్న బంగారు ఆభరణాలను అపహరించారు. బంగారు యజమాని, కాశీబుగ్గ పోలీసులు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కాశీబుగ్గ నిత్యానంద నగర్ లో శ్రీ వెంకటేశ్వర బంగారం దుకాణం ఉంది. కిల్లంశెట్టి రామకృష్ణరావు కొద్ది సంవత్సరాలుగా జూయలరీస్ షాపును నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో పోలీసు పేరుతో ఉన్న బనియన్లు వేసుకొని ఇద్దరు వ్యక్తులు షాపులోకి ముందుగా వెళ్లారు. అనంతరం వారి వెంట మరో ముగ్గురు వ్యక్తులు వెళ్లి రామకృ షారావు చేతికి బేడీలు వేసి పోలీసులుగా నమ్మకం కలిగించారు. అనంతరం మరో వ్యక్తి లోపలకు ప్రవేశించి ముఖంపై ముష్టిఘాతాలు కురిపిస్తు తుపాకీ తీసి బెదిరించాడు. అనంతరం బంగారు ఆభరణాలు దొంగిలించడంతో పాటు ఆయనపై ఉన్న బంగారు ఆభరణాలు సైతం దోపిడీ చేసి పరారీ అయ్యారు. సుమారు రూ. 1.65 కోట్లు విలువ చేసే ఆభరణాలు దొంగతనం జరిగినట్లు షాప్ యజమాని చెబుతున్నాడు. ఈ దోపిడీలో ఎనిమిది మంది ఉన్నట్లు తెలుస్తోంది. దొంగల చిత్రాలు సిసి కెమేరాల్లో నిర్లిప్తమయ్యాయి అయితే ముఖాలకు మాస్కులు వేసుకోవడంతో వారు ఏ ప్రాంతానికి చెందిన వారో తెలియాల్సి ఉంది. ఇదిలా ఉండగా ఈ విషయం ఒక్కసారిగా పట్టణమంతా వ్యాపించగా విషయం తెలుసుకున్న కాశీబుగ్గ సిఐ వై రామకృష్ణ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. జరిగిన ఘటనను సిఐ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్ళారు. దీంతో జిల్లా క్రైమ్ ఎఎస్పీ శ్రీనివాసరావు ఘటనా స్థలాన్ని పరిశీలించగా క్లూస్ టీం, డాగ్స్ స్క్వాడ్ టీంలు పరిశీలించాయి. దుకాణానికి దొంగల ముఠా నాలుగు ద్విచక్రవాహనాలు, ఒక కారులో వచ్చినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న సిసి కెమెరాల్లో నిర్లిప మై న దొంగలను గుర్తించారు. మొత్తం నాలుగు బృందాలు నియమించి దొంగల కోసం వెతుకుతున్నామని జిల్లా ఎఎస్పీ పి. శ్రీనివాసరావు విలేకర్లకు తెలిపారు. కొద్ది రోజుల్లోనే దొంగలను పట్టుకోవడం జరుగుతుందని ఎఎస్పి విలేకర్లకు తెలిపారు. దొంగల కోసం మొత్తం నాలుగు పోలీసు బృందాలు ఏర్పాటు. చేసారు. క్లూస్ బృందాలు, క్రైమ్ బృందాలు, డాగ్కింట్లు రంగంలో దిగి మొత్తం వ్యవహారంను పరిశీలించాయి. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ రామకృష్ణ తెలిపారు.



## అమరావతిలో ఎన్ఎఫ్‌డీబి ప్రాంతీయ కార్యాలయానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్

### - మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ,, ఏప్రిల్ 7,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతిలో నేషనల్ ఫిషరీస్ డెవలప్మెంట్ బోర్డు (వినీడితీ) ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. సీఎం చంద్రబాబు కేంద్రానికి లేఖ రాయబట్టే ఎన్ఎఫ్‌డీబీ ఏర్పాటుకు కేంద్రం ముందుకు వచ్చిందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలో ప్రముఖ ఆక్వాకల్చర్ రాష్ట్రంగా ఉండటంతో అమరావతిలో పూర్తి స్థాయి ప్రాంతీయ కేంద్రం ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటుకు అవసరమైన భూమి, ప్రాథమిక మౌలిక సదుపాయాలను రాష్ట్ర ప్రభుత్వం అందించాలని కేంద్ర మత్స్య శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ లేఖ ద్వారా తెలియజేశారని మంత్రి వెల్లడించారు. దేశంలో ఆక్వాకల్చర్ రంగంలో అగ్రగామి రాష్ట్రంగా నిలిచిన ఆంధ్రప్రదేశ్‌కు ఇది కీలక ముందడుగు అని, రాష్ట్ర మత్స్యరంగ అభివృద్ధికి ప్రధాన కేంద్రంగా మారనుందని తెలిపారు.

## ఆంధ్ర తీరంలో తమిళనాడు బోట్ల ఆగడాలు :రాష్ట్ర బిజెపి చీఫ్ పివిఎన్ మాధవ్

**విజయవాడ,ఏప్రిల్ 7,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతమైన నెల్లూరు, ఒంగోలు, బాపట్ల జిల్లాల్లో తమిళనాడు రాష్ట్రానికి చెందిన మత్స్యకారుల ఆగడాలు పెరుగుతున్నాయని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ ఆందోళన వ్యక్తం చేశారు. కడలూరు, కారేకల్ ప్రాంతాల నుంచి స్పీడ్ బోట్లలో వచ్చి అక్రమంగా ఆంధ్ర తీరప్రాంతంలోకి ప్రవేశిస్తూ స్థానిక మత్స్యకారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఇటీవల నెల్లూరు జిల్లా జువ్వలదిన్నె ప్రాంతంలో అక్రమంగా సంచరిస్తూ దౌర్జన్యానికి పాల్పడుతున్న తమిళనాడు బోట్లను స్థానిక మత్స్యకారులు నిర్బంధించిన ఘటన ఉద్రిక్తతకు దారితీసింది. ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం స్పందన ఆశించినంతగా లేదని మత్స్య కారులు భావిస్తున్నారు గత వారం నిర్బంధించిన బోట్లను రాత్రికి రాత్రే విడుదల చేసి తమిళనాడుకు పంపించడం అనేక అనుమానాలకు తావిస్తోంది దాడులకు పాల్పడుతున్న వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వల్ల స్థానిక మత్స్యకారుల్లో తీవ్ర అభద్రతా భావం నెలకొంది భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ సూచనలు: తీరప్రాంత మెరైన్ పోలీస్ స్టేషన్లను ఆధునీకరించి పటిష్టం చేయాలి. స్థానిక మత్స్యకారులను హోం గార్డులుగా భాగస్వామ్యం చేయాలి. కోస్టల్ గార్డ్ సహకారంతో మెరైన్ పర్యవేక్షణను బలోపేతం చేయాలి. 2010లో అమల్లో ఉన్న కోస్టల్ సెక్యూరిటీ టెక్నికల్ వ్యవస్థను పునరుద్ధరించి, మాజీ నేవీ సిబ్బంది మరియు స్థానిక మత్స్యకారులను తిరిగి నియమించాలి. హైస్పీడ్ పహారా బోట్లు, కమ్యూనికేషన్ సదుపాయాలు కల్పించాలి. అక్రమంగా ప్రవేశించి దౌర్జన్యాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

అవసరమైతే తమిళనాడు ప్రభుత్వంతో సమన్వయం చేసుకోవాలి. అనేక సంవత్సరాలుగా కొనసాగుతున్న ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# తిరుమల సమాచారం

## భక్తిరసభరితంగా బుగ్గోత్సవాలు



**తిరుమల,ఏప్రిల్ 7ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలో తిరుపతిలోని గోవిందరాజ స్వామి ఆలయంలో ఈనెల 28 నుండి 30వ తేదీ వరకు బుగ్గోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పవిత్ర ఉత్సవాల్లో ప్రతిరోజూ మధ్యాహ్నం 2 గంటలకు ఆలయ మహాద్వారానికి ఎదురుగా ఉన్న బుగ్గ పుష్కరిణి వద్దకు శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామివారిని వేంచేపు చేస్తారు. అనంతరం మధ్యాహ్నం 2.30 నుండి 4.30 గంటల వరకు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం, సమర్పణ, ఆస్థానం కార్యక్రమాలు నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 నుండి 6 గంటల వరకు ఉభయనాంచారులతో కలిసి స్వామి ఊంజల్‌సేవ నిర్వహించి, అనంతరం బుగ్గ వద్ద భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తారు. తదనంతరం సాయంత్రం 6 నుండి 7 గంటల వరకు శ్రీమహాలక్ష్మీ ్మ అమ్మవారి ఆలయం వద్ద ఆస్థానం కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ బుగ్గోత్సవాలను భక్తులు అధిక సంఖ్యలో హాజరై దర్శించుకుని స్వామివారి అనుగ్రహం పొందాలని టిటిడి ఆహ్వానిస్తోంది.

## తిరుపతి నూతన సిఆర్‌ఒ

### - భక్తుల సౌకర్యాలపై అదనపు ఇఒ చౌదరి తనిఖీలు





**తిరుమల,ఏప్రిల్ 7ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలో కేంద్రీకృత టిటిడి పరిపాలనా భవనాన్ని నిర్మించేందుకు టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్ భగీచా బస్టాండ్ కు ఎదురుగా ఉన్న ఖాళీ స్థలాన్ని తొలుత పరిశీలించారు. అక్కడ నుండి ఆకాశగంగ వద్దకు చేరుకుని,దుకాణాలను తనిఖీ చేశారు. శ్రీవారి సేవా సదన్ పక్కన ఉన్న షెడ్లను తనిఖీ చేశారు. తిరుమలలో ఏటీసీ వద్దకు చేరుకుని అక్కడ రెవెన్యూ విభాగానికి కాటేజీ కేటాయింపుపై స్థలాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ తనిఖీల్లో తిరుమల ఎస్టేట్ అధికారి వేంకటేశ్వర్లు, విఎస్‌ఒ సురేంద్ర, ఇఇలు శ్రీనివాసరావు, వేణు గోపాల్, డిఇ చంద్ర శేఖర్, సిపిఆర్‌ఒ డాక్టర్ తలారి రవి, పిఆర్‌ఒ నీలిమ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ద్వారకా తిరుమల, అన్నవరం ఆలయాలకు ట్రస్టు బోర్డు ఛైర్మన్ నియామకం

**విజయవాడ, ఏప్రిల్ 7,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మరో రెండు ప్రముఖ ఆలయాలకు ట్రస్టు బోర్డు ఛైర్మన్, 16 మంది సభ్యుల నియామకం జరిగింది. ఏలూరు జిల్లా ద్వారకా తిరుమల వెంకటేశ్వరస్వామి ఆలయ ఛైర్మన్‌గా సుధాకర్‌రావు, కాకినాడ జిల్లా అన్నవరం సత్యనారాయణస్వామి ఆలయానికి వెంకట రోహిత్‌ను నియమితులయ్యారు.
ఈ మేరకు దేవాదాయశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

## టిటిడి ట్రస్ట్‌లకు రూ.13.75 లక్షలు విరాళం

**తిరుమల,ఏప్రిల్ 7ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ట్రస్ట్‌లకు దాతలు తమవంతుగా విరాళాలందిస్తున్నారు. మంగళవారం ఉదయం ముంబై కు చెందిన ఎంటాడ్ ఫార్మాస్యూటికల్ లిమిటెడ్ సంస్థ టిటిడి ఎస్వీబీసీ ట్రస్టుకు 12.75 లక్షలు రూపాయలు విరాళం అందించింది. అలాగే ముంబైకు చెందిన సురేష్ నిలావర్ ఎస్వీ ప్రాణదాన ట్రస్టుకు లక్ష రూపాయలు విరాళంగా అందించారు. దాతలు తిరుమలలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరికి విరాళం డిడిలను అందజేశారు.

## తిరుమలలో వాహన భద్రతపై అవగాహన కార్యక్రమం

**తిరుమల,ఏప్రిల్ 7ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ వైకుంఠం తిరుమలలో వేసవి సెలవులకు ముందే భక్తుల రద్దీ రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో వాహన భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, తిరుమల ట్రాఫిక్ పోలీసులు వాహనాల డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తిరుమలలోని పుష్పగిరి మఠంలో ఈ కార్యక్రమం మంగళవారం ఉదయం జరిగింది. ఈ అవగాహన కార్యక్రమంలో వాహనాలలో అగ్ని ప్రమాదాలు (ఫైర్ యాక్సిడెంట్స్) జరగకుండా తీసుకోవలసిన ముఖ్యమైన జాగ్రత్తలను డ్రైవర్లకు వివరించారు. ముఖ్యంగా వాహనాల ఎలక్ట్రికల్ సిస్టమ్‌ను సకాలంలో తనిఖీ చేయడం, ఇంధన లీకేజీలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సరిచేయించడం, అధిక వేడి కారణంగా మంటలు చెలరేగే అవకాశాలను గుర్తించడం వంటి అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలు అందించారు. అలాగే ప్రతి వాహనంలో ఫైర్ ఎక్స్‌టింగ్విషర్ తప్పనిసరిగా ఉంచుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలో ప్రాక్టికల్‌గా వివరణ ఇచ్చారు. డ్రైవర్లు తమ వాహనాలను శుభ్రంగా, సక్రమంగా నిర్వహించుకోవడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిఐహరిప్రసాద్, ఎంవిఐ శ్రీనివాసులు, సెక్టార్ ఇన్‌చార్జీలు శివకుమార్ రెడ్డి, కృష్ణయ్య, 2టౌన్ సీఐ రాముడు పాల్గొన్నారు.

## 27 నెలలుగా అందని వేతనాలు

### - సచివాలయం గెస్ట్ ఫ్యాకల్టీల నిరసన

**సచివాలయం,ఏప్రిల్ 7,ప్రభాతవార్త :** రాష్ట్రంలోని ప్రభుత్వ బిఈడి కళాశాలల్లో పనిచేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీ గత 2ఏళ్ళ 3నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంగళవారం రాజమహేంద్రవరంలోని గరిమెళ్ళ సత్యనారాయణ ప్రభుత్వ బిఈడి కళాశాలకు చెందిన గెస్ట్ ఫ్యాకల్టీ ప్రతినిధులు అమరావతిలోని సచివాలయానికి చేరుకొని తమ గోడు వెళ్ళబోసుకున్నారు. తమ సమస్యను పరిష్కరించి, బకాయి పడ్డ వేతనాలు విడుదల చేయాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ని కోరారు. ఈ సందర్భంగా గెస్ట్ ఫ్యాకల్టీ ప్రతినిధులు రాజ్యలక్ష్మి, సావిత్రి, సోనియా మీడియాతో మాట్లాడుతూ...గత ప్రభుత్వం 2023డిసెంబర్‌లో జీవో జారీ చేసి మమ్మల్ని గెస్ట్ ఫ్యాకల్టీగా నియమించిందన్నారు. అయితే నియామక సమయంలో ఆర్థిక శాఖ నుంచి ముందస్తు అనుమతి తీసుకోకపోవడం ఇప్పుడు మాకు శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల సాంకేతిక కారణాలు చూపి అధికారులు వేతనాలను నిలిపివేశారన్నారు. వేతనాలు చెల్లించడానికి అవసరమైన 'హెడ్ ఆఫ్ ది అకౌంట్' క్రియేట్ చేయకపోవడం వల్లే బిల్లులు ఆగిపోయాయని అధికారులు చెబుతున్నారన్నారు. గత ప్రభుత్వ నిర్ణయాల లోపం వల్ల ఏ తప్పులేని మేము గత 27నెలలుగా నరకయాతన అనుభవిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం రాజమహేంద్రవరమే కాకుండా నెల్లూరు, కర్నూలు ప్రాంతాల్లో కలపి మొత్తం 16మంది గెస్ట్ ఫ్యాకల్టీ సభ్యులున్నారు. ఒక్కొక్కరికి సుమారు రూ.5లక్షల వరకు వేతనాలు రావాల్సి ఉందన్నారు. కుటుంబ పోషణ భారమై, అప్పుల పాలై దీనస్థితిలో ఉన్నామని వారు ఆవేదన వ్యక్తంచేశారు. "విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిస్తున్న మా పట్ల ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆలోచించాలి. నిబంధనల సాకుతో వేతనాలు ఆపకుండా, తక్షణమే బకాయిలు విడుదల చేసి మ్మల్ని ఆదుకోవాలి" అని గెస్ట్ ఫ్యాకల్టీ సభ్యులు విద్యాశాఖ మంత్రిని, ముఖ్యమంత్రిని విజ్ఞప్తి చేశారు.

## అమరావతి.. మన ఆత్మగౌరవానికి, భవిష్యత్తుకు ప్రతీక :ఎమ్మెల్యే బాలకృష్ణ

**విజయవాడ ఏప్రిల్ 7 ప్రభాతవార్త ప్రతినిధి:** మన ఆంధ్రప్రదేశ్ రాజధాని అని, ఇవాళ రాష్ట్ర ప్రజలందరికీ ఒక చారిత్రక విజయ క్షణమని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. అమరావతి మన ఆత్మగౌరవానికి , మన భవిష్యత్తుకు ప్రతీక. రాజధాని రైతుల త్యాగానికి, ప్రజల ఆశలకు లభించిన న్యాయం ఇది. మనందరం కలిసి అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దుదాం. గెజిట్ నోటిఫికేషన్ విడుదలైన సందర్భంగా, రాజధాని చిరకాల స్వప్నాన్ని సాకారం చేయడంలో సహకరించిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఈ బిల్లుకు మద్దతు తెలిపిన అన్ని పార్టీల సభ్యులందరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు అని బాలకృష్ణ పేర్కొన్నారు.

వార్త

జీవితంలో ఏదీ వ్యసనంగా పరిణమించకూడదు. అదే జీవితానికి ప్రధాన సూత్రం.

- జార్జి మూల్

# అసుర చర్యకు అసలు దండన

శాంతి భద్రతలు కాపాడాల్సిన వారు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని అతిగా వ్యవహరిస్తే ఏమవుతుందో తెలిస్తే మరో చోట ఇలాంటి సంఘటనలు పునరావృతం కావు. దేశ న్యాయ చరిత్రలోనే లాకప్‌డెత్‌లో ఎంతో మంది పోలీసులకు మూకుమ్మడి మరణ శిక్ష విధించిన ఉదంతం వినగానే సభ్య సమాజం నివ్వెరపోతోంది. తమిళనాడులోని తండ్రీ కుమారుల లాకప్‌డెత్ కేసులో మదురై కోర్టు సంచలన తీర్పును వెలువరించింది. ఆ తండ్రీ కొడుకులకు ఎలాంటి నేరచరిత్ర లేదు. 'కోవిడ్' రోజుల్లో లాక్‌డౌన్ నిబంధనలు ఉల్లంఘించి ఎక్కువ సమయం తమ షాపునుతెరచి ఉంచడమే వారి నేరం. అతి స్వల్పకారణంతో తండ్రీకొడుకుల అంతిమ యాత్రకు ఏర్పాటు చేసిన పోలీసులు శిక్షార్హులే. పోలీసుల్లో అసుర మనస్తత్వం గూడుకట్టుకున్న సందర్భాల్లో పేట్రేగిపోయి 'లాకప్‌డెత్'లకు కారకులవుతారు. అందుకే దేశంలో 'లాకప్ డెత్'లు కొత్తేమీ కావు. కానీ శిక్షలు పడిన ఉదంతాలు బహు అరుదు. అలాంటి కేసుల్లో చివరాఖరికి వచ్చే తీర్పుల్లో పోలీసులకు శిక్ష పడిందంటే కేసు ప్రక్రియను నడిపించడంలో న్యాయవ్యవస్థ ప్రశంసనీయ వైఖరిని అభినందించాల్సిందే. ఈ కేసులో అదేశాఖలో పనిచేస్తూ, ఉన్నతాధికారుల ఒత్తిడిలు తట్టుకొని కూడా ఆ రోజు జరిగిందేమిటో పూసగుచ్చినట్లు వివరించిన కానిస్టేబుల్ రేవతిని అభినందించాలి. నాలుగుగోడల మధ్య అదీ పోలీసు స్టేషన్ లాకప్‌గదిలో హింసకు గురయినప్పుడే ఇలాంటి లాకప్ మరణాలు సంభవిస్తాయి. అక్కడ జరిగిన ఆకృత్యాలకు సాక్షులెవరూ ఉండరు. ఇలాంటి కేసుల్లో జనమే ఎదరు తిరిగినప్పుడు మాత్రమే అవి కేసుల వరకువెళ్తాయి. దేశంలో లాకప్‌డెత్‌లు జరిగిన సందర్భాల్లో సంబంధిత పోలీసు స్టేషన్‌లో తమంత తాముగా సుమోటో కేసులు పెట్టే పరిస్థితి ఉండదు. ఒకవేళ బయటి వారో ఆత్మీయులో ప్రాథమిక సమాచార నివేదిక ఇచ్చినా దానిని కేసు కట్టడంలో పోలీసుల్నించి ఎంత ప్రతిఘటన ఎదురౌతుందో సాక్ష్యాలను సేకరించడంలోనూ, సాక్ష్యలను సమీకరించడంలో పోలీసుల వైపు నుండి ఎలాంటి సహాయమూ లభించదు. అందుచేత 'లాకప్‌డెత్' కేసుల్లో నిరూపణ దుస్సాధ్యమవుతుంది. ఈ కేసులో హైకోర్టు పోలీసు స్టేషన్‌ను స్వాధీనపరచుకుని విచారణ ప్రారంభించినా సిబ్బంది సహకరించలేదు. వారు బెదిరించారని జడ్జి పేర్కొన్నారు. 'దోషులకు జీవిత ఖైదు భయాన్ని కల్పించదు. వారికి మరణశిక్షే సరైన శిక్ష'యని న్యాయమూర్తి తన తీర్పులో పేర్కొన్నారంటే పోలీసులు ఆ తండ్రీకొడుకులపై ఎంత అమానవీయంగా వ్యవహరించారో తెలుస్తుంది. 2020 జూన్ 19న తుత్తుకుడి జిల్లా సాతానుకుళం పోలీసులు షాపు నిర్వాహకులు తండ్రికుమారుడిని పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి వారిని తీవ్రంగా కొట్టి హింసించారు. ఈకేసులో 10మంది పోలీసులపై కేసు నమోదు చేసి అప్పటికప్పుడే క్రమశిక్షణ చర్యలు కూడా తీసుకున్నారు. స్టేషన్ లాకప్ గదిలో ఉన్న షాపు యజమానులైన తండ్రి జయరాజ్, కుమారుడు బెన్నిక్స్‌లను జూన్ 22-23వరకునిరంతరం పదేపదే చేసిన దాడివల్లే 'అసాధారణ గాయాలయ్యాయి. పైగా వారిద్దరూ తమకు తామే గాయపరచుకుని తమపై నిందారోపణలు చేస్తున్నారని పోలీసులు కోర్టులో వాదించడం హాస్యాస్పదంగా ఉంది. ఈ కేసులో సుదీర్ఘమైన దర్యాప్తులు కొనసాగడానికి కారణం కేవలం ప్రజాందోళనయే. ఈకేసు బయటికి రాకుండా పోలీసుల యంత్రాంగం చేసిన ప్రయత్నాలు ఇన్నీఅన్నీ కావు. తొలుత వీరిద్దరూ మరణించడానికి కారణం పోలీసులు దారుణంగా హింసించడమేనని కుటుంబ సభ్యులు ఆరోపించారు. అప్పట్లో ఈ కేసు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. తొలుత మద్రాసు హైకోర్టు మధురై బెంచి సుమోటోగా విచారణ చేపట్టి ఆ ఇద్దరి మరణానికి పోలీసు అధికారుల దాష్టీకమే కారణమని, పోలీసులు చేసిన ఘాతుకానికి తగిన ప్రాథమిక సాక్ష్యాధారాలున్నాయని హైకోర్టు స్పష్టం చేసింది. నిందిత పోలీసులు ఈ కేసుకు సంబంధించి సాక్ష్యాధారాలను మాయం చేసేందుకు ప్రయత్నిస్తున్నందున దర్యాప్తులో సాక్ష్యాలు తారుమారు కాకుండా ఉండేందుకు పారదర్శక దర్యాప్తు, విచారణ కోసం హైకోర్టు సిఐడికి అప్పగించగా జనంలో చులకన కాకుండా ఉండేందుకు ఆ రాష్ట్రప్రభుత్వం సిఐడి నుంచి సిబిఐకి అప్పగించింది. హత్య, అక్రమ నిర్బంధం, తప్పుడు సాక్ష్యాల సృష్టి, నేరానికి ప్రేరేపించడం వంటి అభియోగాలపై సిబిఐదర్యాప్తులో స్టేషన్ హౌస్ ఆఫీసర్, శ్రీధర్ ఆదేశాలపై పోలీసులు ఇలాంటి దురాగాతాలకు పాల్పడిందని తేలింది. నిందితులుపైగా ఎవరిలోనూ ఏకోశానా అయ్యో! పాపం అనిగానీ, చచ్చిపోతాడేమోనన్న భయంకాని వారిలో ఏర్పడకపోవడం సభ్యసమాజం విస్తుపోతోంది. ఆ రోజు రాత్రి 8గంటల నుంచి తెల్లవారుజామున 3గంటల వరకు తండ్రీకుమారుడిని కర్రలు, ఇనుపరాడ్లతోచిత్రహింసలకు గురిచేశారని విచారణలో నిరూపితమైంది. వారిపై పోలీసులు తప్పుడు కేసులు నమోదు చేయడమే కాకుండా ఫోర్జరీ పత్రాలను సృష్టించారు. లాకప్‌డెత్ కేసుల్లో ఇంత మంది పోలీసులు ఇద్దరు వ్యక్తుల చావుకు కారణమవడమే ఒక రికార్డు. వారిలో ఏ ఒక్కరికి మానవత్వం లేకపోవడం దురదృష్టకరం. ఒకవేళ తమ ఇన్‌స్పెక్టర్ ఇలాంటి దురాగతానికి ప్రేరేపించినా ఆపై అధికారులకు తెలియ చేసి వారిమరణానికి దారితీసే చిత్రహింసలను ఆపిఉండ వచ్చునని, అలాకాకుండా ఈ నేరంలో భాగస్వామ్యమైనట్లు భావించి ఈ అరుదైన కేసులో వారంతా శిక్షార్హులేనని కోర్టు విశ్వసించింది. కాస్త ఆలస్యమైనా నేర నిర్ధారణతో మదురై బెంచి వెలువరించిన తీర్పు దేశవ్యాప్త ఉన్న పోలీసు లోకానికే గుణపాఠం కాగలదు.

ఎప్పుడూ ఒకరికి ఇవ్వడం నేర్చుకో అంతేకాని తీసుకోవడం కాదు. అలాగే ఒకరికి సేవ చేయడం నేర్చుకో అంతేకాని ఒకరిపైన పెత్తనం చేయడం కాదు.



రామకృష్ణ పరమహంస

ఏ విషయమైనా కొత్తగా ఉన్నప్పుడే బాగుంటుంది. కాని స్నేహం మాత్రం పాతబడిన కొద్దీ బాగుంటుంది.



మోక్షగుండం విశ్వేశ్వరయ్య

## ప్రజావాక్కు



### విద్యా సంస్కరణలు

ప్రస్తుత డిజిటల్ యుగంలో విద్యా రంగంలో సాంకేతికతను అంతర్భాగం చేయడంఅనివార్యమైన కాలానుగుణ అవసరం. విద్యార్థులనుభావివృత్తినైపుణ్యాల దిశగా సిద్ధం చేయడానికి తెలంగాణ ప్రభుత్వంచేపడుతున్న విద్యా సంస్కరణలు విశేషంగాగమనించదగ్గవి. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యాధునిక మౌలికసదుపాయాలను కల్పించడం, డిజిటల్ తరగతి గదులను ఏర్పాటు చేయడం ద్వారా నవ సమాజ నిర్మాణానికి ప్రభుత్వం కొత్తదిశను చూపుతోంది. ప్రపంచవ్యాప్తంగా కృత్రిమ మేధస్సు, దత్తాంశ శాస్త్రం, డిజిటల్ అక్షరాస్యత వంటిరంగాలు శరవేగంగా విస్తరిస్తున్నాయి. ఈమార్పులకు అనుగుణంగా మన విద్యార్థులను అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడేలా తీర్చిదిద్దడం అత్యంత ప్రాధాన్యత కలిగినఅంశం. పాఠ్యాంశాలను ఆధునీకరించడంవల్ల గ్రామీణప్రాంతవిద్యార్థులుకూడా ప్రపంచ స్థాయి పరిజ్ఞానాన్ని పొందే అవకాశం లభిస్తుంది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### దొందు దొందే

రెండువేల ఇరవై నాలుగు ఎన్నికలు జరగడానికి చాలా ముందునుంచే చంద్రబాబు నాయుడిఆలోచనలో మార్పు వచ్చింది. మోడీతో విడిపోయినందుకు ఆయనను తిట్టిపోసినందుకుతెగబాధపడిపోయారు. మోడీకి దగ్గరయితేనే అధికారం దక్కుతుందని ముఖ్యమంత్రి పదవి వరిస్తుందనిగ్రహించిమళ్లీ ఆయనకు దగ్గరఅయ్యేందుకు ప్రయత్నించారు. తమ మధ్యసంధి కుదర్చడానికి పవన్‌కళ్యాణ్‌ని ఉపయోగించుకున్నారు. ఆయన ద్వారా రాయబారాలు బేరసారాలు జరిపారు. తిట్టినసోరుతోనే మోడీని పొగడటం చేశారు. మొత్తానికిచేసిన ప్రయత్నాలు ఫలించాయి.

- మిథునం, హైదరాబాద్

### అప్పులపాలు కావొద్దు

యువత క్రికెట్‌మోజులో, సినిమాల మోజులో పడి మీకు నచ్చిన హీరో కోసమో, ఆటగాడి కోసమో దగ్గరినుండి చూడాలి అని, మొదటి రోజే సినిమా చూడాలని వందల నుండి వేల వరకు ఖర్చు చేస్తున్నారు. ఎవరి కొరకు ఈ ఖర్చు? వాళ్ళు ఏమైనా నీకుఆపదలో ఉన్నప్పుడు అండగా నిలుస్తున్నారా? వాళ్లను చూడడానికి వేల రూపాయలు మనం ఎందుకు ఖర్చుబెట్టాలి అని ఆలోచించాల్సిన అవసరంఉంది. ముందు మన కుటుంబం ఆ తర్వాతే హీరోలు, ఆటగాళ్ళ వినోదానికి వెళ్ళి అప్పుల పాలు కావొద్దు.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### అవినీతి ప్రచారం

తమ రాజకీయ ప్రత్యర్థులు అవినీతిపరులు, కుంభకోణాలు చేసేవారని 2014నుంచి బిజెపినాయకులు ప్రచారం చేస్తున్నారు. కోర్టుల చుట్టూ తిప్పుతున్నారు. విచారణలతో వేధిస్తున్నారు. చివరకు జైలు పాలు చేసి వారిని మానసిక క్షోభకు గురి చేస్తున్నారు. ఇప్పటికి ఇలా ఎన్నో రాష్ట్రాలలో జరిగింది. వారి అధికారదాహానికి ముఖ్యమంత్రులు, మంత్రులు బలయ్యారు. పదవులతోపాటు పరువు ప్రతిష్టలను పోగొట్టుకున్నారు. ప్రజలు వీరి చర్యలను నిశితంగా గమనించాలి. పదవులు అధికారం కోసం దిగజారి ప్రవర్తిస్తున్న నాయకులకి భవిష్యత్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలి.

- ఎమ్.ఎస్.శర్మ, హైదరాబాద్

### నాడు ప్రాజెక్టులు, నేడు విగ్రహాలు?

నెహ్రూ కాలంలో పెద్ద పెద్ద నీటి ప్రాజెక్టులు, రైల్వేలు, రోడ్లు లాంటి వాటిని ప్రారంభం చేసి జాతికి అంకితం చేస్తున్నాను అనేవారు. 1955లో నాగార్జునసాగర్ డ్యామ్ శంకుస్థాపన సమయంలో పూజలు ,టెంకాయలు ,బ్రాహ్మడు ,ముహూర్తం లేకుండా నెహ్రూ గారు ఒక దీపం వెలిగించి, ఈ ఆధునిక దేవాలయాన్ని జాతికి అంకితం చేస్తున్నాను అన్నాడు. ప్రధాని మోదీ ఆ మధ్య వేల కోట్లరూపాయలు ఖర్చుపెట్టి పటేల్ విగ్రహాన్నీ జాతికి అంకితమన్నారు. అయోధ్య రామ మందిరాన్ని జాతికి అంకితంఅన్నారు. జగ్గీబాబ ఆశ్రమాన్ని రిబ్బన్ కత్తిరించి జాతికి అంకితం అన్నాడు మోదీ గారు. యమునానది ఒడ్డున ఒక గడ్డం బాబా రవిశంకర్ 15 లక్షలమందితో జాతర చేస్తుంటే దానికి మోదీ ప్రారంభం. గుళ్లకు బాబాల ఆశ్రమాలకుమోడీప్రభుత్వం అతిగాప్రాముఖ్యత ఇస్తుంది. చంద్రబాబు కూడా అదేబాటలో నడుస్తున్నాడు. బహుశా అందుకేనేమో మొన్న చంద్రబాబు వెంకటేశ్వరస్వామి గుడి లాంటి గుళ్లను ప్రపంచ వ్యాప్తంగా నిర్మించాలి అన్నారు.

- నార్నెవెంకట సుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### అంతా ప్రచారం కోసమే

ఎఐ వల్ల రైతుల సమస్యలు తీరుతాయా? యువత భవిష్యత్తు బావుంటుందా! వారికి ఉద్యోగఅవకాశాలు పెరుగుతాయా? నిత్యావసర ధరలు తగ్గుతాయా? గ్రామాల్లో నివసించే జనాలకి ఈ ఎఐ ఏ విధంగా ఉపయోగపడుతుంది. బిజెపి వాళ్ల ఏం చేసినా ప్రచారం కోసం అందరి చేతా పొగిడించుకోవటం కోసం పార్టీ ప్రయోజనాల కోసం చేసే పనులే ఎక్కువగా ఉంటాయి. ఈమధ్య న్యూఢిల్లీలో నిర్వహించిన ఎ.ఐ సమిట్ కూడా అలాంటిదే.

-ఎం.శ్రీనివాస్, హైదరాబాద్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# రాజకీయ పీటముడిలో 'డీజీపీ' పదవులు!

**నీతి నిజాయతీగా, ముక్కు సూటిగా పయనిస్తూ, నియమ నిబంధనలను కఠినంగా అమలు చేసే ఐపీఎస్ అధికారులను రాష్ట్ర పోలీస్ చీఫ్(డీజీపీ) ఎంపిక దరిదాపులోకి రాకుండా చేస్తున్నారు. ఆ పదవి కోసం కొందరు ఐపీఎస్‌లు విధులు చేపట్టే ముందు చేసిన ప్రమాణాలన్నిటిని మూట కట్టి మూలకు పడేసి, ఖాకీ దుస్తుల విలువలను నేల రాసి ఖద్దర్లకు జీ హుజూర్ అంటూ వంగి వంగి దండాలు పెడుతూ వారి పంచన చేరుతున్నారు. గత కొన్నేళ్లుగా విడిపోకముందు ఉమ్మడి తెలుగు రాష్ట్రం, ఆ తరువాత విడిపోయిన తెలుగు రాష్ట్రాలలోనే కాకుండా, ఇతర రాష్ట్రాలలో జరుగుతున్న తంతు ఇదే.**



ఎం.నారాయణ స్వామి

ఏ పార్టీ చూసినా ఏమున్నది గర్వకారణం, రాష్ట్ర డిజిపి నియామకంలో చెప్పిన పనులు తూచా తప్పకుండా చేసే సీనియర్ లేదా జూనియర్ ఐపీఎస్ అధికారిని డీజీపీగా నియమించి రాష్ట్ర పోలీస్ యంత్రాంగం పగ్గాలు అప్పగిస్తున్నారు. నీతి నిజాయతీగా, ముక్కు సూటిగా పయనిస్తూ, నియమ నిబంధనలను కఠినంగా అమలు చేసే ఐపీఎస్ అధికారులను రాష్ట్ర పోలీస్ చీఫ్ (డీజీపీ)ఎంపిక దరిదాపులోకి రాకుండా చేస్తున్నారు. ఆపదవి కోసం కొందరు ఐపీఎస్‌లు విధులు చేపట్టే ముందు చేసిన ప్రమాణాలన్నిటిని మూటకట్టి మూలకు పడేసి, ఖాకీ దుస్తుల విలువలను నేలరాసి ఖద్దర్లకు జీ హుజూర్ అంటూ వంగి వంగి దండాలు పెడుతూ వారి పంచన చేరుతున్నారు. గత కొన్నేళ్లుగా విడిపోకముందు ఉమ్మడి తెలుగు రాష్ట్రం, ఆ తరువాత విడిపోయిన తెలుగు రాష్ట్రాలలోనే కాకుండా, ఇతర రాష్ట్రాలలో జరుగుతున్న తంతు ఇదే. అధికార పార్టీకి అనుకూలంగా ఉన్న జూనియర్ ఐపీఎస్ అధికారులను అందలం ఎక్కించడానికి సీనియర్ ఐపీఎస్ అధికారులను పక్కనబెట్టి చిన్నచూపు చూస్తున్నారు. డీజీపీ రేసులో ఉన్న ఐపీఎస్ అధికారులు రాష్ట్ర పోలీస్ యంత్రాంగం చీఫ్ పదవి దక్కించుకోవడానికి రాష్ట్ర, కేంద్రంలోని ముఖ్యమైన ప్రజాప్రతినిధులు, నాయకులు ద్వారా పెద్ద ఎత్తున పైరవీలు చేయిస్తున్నారనే అపప్రధ ఉండనే ఉంది. న్యాయంగాతమకే డిజిపి పదవి దక్కాలి అని సీనియర్ ఐపీఎస్‌లు పేర్కొంటుంటే, మాకు డిజిపి హోదా ఇచ్చారు మేము కూడా ఆ పదవికి అర్హత సంపాదించాం కావున మాకే ఇవ్వాలంటూ జూనియర్ ఐపీఎస్‌లు వాదనలకు దిగుతున్నారు. యూపీఎస్సీ ఎంపిక చేసి పంపిన డీజీపీల పేర్ల జాబితాలో నుంచి ఆయా ప్రభుత్వాలు నియమించే డీజీపీ రెండేళ్లపాటు సర్వీసులో ఉండి పూర్తి స్థాయి బాధ్యతలను నిర్వహిస్తారు. ఒకవేళ యూపీఎస్సీ ద్వారా కాకుండా ప్రభుత్వాలు స్వయంగా నియమించే డీజీపీలను టెంపరరీ డీజీపీలుగా పరిగణించకుండా వారిని అదనపు బాధ్యతలు చేపట్టే డీజీపీలుగా పెర్కొనాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. అప్పటి నుంచి రాష్ట్రాల ప్రభుత్వాలు తూచా తప్పకుండా పాటిస్తున్నాయి. జూనియర్ ఐపీఎస్‌ను డీజీపీగా నియమిస్తే వెంటనే సీనియర్ ఐపీఎస్‌లు తమకు అన్యాయం జరిగిదంటూ కోర్టులను ఆశ్రయించిన సందర్భాలున్నాయి. యూపీఎస్సీ ఎంపిక చేసి పంపిన ముగ్గురు ఐపీఎస్ ల జాబితాలో నుంచి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు వారికీ సంబంధించిన ఐపీఎస్‌ను పూర్తిస్థాయి డీజీపీగా నియమించుకొంటున్నారు. ఉమ్మడి రాష్ట్రం విడిపోయిన తరువాత ఆంధ్రప్రదేశ్(2014) తెలుగు దేశం అధికారంలోకి రాగానే అప్పుడు యూపీఎస్సీ ఎంపిక చేసిన జాబితాలో నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జె.వి.రాముడికి డీజీపీ పగ్గాలను అప్పగించారు. రాముడు పదవీ విరమణ చేసిన తరువాత డిజిపిలుగా నియమించిన నంద్యాల సాంబశివరావు, ఎం.మాలకొండయ్య, ఆర్.పీ. ఠాకూర్ డిజిపిలు గా అదనపు బాధ్యతలు నిర్వహించి పదవీ విరమణ చేసారు. అప్పట్లో యూపీఎస్సీ ఎంపిక వ్యవహారం గురించి పెద్దగా పట్టించుకోలేదు. ఆ తరువాత (2019) అధికారం లోకి వైసీపీ హయాంలో రాష్ట్ర పోలీస్ యంత్రాంగం పూర్తి స్థాయి డీజీపీగా యూపీఎస్సీ జాబితాలో నుంచి ముఖ్య మంత్రి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి గౌతమ్ సవాంగ్ పేరును ఖరారు చేశారు. ఆ తరువాత చోటు చేసు



కొన్న తీవ్ర పరిణామాల రీత్యా రెండున్నర సంవత్సరాల సర్వీస్ తర్వాత గౌతం సవాంగ్‌ను ఆకస్మికంగాతప్పించారు. ఆ తరువాత కే.సీ. రాజేంద్రనాథ్ రెడ్డిని డీజీపీగా నియమించి అదనపు బాధ్యతలను అప్పగించారు. పదకొండు మంది సీనియర్లను కాదని రాజేంద్రనాథ్ రెడ్డిని నియమించడం గమనార్హం. అప్పుడు పూర్తి స్థాయి డీజీపీ ఎంపిక కోసం యూపీఎస్సీ దృష్టికి తీసుకెళ్ల లేదు. 2024 ఎన్నికల సమయంలో ఎన్నికల కమిషన్ డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి స్థానంలో హరీష్ కుమార్ గుప్తాకు (మే2024జూన్ 2024 వరకు) డీజీపీ పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించింది. అప్పుడు జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో కూటమి (టీడీపీ, బీజేపీ, జనసేన) అధికారంలోకి వచ్చింది. ఎన్నికల కోడ్‌ను తొలగిం చిన తరువాత కూటమి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సి.హెచ్.ద్వారకా తిరుమలరావుకు డీజేపీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. తిరుమలరావు పదవీ విరమణ చేయగానే యూపీఎస్సీ పంపిన జాబితాలలో నుంచి హరీష్ కుమార్ గుప్తా పేరును ఎంపిక చేసి పూర్తి స్థాయి డీజీపీగా నియమించారు. 1992 బ్యాచుకు చెందిన గుప్తా రెండేళ్లు(2027 జులై నెలవరకు) డీజీపీగా కొనసాగుతారు. తెలంగాణా రాష్ట్రంఏర్పడి 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో టిఆర్ఎస్(ఇప్పుడు బిఆర్ఎస్) అధికారంలోకి రాగానే ప్రభుత్వానికి, పార్టీకి అండగా ఉండే అనురాగ్ శర్మను తొలిసారిగా పూర్తి స్థాయి డీజీపీగా నియమించింది. యూపీఎస్సీ జాబితాలో శర్మ పేరు ఉండటం, ముఖ్యమంత్రి కే.సి.ఆర్ ఆ పేర్లను ఖరారు చేశారు. అనురాగ్ శర్మ పదవీ విరమణ చేయగానే, యూపీఎస్సీ పంపిన జాబితాలోని మహేందర్ రెడ్డిని ముఖ్యమంత్రి ఓకే చేశారు. మహేందర్ రెడ్డి పదవీ విరమణ తరువాత అంజనీ కుమార్‌ను డీజీపీగా నియమిస్తూ అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయన అసెంబ్లీ ఎన్నికల వరకు ఆ పదవిలో ఉన్నారు. అప్పుడు యూపీఎస్సీ ఎంపిక వ్యవహారం గురించే పట్టించు కోలేదు. 2023 డిసెంబర్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలిచి అధికారంలోకి వచ్చింది. రాష్ట్ర డీజేపీగా రవి గుప్తాను నియమించి, అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రధాన ఇంటలిజెన్స్ చీఫ్‌గా తిరిగి శివధర్ రెడ్డిని నియమించింది. డీజీపీ రవిగుప్తాను బదిలీ చేసి ఆయన స్థానంలో డీజీపీగా జితేంద్రను నియమించి అదనపు బాధ్యతలను అప్పగించారు. జితేంద్ర పదవీ విరమణతో 2025 సెప్టెంబర్ నెలలో బి. శివధర్ రెడ్డిని డీజీపీగా నియమించి పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించారు. ఆయనను డీజీపీగా నియమించడంపై కొంత మంది సీనియర్లు వారి అనుయాయులకు చెప్పి కోర్టులో నియామకం చెల్లదని కేసు వేయించారు. కోర్టు కేసు పూర్వపరాలను పరిశీలించిన తరువాత డీజీపీ నియామకాన్ని కొనసాగిస్తూ, యూపీఎస్సీ ద్వారా పూర్తి స్థాయి డీజీపీ నియామక ప్రక్రియను త్వరగా పూర్తి చెయ్యాలని, సుప్రీం కోర్టు ఆదేశాలను తూచా తప్పకుండా పాటించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వం యూపీఎస్సీకి లిస్ట్ పంపడం అక్కడనుంచి కొన్ని లోపాలున్నాయి అంటూతిరిగి పంపడం, మళ్ళీ లోపాలు సరిచేసి ప్రభుత్వం పంపడం, తిరిగి యూపీఎస్సీ కొన్ని తప్పులున్నాయి సరి చేసి పంపమని ఆదేశించారు. పలుమార్లు ఈ తతంగం జరిగిన తరువాత ఆ జాబితా అక్కడ్నించి కదల్లేదు. తాజాగా గత మార్చి నెలలో తెలంగాణా ప్రభుత్వం డీజీపీ పోస్టుకు ప్రతిపాదిత పేర్లతో ఉన్న లిస్ట్‌ను యూపీఎస్సీకి పంపారు. ఈసారి ఎంపిక జాబితాలో ముగ్గురు పేర్లను యూపీఎస్సీ ఎంపిక చేసింది. ఏప్రిల్ 30వ తేదీన బి.శివధర్ రెడ్డి పదవీ విరమణ చేస్తున్నారు. యూపీఎస్సీ ఎంపిక చేసి పంపిన డీజీపీ జాబితాలో 1991 బ్యాచ్‌కు చెందిన సి.వి.ఆనంద్ 1994 బ్యాచ్‌కు చెందిన వినాయక్ ప్రభాకర్ ఆప్టే, సౌమ్య మిశ్రా ఉన్నారు వీరిలో వినాయక్ ప్రభాకర్ కేంద్రంలోడెప్యూటేషన్‌పై ఉన్నారు. ఆయన డీజీపీ పదవి పట్ల విముఖంగా ఉన్నారని చెప్పుకొంటున్నారు. రేసులో ఆనంద్, సౌమ్య మిశ్రా ఉన్నారు. ఇక కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణా రాష్ట్ర డీజీపీగా ఎవరిని నియమిస్తారో వేచి చూడాలి. •

(రచయిత : సీనియర్ జర్నలిస్ట్)

# పొలాల్లో 'విషం'తో పెరుగుతున్న ముప్పు

తిప్పర్తి శ్రీనివాస్

దేశంలో వ్యవసాయం కోట్లాది ప్రజల జీవనాధారంగా కొనసాగుతోంది. పంటల దిగుబడిని పెంచేందుకు రైతులు రసాయనిక ఎరువులు, పురుగుమందులు, కలుపు నాశినిలను విస్తృతంగా వినియోగిస్తున్నారు. అయితే ఈ రసాయనాల అధిక వినియోగం ఇప్పుడు ప్రజారోగ్యానికి, పర్యావరణానికి ఒక పెద్ద సవాలుగా మారుతోంది. ముఖ్యంగా 'పారాక్వాట్' వంటి అత్యంత విషపూరిత కలుపు నాశినిపై మళ్లీ దేశవ్యాప్తంగా చర్చ తీవ్రతరమైంది. పారాక్వాట్ అనేది వేగంగా పనిచేసే కలుపు నాశిని. కానీ దీని విషపూరిత అత్యంత ప్రమాదకరమని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఇది మనిషి శరీరంలోకి తక్కువ మోతాదులోనైనా ప్రవేశిస్తే ఊపిరితిత్తులు, కాలేయం, మూత్రపిండాలు వంటి ముఖ్య అవయవాలను తీవ్రంగా దెబ్బతీస్తుంది. ముఖ్యంగా దీనికి సమర్థవంతమైన విరుగుడు ఇప్పటికీఅందుబాటులో లేకపోవడం మరింత ఆందోళనకరం. పారాక్వాట్ విషప్రయోగం జరిగిన తర్వాత రోగిని రక్షించడం చాలా క్లిష్టమని వైద్యవర్గాలు చెబుతున్నాయి. ఇటీవలి సంవత్సరాల్లో వ్యవసాయ రసాయనాల వల్ల విషప్రయోగ కేసులు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో, పెరుగుతున్నట్లు నివేదికలు సూచిస్తున్నాయి. ఆత్మహత్యా యత్నాల్లో కూడా పారాక్వాట్ వినియోగం ఒక కీలక సమస్యగా మారింది. సులభంగా లభ్యత ఉండటం వల్ల ఇదిప్రమాదాన్ని మరింత పెంచుతోంది. ఈ నేపథ్యంలో వైద్య సంస్థలైన ఇండియన్ మెడికల్ అసోసియేషన్, డాక్టర్స్ అసోసియేషన్ ఫర్ పబ్లిక్‌పాలసీ, హెల్త్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ అసోసియేషన్ కేంద్ర ప్రభుత్వాన్ని పారాక్వాట్‌పై దేశవ్యాప్తంగా నిషేధం విధించాలని పునరుద్ఘాటిస్తున్నాయి. ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు ఇది అత్యవసర చర్యగావారు పేర్కొంటున్నారు. ప్రపంచ వ్యాప్తంగా కూడా పారాక్వాట్‌పై కఠిన నియంత్రణలు అమల్లో ఉన్నాయి. యూరోపియన్ యూనియన్ దేశాలు, చైనా, బ్రెజిల్ వంటి దేశాలు ఇప్పటికే దీనిని నిషేధించాయి లేదా గణనీయంగా పరిమితం



చేశాయి. ఈ నిర్ణయాలు మానవ ఆరోగ్యానికి హానికరమైన రసాయనాలపై కఠిన వైఖరి అవసరాన్ని సూచిస్తున్నాయి. భారతదేశంలో పరిస్థితి మాత్రం ఇంకా భిన్నంగా ఉంది. కొన్ని నియంత్రణలు ఉన్నప్పటికీ, పారాక్వాట్ వినియోగం పూర్తిగా నిలిచిపో లేదు. అయితే ఇటీవల కొన్ని రాష్ట్రాలు, ముఖ్యంగా తెలంగాణ, దీని వినియోగాన్ని నిషేధించే దిశగా చర్యలు తీసుకోవడం గమనార్హం. ఇది ప్రజారోగ్య పరిరక్షణలో ఒక ముందడుగుగా భావించవచ్చు. అయితే ఒకే రాష్ట్రం నిషేధం విధించడం సరిపోదు. పొరుగు రాష్ట్రాల నుంచి అక్రమంగా సరఫరా జరిగే అవకాశముంది. అందువల్ల దేశవ్యాప్తంగా సమగ్ర విధానం అవసరం. కేంద్ర ప్రభు త్వం శాస్త్రీయ ఆధారాలతో, ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఒకస్పష్టమైన నిర్ణయం తీసుకోవాలి. ఇక రైతుల కోణంలో చూస్తే, పారాక్వాట్‌కు ప్రత్యామ్నాయాలు లేవని కొందరు వాదిస్తున్నారు. కానీ వ్యవసాయ నిపుణులు సురక్షితమైన ఇతర కలుపునాశికాలు, యాంత్రిక పద్ధతులు, సహజ వ్యవసాయ పద్ధతులు ఉపయోగించడం ద్వారామంచి ఫలితాలు సాధ్యమని సూచిస్తున్నారు. ఈదిశగా రైతులకుశిక్షణ, అవగాహన, సబ్సిడీలు అందించడం అత్యవసరం. మరో ముఖ్య అంశం రైతుల భద్రత. రసాయనాల వినియోగంలో వ్యక్తి గత రక్షణ పరికరాలు వినియోగం చాలా తక్కువగా ఉంది. చర్మం, శ్వాస ద్వారా రసాయనాలు శరీరంలోకి ప్రవేశించిదీర్ఘకాలిక ఆరోగ్యసమస్యలకు దారితీస్తున్నాయి. కాబట్టి భద్రతా ప్రమాణాల ను కచ్చితంగా అమలు చేయడంకూడా ప్రభుత్వ బాధ్యత. ఇక భవిష్యత్తు దృష్టిలో చూస్తే, వ్యవసాయం కేవలం దిగుబడుల పెంపుపైనే కాకుండా, ఆరోగ్యకరమైన ఆహారం, పర్యావరణ సంరక్షణపై కూడా దృష్టి పెట్టాలి. సుస్థిర వ్యవసాయం, సేంద్రియ వ్యవసాయం వంటి విధానాలు మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. మొత్తానికి, వ్యవసాయం అభివృద్ధి చెందాలంటే అది మానవ ఆరోగ్యాన్ని కాపాడే విధంగా ఉండాలి. ప్రాణాలకు ముప్పుగా మారే పారాక్వాట్ వంటి రసాయనాలపై దేశవ్యాప్తంగా కఠిన నియంత్రణలు లేదా పూర్తి నిషేధం విధించడం సమయోచిత నిర్ణయం అవుతుంది. అదే సమయంలో రైతులకు సురక్షిత ప్రత్యామ్నాయాలు అందించడం ద్వారా సమతుల్యతను సాధించాలి. •

# పారదర్శకతలోపిస్తున్న 'తాత్కాలిక' కేటాయింపులు

మేకల క్రిష్ణ

మన దేశంలో సంస్కృతి, సాంప్రదాయాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తాం. ఆ పరంపరలో గోదావరి పుష్కరాలకు కూడా ఆధ్యాత్మికంగా ప్రత్యేక స్థానం ఉంది. ప్రతి పన్నెండు ఏళ్లకు ఒకసారి జరిగే ఈ పుష్కరాల్లో లక్షలాది భక్తులు నదీతీరాలకు తరలివచ్చి పవిత్ర స్నానాలు ఆచరిస్తారు. నదీ స్నానం ద్వారా పాపపరిహారం కలుగుతుందని ప్రజల విశ్వాసం. ఈ నేపథ్యంలో పుష్కరాలు కేవలం పండుగ మాత్రమే కాదు, భక్తి, విశ్వాసం, ప్రజల సామూహిక భావోద్వేగాలకు సమ్మేళనం. అయితే, ఈ ఆధ్యాత్మిక వైభవం వెనుక ప్రభుత్వాలు చేస్తున్న ఖర్చు, నిధుల వినియోగం తీవ్రచర్చకు దారితీస్తోంది. 2027 జూన్‌లో నిర్వహించే గోదావరి పుష్కరాలకు ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఈ పుణ్య స్నానాలకు తరలివచ్చే లక్షలాది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం వివిధ శాఖల మధ్య సమన్వయంతో ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. బాసర నుంచి భద్రాచలం వరకు పుష్కరాల నిర్వహణకు అనువైన ప్రదేశాలను గుర్తించి, మంత్రి శ్రీధర్ బాబు నేతృత్వంలోని సబ్ కమిటీకి నివేదిక పంపాలని టెక్నికల్ ఇంజినీర్ల బృందాన్ని సిఎం ఆదేశించారు. ఘాట్ల అభివృద్ధి, రహదారుల విస్తరణ, ప్రత్యేక పార్కింగ్‌ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, భక్తుల భద్రత కోసం భారీ పోలీసు బందోబస్తు, సీసీ కెమెరాలు, డ్రోన్ పర్యవేక్షణ, భక్తుల ఆరోగ్య పరంగా తాత్కాలిక ఆసుపత్రులు, మెడికల్ క్యాంపులు, అంబులెన్స్ సేవలు 24గంటలు అందుబాటులో ఉండటంతో పాటు ఇంకా అనేక చర్యలు చేపడుతోంది. అయితే, ఈ ఏర్పాట్లకు భారీగా నిధులు కేటాయిస్తున్న నేపథ్యంలో వాటి వినియోగంలో పారదర్శకత ప్రశ్నార్థకంగా మారుతోంది. గోదావరి పుష్కరాలను సాధారణంగా ప్రతి 12 ఏళ్లకు ఒకసారి నిర్వహిస్తారు. గురుగ్రహం సింహరాశిలో ప్రవేశించిన రోజున ప్రారంభమై, 12 రోజులపాటు ప్రధాన ఘట్టంగా కొనసాగుతుంది. (తదుపరి రోజులు కూడా పుణ్యకాలంగా పరిగణిస్తారు). గత అనుభవాలను ఆధారంగా తీసుకుంటే, మొత్తం పుష్కరాల కాలంలో సుమారు 10-12 లక్షల మంది భక్తులు పాల్గొనే అవకాశం ఉంది. ఈ పుష్కరాల నిర్వహణ కోసం దాదాపు రూ.3 వేల నుంచి 5వేల కోట్ల వరకు ఖర్చు అవుతున్నట్లు అంచనాలు చెబుతున్నాయి. ఇందులో ఎక్కువ భాగం తాత్కాలిక వసతులపైనే వెచ్చించడం జరుగుతోంది. ఈ పుష్కరాలు ముగిసిన తర్వాత అనేక నిర్మాణాలు ఉపయోగంలో లేకుండాపోతున్నాయి. తాత్కాలిక అవసరాల కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేయడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్న తలెత్తుతోంది.



మరోవైపు రాష్ట్రాల్లోని విద్యా, ఆరోగ్య రంగాల పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. గురుకుల పాఠశాలల్లో సరైన వసతులు లేకపోవడం, విద్యార్థులకు తగిన పౌష్టికాహారం అందకపోవడం, హాస్టల్లో సమస్యలు కొనసాగుతూనే ఉన్నాయి. ఆరోగ్య పరంగా చూస్తే, పోషకాహార లోపం పిల్లల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపే అంశం. ప్రభుత్వ ఆసుపత్రుల్లో డాక్టర్లు, సిబ్బంది కొరత, మందుల లభ్యత లేమి సమస్యలు పేదలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ఇక్కడ అసలు సమస్య పుష్కరాలు కాదు. ప్రాధాన్యతల లోపం. తాత్కాలిక వసతుల కోసం వేలకోట్లు ఖర్చు చేస్తూ, ప్రజల ప్రాథమిక అవసరాలకు తగిన ప్రాధాన్యత ఇవ్వకపోవడం పాలనలో అసమతుల్యతను సూచిస్తుంది. పుష్కరాలు నిర్వహించడం ప్రభుత్వ బాధ్యతే అయినప్పటికీ, ఆ ఖర్చులు ప్రజల దీర్ఘకాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఉండాలి. సమాజంలో అంత్యంత కీలక రంగాలను పక్కనబెట్టి పుష్కరాల పేరుతో భారీగా ఖర్చు చేయడం చర్చనీయాంశంగా మారింది. పుష్కరాల కోసం రోడ్లు, ఘాట్లు, సౌకర్యాలు ఏర్పాటు చేయడం అవసరమే. కానీ అదే పేరుతో అవినీతి, నిధుల దుర్వినియోగం జరిగితే అది ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తుంది. కాంట్రాక్టులు ఇవ్వడంలో పారదర్శకత, పనులు నాణ్యత లేకుండా చేయడం వంటి సమస్యలు తరచూ వినిపిస్తున్నాయి. ఇక్కడ ప్రధానంగా ప్రశ్నించాల్సిన విషయం ప్రజల ప్రాధాన్యత ఏమిటి? పేద పిల్లలకు విద్య ఇవ్వడం ముఖ్యమా?లేదా తాత్కాలిక పనుల కోసం కోట్ల రూపాయలు ఖర్చుచేయడమా? ప్రజల ఆరోగ్యా న్ని కాపాడడం ముఖ్యమా?లేదా రాజకీయ దర్పం కోసం భారీ ప్రాజెక్టులు చేయడమా?. ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం పనిచేయాలి. ముఖ్యంగా వెనుకబడిన వర్గాలకు సమాన అవకాశాలు కల్పించాలి. గురుకులాల అభివృద్ధి, పౌష్టికాహారం సరఫరా, ప్రభుత్వ ఆసుపత్రుల బలోపేతం వంటి అంశాలు అత్యవసరం. ఈ రంగాల్లో పెట్టుబడులు పెడితేనే సమాజం నిజంగా అభివృద్ధి చెందుతుంది. ఇక ప్రజల పాత్ర కూడా కీలకమే. ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రజాస్వామ్యంలో ఒక హక్కు. నిధుల వినియోగంపై పార దర్శకత కోరాలి. అవినీతి జరిగితే నిరసన వ్యక్తం చేయాలి. సామాజిక బాధ్యతతో ప్రతి పౌరుడు వ్యవహరించాలి. మొత్తంగా చూస్తే, పుష్కరాలు ఒక ఆధ్యాత్మిక వేడుకగా కొనసాగాలి. కానీ వాటిపేరుతో నిధుల దుర్వినియోగం జరగకూడదు. ప్రజల ప్రాథమిక అవసరాలు తీర్చకుండా, తాత్కాలిక అవసరాలపై భారీ ఖర్చులు చేయడం సరైన నిర్ణయం కాదు. ప్రభుత్వాలు ప్రాధాన్యతలను సరిగా నిర్ణయించాలి. విద్య, ఆరోగ్యం, ఆహారం వంటి మౌలిక అంశాలపై దృష్టి పెట్టాలి. అప్పుడు మాత్రమే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది. ప్రజల కోసం ఖర్చు చేసే ప్రతి రూపాయి ప్రజల జీవితాన్ని మెరుగుపరచాలి. అదే నిజమైన పాలన, ప్రజాపాలన. •

## చంద్రుని ఆవలివైపు
# ఏం ఉంది?



ఆర్టెమిస్ వ్యోమనౌకలో 40నిమిషాలు బ్లాకౌట్

స్పేస్‌క్రాఫ్ట్‌ను కమ్మేసిన చీకట్లు

జాబిల్లికి సమీపం నుంచి సూర్యగ్రహణ దర్శనం

తిరిగి భూమివైపు ప్రయాణం ఆరంభించిన ఆర్టెమిస్

**న్యూయార్క్, ఏప్రిల్ 7:** ఆర్టెమిస్2 మిషన్‌లో భాగమైన ఓరియన్ స్పేస్‌క్రాఫ్ట్ చంద్రుడి ఆవలి వైపు నుంచి ప్రయాణించింది. ఆ సమయంలో సుమారు 40 నిమిషాల పాటు ఆ స్పేస్‌క్రాఫ్ట్‌లో బ్లాకౌట్ అయ్యింది. అమెరికా కాలమానం ప్రకారం సోమవారం రాత్రి 6.44 నిమిషాలకు ఆ బ్లాకౌట్ ప్రారంభమైంది. నాసా ప్రకారం మళ్లీ రాత్రి 7.25 నిమిషాలకు బ్లాకౌట్ ముగిసింది. ఆ సమయంలో స్పేస్‌క్రాఫ్ట్‌ను చిమ్మచీకట్లు కమ్మేశాయి. చంద్రుడి ఆవల చీకటి వైపు ఓరియన్ స్పేస్‌క్రాఫ్ట్ ఉన్న సమయంలో వ్యోమగాములు అనేక పరీక్షలు నిర్వహించారు. మిషన్ కంట్రోల్‌తో లింకు లేకున్నా వ్యోమగాములు మాత్రం శాస్త్రీయ పరిశోధనలు చేపట్టారు. చంద్రుడికి మరో వైపు ఉన్న సమయంలో.. ఆస్ట్రోనాట్స్ ఒంటరి అయిపోయారు. వారితో ఎటువంటి కొవ్యూనికేషన్ జరగలేదు. భూమికి, స్పేస్‌క్రాఫ్ట్‌కు మధ్య చంద్రుడు ఉండడం వల్ల సిగ్నల్ అందదు. దీనితో బ్లాకౌట్ జరుగుతుంది. అయితే ఆ సమయంలో చంద్రుడి చీకటి ప్రదేశాన్ని ఆస్ట్రోనాట్స్ స్టడీ చేసినట్లు తెలుస్తోంది. ఆ టైంలోనే అపోలో 13 రికార్డును ఆర్టెమిస్ వ్యోమగాములు బ్రేక్ చేశారు. అపోలో 13 కన్నా సుమారు 4 వేల మైళ్లు అధిక దూరం ఆర్టెమిస్ వ్యోమగాములు ప్రయాణించారు. ఓరియన్ స్పేస్‌క్రాఫ్ట్‌లో ఉన్న వ్యోమగాములు.. సూర్య గ్రహణాన్ని వీక్షించారు. అద్భుతమైన ఆ క్షణాలను వ్యోమగాములు ప్రత్యక్షంగా అనుభవించారు. చంద్రుడికి అతి సమీపం నుంచి సూర్య గ్రహణాన్ని మనుషులు వీక్షించడం చరిత్రలో ఇదే మొదటిసారి అవుతుంది. చంద్రుడు భ్రమణ సమయంలో ఆర్టెమిస్ సిబ్బంది అనూహ్యమైన సూర్యాస్తమయాన్ని వీక్షిస్తారు. ఆ సమయంలో సోలార్ కరోనా ఏర్పడనుతుంది. ఇదే సమయంలో ఆర్టెమిస్‌లో ఉన్న వ్యోమగాములు అంతరిక్షంలో ఉన్న అనేక గ్రహాలను ఫోటో తీశారు. భూమి, మెర్క్యూరీ, వీనస్, మార్స్, శని గ్రహాలను వ్యోమగాములు ఫోటో తీశారు. కేవలం ఆస్ట్రోనాట్స్ మాత్రమే వీక్షించగల గ్రహణాన్ని ప్రత్యేక కెమెరాలతో ఫోటోలు తీశారు. ఓరియన్ స్పేస్‌క్రాఫ్ట్ జర్నీ సమయంలో అనేక శాస్త్రీయ పరిశోధనలు కూడా చేపట్టారు. తమ ప్రయాణంలో ఓ అరుదైన సంపూర్ణ సూర్య గ్రహణాన్ని వీక్షించినట్లు ఆస్ట్రోనాట్స్ చెప్పారు. కాని దీన్ని వర్ణించడం అంత సులువైన అంశంకాదన్నారు. సుమారు ఏడు గంటల పాటు చంద్రుడి ఉపరితలాన్ని వ్యోమగాములు అబ్జర్వ్ చేశారు. కొత్తగా రెండు అగాధాలను గుర్తించినట్లు తెలుస్తోంది. వాటికి పేర్లు కూడా పెట్టారు. గతంలో వెళ్లిన స్పేస్‌క్రాఫ్ట్ ఇంటిగ్రిటీ పేరును ఓ క్రాటర్‌కు పెట్టారు. రెండో క్రాటర్‌కు కారల్ అని నామకరణం చేశారు. ఆర్టెమిస్ మిషన్ కమాండర్ రీడ్ వైజ్‌మాన్ భార్య ఇటీవల క్యాన్సర్‌తో మృతిచెందింది. అతని భార్య పేరు కారల్. ఆమె పేరును ఓ క్రాటర్‌కు పెట్టారు.

## అసోం, కేరళ, పుదుచ్చేరిలో ముగిసిన ప్రచారం
# మూడు అసెంబ్లీలకు రేపే పోలింగ్



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 7:** అసోం, కేరళ, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల ప్రచారం మంగళవారం సాయంత్రం ముగిసింది. ఏప్రిల్ 9వ తేదీ గురువారం ఆయా రాష్ట్రాల్లో ఒకే విడతలో పోలింగ్ జరుగనుంది. ఆఖరి రోజు అన్ని పార్టీలు ప్రచారాన్ని హోరెత్తించాయి. కేరళలో కాంగ్రెస్, బిజెపి, అధికార ఎల్‌డిఎఫ్ పార్టీలు ఒకరిపై ఒకరు విమర్శల దాడిని తీవ్రతరం చేశాయి. ఇదే సమయంలో, 2021లో ఇచ్చిన హామీలలో 97 శాతాన్ని నెరవేర్చినట్లు పేర్కొంటూ ఎల్‌డిఎఫ్ ఒక ప్రగతి నివేదికను విడుదల చేసింది. మరోవైపు పుదుచ్చేరిలో, కేంద్ర పాలిత ప్రాంత శాసనసభ పూర్తి స్థాయి రాష్ట్ర హోదా కల్పించాలని కోరుతూ 14 సార్లు తీర్మానాలు చేసినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా ఎటువంటి ఆసక్తి చూపలేదని తమిళనాడు ముఖ్యమంత్రి, డిఎంకె అధ్యక్షుడు ఎం.కె. స్టాలిన్ ఆరోపించారు. అసోంలో శాంతి, అభివృద్ధి నిరంతరం కొనసాగాలంటే కాంగ్రెస్ పార్టీని అధికారానికి దూరంగా ఉంచాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సోమవారం (ఏప్రిల్ 6, 2026) ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. అసోంలోని 126 స్థానాలకు, కేరళలోని 140 స్థానాలకు, పుదుచ్చేరిలోని 30 స్థానాలకు గురువారం పోలింగ్ జరగనుంది. ఎన్నికల సంఘం ఇందుకు సంబంధించి ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తోంది.

## సర్‌ఛార్జిలను పెంచిన ఎయిరిండియా

**ముంబయి, ఏప్రిల్ 7:** ప్రపంచవ్యాప్తంగా జెట్ ఇంధన ధరలు పెరిగిన నేపథ్యంలో, దేశీయ అంతర్జాతీయ మార్గాల్లో ఇంధన సర్‌ఛార్జీని సవరిస్తున్నట్లు ఎయిరిండియా ప్రకటించింది. దేశీయ మార్గాలకు సంబంధించి, బుధవారం నుంచి ఫ్లాట్ సర్‌ఛార్జీ స్థానంలో దూరం ఆధారిత విధానానికి మారనున్నట్లు ఆ విమానయాన సంస్థ తెలిపింది. దేశీయంగా 500 కిలోమీటర్ల లోపు ప్రయాణాలకు రూ.299 నుంచి 2,000 కిలోమీటర్ల కంటే ఎక్కువ ప్రయాణాలకు రూ.899 సర్‌ఛార్జ్‌ను సవరిస్తున్నట్లు తెలిపింది. అంతర్జాతీయ విమాన సర్వీసులకు 24 డాలర్ల నుంచి 280 డాలర్ల వరకు వసూలు చేయనున్నట్లు తెలిపింది. సవరించిన ఛార్జీలు డొమెస్టిక్ ప్రయాణాలకు ఈనెల 8వ తేదీ నుంచి, అంతర్జాతీయ ప్రయాణాలకు 10వ తేదీ నుంచి వసూలు చేస్తామని తెలిపింది. దేశీయ ప్రయాణాలకు 0 నుంచి 500 కిలోమీటర్ల వరకు రూ.299, 501 నుంచి 1000 కిలోమీటర్ల వరకు రూ.399,1001 నుంచి 1500 కిలోమీటర్ల వరకు రూ.549,150 నుంచి 2000 కిలోమీటర్ల వరకు రూ.749, 2000 నుంచి అంతకుమించి కిలోమీటర్లకు రూ.899 వసూలు చేస్తారు. అంతర్జాతీయ ప్రయాణం విషయానికి వస్తే పశ్చిమాసియాకు 50 డాలర్లు, ఆగ్నేయాసియాకు 100 డాలర్లు, సింగపూర్‌కు 60 డాలర్లు, ఆఫ్రికాకు 130 డాలర్లు, యూకేకు 205 డాలర్లు, ఉత్తర అమెరికా, ఆస్ట్రేలియా దేశాలకు 280 డాలర్ల చొప్పున ఫ్యూయల్ సర్‌ఛార్జిని వసూలు చేయనున్నట్లు ఎయిరిండియా గ్రూప్ తెలిపింది.

# కిడ్నీ అయినా ఇవ్వు..రూ.30 లక్షలైనా తీసుకురా!



## అత్తింటివారి నుంచి కోడలికి ఎదురైన వేధింపులు

**కాన్పూర్, ఏప్రిల్ 7:** వరకట్న వేధింపులు ఎంతటి దారుణ స్థాయికి చేరాయో తెలియజేసే ఒక అమానుష ఘటన ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో వెలుగుచూసింది. తన భర్త రెండు కిడ్నీలూ పాడైన విషయాన్ని దాచిపెట్టి పెళ్లి చేశారని, ఇప్పుడు చికిత్స కోసం రూ.30 లక్షలు తీసుకురావాలని లేదా తన కిడ్నీని దానం చేయాలని అత్తింటివారు వేధిస్తున్నారంటూ ఓ మహిళ పోలీసులను ఆశ్రయించింది. కాన్పూర్‌కు చెందిన యువతికి, లక్నోకు చెందిన నిశాంత్ కుమార్‌తో 2023 జూన్ 22న వివాహం జరిగింది. పెళ్లి సమయంలో ఆమె కుటుంబం రూ.8 లక్షల నగదు, విలువైన నగలతో పాటు మహీంద్రా థార్ కారును కట్నంగా ఇచ్చింది. పెళ్లయిన తర్వాత భర్త రోజూ పదికి పైగా మాత్రలు వేసుకోవడం గమనించిన ఆమె, అత్తింటివారిని ప్రశ్నించగా రక్తపోటు ఉందని అబద్ధం చెప్పారు. అనుమానం వచ్చిన ఆమె ఇంట్లో వెతకగా భర్తకు సంబంధించిన మెడికల్ ఫైల్ దొరికింది. వ్యసనాల కారణంగా 2022లోనే అతని రెండు కిడ్నీలు పాడయ్యాయని, అప్పటి నుంచి డయాలసిస్‌పై ఉన్నాడని తెలుసుకుని ఆమె షాక్‌కు గురైంది. ఈ విషయాన్ని నిలదీయడంతో ఆమెపై అత్తింటివారి వేధింపులు మొదలయ్యాయి. నీ భర్త బతకాలంటే మీ పుట్టింటి నుంచి రూ.30 లక్షలు తీసుకురా, లేదంటే నీ కిడ్నీని అతడికి దానం చెయ్యి అని ఒత్తిడి చేశారని తెలిపింది. తన భర్తకు మరో మహిళతో వివాహేతర సంబంధం ఉందని, ఈ విషయం వారి కుటుంబ సభ్యులకు కూడా తెలుసని బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు చాకేరి పోలీసులు నిశాంత్ కుమార్, అతని కుటుంబ సభ్యులపై వరకట్న వేధింపులు, మోసం, క్రూరత్వం కింద కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీస్ అధికారి అభిషేక్ పాండే తెలిపారు.

## బెంగాల్‌పై కన్నేస్తే పాక్ మళ్లీ ముక్కలే

### రక్షణమంత్రి రాజ్‌నాథ్ హెచ్చరిక

**బ్యారక్‌పూర్, ఏప్రిల్ 7:** పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాపై దాడి చేస్తామన్న తన పాకిస్థాన్ రక్షణ మంత్రి బెదిరింపుపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మంగళవారం తీవ్ర హెచ్చరిక చేశారు. 55 ఏళ్ల క్రితం, బంగ్లాదేశ్ ఏర్పాటుకు దారితీసిన 1971 భారత్-పాకిస్థాన్ యుద్ధంలో ఏమి జరిగిందో గుర్తుంచుకోవాలన్నారు. "పాకిస్థాన్ రక్షణ మంత్రి అలాంటి రెచ్చగొట్టే ప్రకటన చేసి ఉండకూడదు. యాభై ఐదు సంవత్సరాల క్రితం, పాకిస్థాన్ రెండు ముక్కలుగా విడిపోయినప్పుడు వారు దాని పర్యవసానాలను అనుభవించారు. వారు బెంగాల్‌పై కన్నేస్తే, ఈసారి పాకిస్థాన్ ఎన్ని ముక్కలుగా విడిపోతుందో దేవుడికే తెలియాలి" అని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. బెంగాల్‌లోని బ్యారక్‌పూర్‌లో నిర్వహించిన ఎన్నికల సభలో రాజ్‌నాథ్ సింగ్ ఈ వ్యాఖ్యలు చేశారు.



## నవ్‌జ్యోత్ సిద్ధూ భార్య కొత్తపార్టీ

### సోషల్‌మీడియా వేదికగా వెల్లడి

**అమృత్‌సర్, ఏప్రిల్ 7:** పంజాబ్ రాజకీయాల్లో మరో ఆకస్మికపరిణామం చోటుచేసుకుంది. మాజీ మంత్రి, కాంగ్రెస్ బహిష్కృత నాయకురాలు, మాజీ టీమిండియా క్రికెటర్ నవజ్యోత్ సింగ్ సిద్ధూ భార్య నవజ్యోత్ కౌర్ సిద్ధూ సొంతంగా రాజకీయ పార్టీని స్థాపించబోతున్నట్లు ప్రకటించారు. గత కొంతకాలంగా ఆమె బీజేపీలో చేరుతారని ప్రచారం జరిగినప్పటికీ, వాటన్నింటికీ తెరదించుతూ కొత్త పార్టీ పెడుతున్నట్టు ప్రకటించి పంజాబ్ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించారు. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ప్రకటన ఇదని తెలుపుతూ, భారతీయ రాష్ట్రవాది పార్టీ (బీఆర్‌పీ)ని స్థాపిస్తున్నట్లు ఆమె సోషల్‌మీడియాలో వెల్లడించారు. ప్రస్తుత రాజకీయ నాయకుల పనితీరును సమీక్షించిన తర్వాత, ప్రజలకు ఒక కొత్త ప్రత్యామ్నాయం అవసరమని భావించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె పేర్కొన్నారు. తన కొత్త పార్టీ ప్రధానంగా ప్రజాసేవ, న్యాయంపై దృష్టి సారిస్తుందని తెలిపారు. ప్రజలకు నిజంగా ఏం కావాలో దానిని అందించడమే తమ లక్ష్యమని చెప్పారు. పంజాబ్ కోల్పోయిన కీర్తిని, గౌరవాన్ని తిరిగి తీసుకురావడం ద్వారా రాష్ట్రాన్ని సువర్ణ రాష్ట్రంగా మార్చడమే తన ఆశయమని వెల్లడించారు. ప్రేమ, స్వేచ్ఛ, నిస్వార్థ సేవ వంటి విలువల ఆధారంగా ప్రభుత్వాన్ని నిర్మిస్తామని పేర్కొన్నారు. పౌరుల్లో ఆధ్యాత్మిక వికాసాన్ని పెంపొందించడం, సత్యం, ప్రేమ మార్గంలో నడవడం వంటి ఉన్నత ఆశయాలను ఆమె తన సందేశంలో ప్రస్తావించారు. గాయపడిన ప్రజల మనసులను నయం చేసే ఉద్యమంగా దీనిని అభివర్ణించారు. ఈ ప్రకటనలో పార్టీ నిర్మాణం, ఇతర నాయకులు ఎవరు ఉంటారు, అధికారికంగా పార్టీని ఎప్పుడు లాంచ్ చేస్తారు అనే అంశాలపై స్పష్టత ఇవ్వలేదు.

# ఎమిరేట్స్ రుణం చెల్లింపుతో మరోసారి సంక్షోభంలోకి పాక్!

**కరాచి, ఏప్రిల్ 7:** యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)కు 3.5 బిలియన్ డాలర్ల (సుమారు రూ.29 వేల కోట్లు) భారీ రుణాన్ని చెల్లించాలని కోరడంతో తీవ్ర అప్పుల భారంతో కుంగిపోతున్న పాకిస్థాన్ మరో పెను ఆర్థిక సంక్షోభంలో చేరుకుంది. ఇప్పటికే ఆ దేశ విదేశీ మారక నిల్వలు అత్యంత కనిష్ఠ స్థాయికి పడిపోయిన తరుణంలో, ఈ చెల్లింపు పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థను మరింత కుంగదీస్తుందన్న అంచనాలున్నాయి. గతంలో స్నేహపూర్వక దేశాల నుంచి రుణాలు పొంది, వాటిని రోలోవర్ (గడువు పొడిగింపు) చేయించుకుంటూ పాకిస్థాన్ నెట్టుకొచ్చేది. ఈసారి రోలోవర్‌కు యూఏఈ నిరాకరించినట్లు తెలుస్తోంది. అమెరికాఇజ్రాయెల్ ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో మారిన భౌగోళిక రాజకీయ సమీకరణాలే అబుదాబి కఠిన వైఖరికి కారణమని తెలుస్తోంది. ప్రాంతీయ ఉద్రిక్తతల్లో పాకిస్థాన్ ఇరాన్‌కు దగ్గరగా ఉందనే భావన గల్ఫ్ దేశాలతో, ముఖ్యంగా యూఏఈతో సంబంధాలను క్లిష్టతరం చేసిందని పేర్కొంది. ఈ భారీ చెల్లింపు పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపనుంది. విదేశీ మారక నిల్వలు మరింత పడిపోయి దిగుమతులకు చెల్లింపులు జరపడం, కరెన్సీ స్థిరత్వాన్ని కాపాడుకోవడం కష్టతరం కానుంది. ఇప్పటికే అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) పర్యవేక్షణలో ఆర్థిక సంస్కరణలు చేపడుతున్న పాకిస్థాన్‌కు ఈ పరిణామం గట్టి ఎదురుదెబ్బేనని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు. గతంలో పాకిస్థాన్‌కు యూఏఈ ఆర్థికంగా అండగా నిలిచింది. 2018లో 2 బిలియన్ డాలర్ల సాయం అందించగా, 2023లో మరో 1 బిలియన్ డాలర్ల కోసం పాక్ అభ్యర్థించింది. అప్పులో కొంత భాగాన్ని పెట్టుబడిగా మార్చుకునే అంశంపై చర్చలు జరుపుతున్నట్లు అధికారులు చెబుతున్నా, అవి ఎంతవరకు ఫలిస్తాయోనన్న అనిశ్చితి నెలకొంది. మొత్తంగా, ఈ సంక్షోభం పాక్ ఆర్థిక వ్యవస్థలోని దీర్ఘకాలిక బలహీనతలను మరోసారి వెల్లడి అయ్యాయి.



## భారత్ ధర్మసత్రం కాదు: కేంద్ర మంత్రి అమిత్ షా

**అస్సాం, ఏప్రిల్ 7:** అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు సమయం దగ్గరపడుతుండడంతో ఆయా రాష్ట్రాల్లో ప్రచారంజోరుగా సాగుతోంది. తాజాగా అస్సాంలోని బరాక్ లోయలో జరిగిన ఎన్నికల ప్రచారంలో కేంద్రమంత్రి అమిత్ షా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అక్రమ చొరబాటుదారుల ప్రస్తావన తీసుకొచ్చారు. పశ్చిమ బెంగాల్‌లో అభివృద్ధి జరగాలన్నా, అక్రమ చొరబాటుదారులను తరిమికొట్టాలన్నా అది బిజెపి వల్లే సాధ్యం అని, బిజెపి అధికారంలోకి వస్తేనే ఇవన్నీ జరుగు తాయన్నారు. బరాక్ లోయలో బెంగాలీలు ఎక్కువగా ఉంటారు. బెంగాల్‌లో అక్రమ చొరబాటుదారుల అంశాన్ని పేర్కొనడం గమనార్హం.

# భారత్ సంతతి వైద్యునికి 14 మిలియన్ డాలర్ల జరిమానా!

## అవినీతి బయటపెట్టింది మాజీ ఉద్యోగులే

**అట్లాంటా, ఏప్రిల్ 7:** అమెరికా అట్లాంటాలో భారత సంతతికి చెందిన డాక్టర్ జితేష్ పటేల్ తన పవిత్రమైన వైద్యవృత్తికి మచ్చతెచ్చే విధంగా వ్యవహరించారన్న అభియోగాలతో ఆయనపై 14 మిలియన్ డాలర్ల జరిమానా విధించారు. ఈయన తన క్లినిక్‌కు వచ్చే ప్రతి రోగికి అవసరం ఉందో లేదో కూడా చూడకుండానే శాశ్వత ప్రాతిపదికన శాక్రల్ నర్వ్ స్టిమ్యులేటర్ పరికరాలను శరీరంలో అమర్చారు. రోగులకు మత్తుమందు ఇచ్చి మూత్రనాళం ద్వారా లోపలికి స్కోప్‌లను పంపే సిస్టోస్కోపీ వంటి పరీక్షలను అవసరం లేకపోయినా పదే పదే చేసినట్లు డోజ్ అధికారులు తెలిపారు. యూరాలజీలో ఎప్పుడో గానీ వాడని ఎలక్ట్రోమయోగ్రఫీ పరీక్షలను దాదాపు ప్రతి రోగికి చేసినట్లు డోజ్ వెల్లడించారు. ఇందులో భాగంగా రోగుల జననేంద్రియాలకు ఎలక్ట్రోడ్లు తగిలించి విద్యుత్ సంకేతాలను పంపేవారని దర్యాప్తులో తేలింది. చిన్న ఆపరేషన్‌కూడా సంక్లిష్టమైన ఆపరేషన్ చేసినట్లుగా ప్రభుత్వానికి బిల్లులు పంపి భారీగా సొమ్ము చేసుకున్నట్లు ఫిర్యాదులు వెళ్లాయి. డాక్టర్ జితేష్ పటేల్ చేసిన ఈ నేరాన్ని బయట పెట్టింది అతడి వద్ద పని చేసిన మాజీ ఉద్యోగిని లోరైన్ పెరుమాల్, మాజీ ఫిజీషియన్ డాక్టర్ హిమాన్షు అగర్వాల్‌లే. ఒకప్పుడు జితేష్ పటేల్ వద్ద పని చేసిన వీళ్లే తమ క్లినిక్‌లో జరుగుతున్న దందా గురించి, జితేష్ పటేల్ చేస్తున్న అరాచకాల గురించి ఎఫ్‌బీఐకి ఫిర్యాదు చేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఈక్రమంలోనే ఎఫ్‌బీఐ అధికారులు విచారణ చేపట్టి మోసం జరిగింది నిజమేనని తేల్చారు. సర్కారు ఆయనపై 14 మిలియన్ డాలర్లు చెల్లించాలని చెప్పగా డాక్టర్ జితేష్ ఒకే చెప్పారు. సమాచారం ఇచ్చిన లోరైన్ పెరుమాల్, డాక్టర్ హిమాన్షు అగర్వాల్‌లకు ఈ జరిమానాలోంచి 2.94 మిలియన్ డాలర్లు (భారత కరెన్సీ ప్రకారం సుమారు రూ. 27 కోట్లు) ఇవ్వబోతున్నట్లు కూడా సర్కారు స్పష్టం చేసింది.



## భారత్ రక్షణ వ్యవస్థలోకి ఆత్మాహుతి డ్రోన్లు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 7:** ఆధునిక యుద్ధ తంత్రంలో డ్రోన్స్ కీలకంగా మారాయి. గెలుపోటములను ప్రభావితం చేసే స్థాయికీ డ్రోన్స్ చేరుకున్నాయని రక్షణ రంగ నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో భారత్ అమ్ములపొదిలోకి మరో అస్త్రం వచ్చి చేరింది. శత్రుమూకలకు వెన్నులో వణుకు పుట్టించే ఆత్మాహుతి డ్రోన్స్‌ను (కామికాజీ డ్రోన్స్) గుజరాత్‌లోని సూరత్‌కు చెందిన ఇన్‌సైడ్ ఎఫ్‌పీవీ సంస్థ సైన్యానికి అప్పగించింది. వీటి కోసం రూ.10 కోట్లకు గతంలో ఆర్మీ ఒప్పందం కుదర్చుకోగా తాజాగా వందల సంఖ్యలో ఈ డ్రోన్‌లను ఇన్‌సైడ్ ఎఫ్‌పీవీ డెలివరీ చేసింది. గతేడాది డిసెంబర్‌లోనే ఈ ఒప్పందం కుదరగా అత్యవసర ప్రాతిపదికన నెలల వ్యవధిలోనే కంపెనీ ఈ డ్రోన్స్‌ను సరఫరా చేసింది. మైనస్ 35 డిగ్రీల ఉష్ణోగ్రతలు ఉండే కఠిన వాతావరణంలో కూడా పనిచేసేలా ఈ డ్రోన్స్‌ను డిజైన్ చేశామని సంస్థ వెల్లడించింది. యుద్ధ స్థలంలోని పరిస్థితులను రియల్‌టైమ్‌లో తెలుసుకునేందుకు ఉద్దేశించిన ఫస్ట్ పర్సన్ వ్యూ డ్రోన్స్ తయారీకి కూడా ఇన్‌సైడ్ ఎఫ్‌పీవీ పేరుగాంచింది. నిపుణులు చెప్పే దాని ప్రకారం, ఏఐ ఆధారిత గైడెన్స్ వ్యవస్థ ఉన్న ఈ డ్రోన్స్ 2.5 కిలోల వరకూ పేలుడు పదార్థాలను తీసుకెళ్లగలవు. 120 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే ఈ డ్రోన్స్ 10 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ధ్వంసం చేస్తాయి. సంప్రదాయక దళాలు చేరుకోలేని ప్రాంతాల్లో అత్యధిక రిస్క్ ఉన్న మిషన్స్ కోసం వీటిని వినియోగిస్తారు. శత్రుదేశంలోని లక్ష్యాలపై అత్యంత కచ్చితత్వంగా వేగంగా దాడి చేసేందుకు ఈ డ్రోన్స్‌ను ప్రధానంగా వినియోగిస్తారని రక్షణ రంగ నిపుణులు చెబుతున్నారు.

## వైట్‌హౌస్‌లోనే రహస్య గూఢచారులున్నారు!

### ఆపరేషన్ లీకేజిపై ట్రంప్ ఆగ్రహం

**వాషింగ్టన్, ఏప్రిల్ 7:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తమ ప్రభుత్వంలోనే ఒక గూఢచారి ఉన్నాడంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌లో కూలిపోయిన ఎఫ్15ఈ స్ట్రైక్ ఈగిల్ పైలట్‌ను కాపాడేందుకు యూఎస్ సైన్యం భారీ ఆపరేషన్ నిర్వహించింది. ఆ ఆపరేషన్ వివరాలను గూఢచారి లీక్ చేశాడని ట్రంప్ ఆగ్రహం వ్యక్తంచేశారు. తన సైన్యం నిర్వహించిన ఆపరేషన్ గురించి మాట్లాడిన ట్రంప్ ఎఫ్15ఈ విమానం కూలిన తర్వాత ఒక పైలట్‌ను అమెరికా బలగాలు రకించాయని, రెండో పైలట్ కోసం బలగాలు ఇంకా గాలిస్తున్నాయని వార్త రావడంతో ఇరాన్‌కు ఆ విషయం తెలిసిందని ట్రంప్ అన్నారు. దాంతో ఆపరేషన్ క్లిష్టతరమైందని చెప్పారు. వార్త రాసిన జర్నలిస్టుకు సమాచారం ఎవరిచ్చారో చెప్పకపోతే జైలుకి వెళ్లాల్సి వస్తుందని బెదిరించారు. అయితే ఆ జర్నలిస్టు పేరుగానీ, ఆ వార్త సంస్థ పేరుగానీ ట్రంప్ బయటపెట్టలేదు. లీక్‌కు కారణమైన వ్యక్తిని కనిపెట్టేందుకు తమ ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తుందని ట్రంప్ చెప్పారు. అమెరికా దళాలు రెండో పైలట్ కోసం గాలిస్తున్నాయని వార్త ప్రచురితమైన తర్వాతేఇరాన్ అప్రమత్త మైందన్నారు. ఆ పైలట్‌ను పట్టుకున్నవారికి భారీగా బహుమతి అందజేస్తామని ఆ దేశం బహిరంగ ప్రకటన జారీ చేసిందని, దాంతో తమ సహాయక చర్యలకు తీవ్రఆటంకం ఏర్పడిందన్నారు.

# మంటల్లో పశ్చిమాసియా

## కోమాలో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ?



**టెహ్రాన్, ఏప్రిల్ 7:** ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ కోమాలో ఉన్నట్లు సమాచారం. ఆయన ప్రస్తుతం కోమ్ నగరంలో చికిత్స పొందుతున్నారని, ఈ మేరకు అమెరికా-ఇజ్రాయెల్‌కు నిఘా సమాచారం ఉన్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. పశ్చిమాసియా ఘర్షణల వేళ ఇరాన్ నాయకత్వంపై ఈ వార్తలు రావడం సంచలనంగా మారింది. 'ఖమేనీ అపస్మారక స్థితిలో ఉన్నారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నందు వల్ల నిర్ణయాలు కూడా తీసుకోలేని స్థితిలో ఉన్నారు.' అని ఆ కథనాలు పేర్కొన్నాయి. అమెరికా-ఇజ్రాయెల్ దాడుల్లో గాయపడిన ఆయన ఆచూకీ గురించి వెలుగులోకి రావడం ఇదే తొలిసారి. ఆయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలు! ఫిబ్రవరి 28న ప్రారంభమైన దాడుల్లో అప్పటి ఇరాన్ సుప్రీంలీడర్ అయతుల్లా ఖమేనీ మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన అంత్యక్రియలను కోమ్ నగరంలో చేపట్టనున్నట్లు తెలుస్తోంది. ఇక, యుద్ధం ప్రారంభమైన దగ్గరి నుంచి మొజ్తాబా బహిరంగంగా ఎక్కడా కనిపించలేదు. కానీ ఆయన పేరు మీద అప్పుడప్పుడు ప్రకటనలు వెలువడుతున్నాయి. ఘర్షణలు ప్రారంభమైన తొలిరోజే ఆయన కూడా గాయపడ్డారు ఈ విషయాన్ని ఇరాన్ కూడా ధ్రువీకరించిన సంగతి తెలిసిందే. ఇటీవల ఆయన ఇరాన్ దాడుల్ని సమీక్షిస్తున్నట్లుగా ఉన్న ఒక ఎఐ విడియోను అక్కడి ప్రభుత్వం విడుదల చేయడం గమనార్హం. ఆయనే తమ దేశానికి నాయకత్వం వహిస్తున్నారని అధికారులు చెబుతున్నారు.

## పాకిస్థాన్‌లో 'స్మార్ట్ లాక్‌డౌన్' విధింపు

### చమురు సంక్షోభంతో కీలక నిర్ణయం



**ఇస్లామాబాద్, ఏప్రిల్ 7:** ఇరాన్ యుద్ధం ప్రభావం పాకిస్థాన్‌పై తీవ్రంగా పడుతోంది. హార్ముజ్ జలసంధి మూసివేయడం, విదేశాల నుంచి చమురు రాకపోవడంతో పాకిస్థాన్ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. చమురు కొరత ప్రభావంతో ఇప్పటికే దేశంలో పలు ఆంక్షలు విధించిన పాక్ ప్రభుత్వం తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలో 'స్మార్ట్ లాక్‌డౌడ్' విధిస్తూ పాక్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ ఆదేశాలు జారీ చేశారు. చమురు కొరతపై రాష్ట్రాల సిఎంలతో సమావేశం తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నారు. చమురు వినియోగాన్ని తగ్గించేందుకు, ఉన్న నిల్వల్ని కాపాడుకునేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పాక్ ప్రధాని చెప్పారు. 'స్మార్ట్ లాక్‌డౌడ్'పై స్థానిక రేడియో వెల్లడించిన ప్రకారం.. పాక్‌లోని పంజాబ్, ఖైబర్ పక్తుంఖ్వా, బలూచిస్థాన్, ఇస్లామాబాద్, గిగ్లిత్ బల్తిస్థాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్ వంటి ప్రాంతాల్లో పలు ఆంక్షలు విధించారు. మార్కెట్లు, షాపులు, ఇతర వాణిజ్య సముదాయాలన్నీ రాత్రి 8 గంటలకు మూసేయాలి. కొన్ని ప్రాంతాల్లో మాత్రమే మినహాయింపులు ఇచ్చారు. అక్కడ రాత్రి 9 గంటల వరకు అనుమతి ఉంటుంది. జనరల్ స్టోర్స్, డిపార్ట్‌మెంటల్ స్టోర్స్ వంటివి 8 గంటలకే మూసేయాలి. అలాగే, బేకరీలు, రెస్టారెంట్లు, ఇతర ఫుడ్ ఔట్‌లెట్లు మాత్రం రాత్రి 10 గంటల వరకు తెరిచి ఉంచొచ్చు. అలాగే, పెళ్లి వేడుకలపై కూడా ఆంక్షలు విధించారు. రాత్రి 10 గంటల తర్వాత ఇళ్లల్లో మాత్రమే పెళ్లి వేడులకు తక్కువ మందితో నిర్వహించుకోవాలి. మెడికల్ స్టోర్స్, ఫార్మసీలు మాత్రం ఎల్లప్పుడూ తెరిచి ఉంటాయి. ఈ ఆంక్షలన్నీ మంగళవారం నుంచే అమలు చేయనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. కొన్నిచోట్ల ప్రైవేటు వాహనాలపై నిషేధం విధించారు. అలాగే, ప్రభుత్వ రవాణా ఉచితంగా అందిస్తున్నారు.

## ఇరాన్ రక్షణకోసం ప్రాణత్యాగానికైనా సిద్ధమే

### అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్



**టెహ్రాన్, ఏప్రిల్ 7:** ఇరాన్ రక్షణ కోసం తన ప్రాణాలను సైతం త్యాగం చేయడానికి సిద్ధంగా ఉన్నాని ఆ దేశ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ అన్నారు. దేశానికి చెందిన 14 మిలియన్లకు పైగా ఇరాన్ ప్రజలతో పాటు తానూ దేశం కోసం ప్రాణాలను త్యాగం చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చినట్లు తెలిపారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. కాల్పుల విరమణకు పలు దేశాలు మధ్యవర్తిత్వం వహిస్తోన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఏదేమైనా పోరాటాన్ని ఆపే ప్రసక్తి లేదని అన్నారు. ఇరాన్ కోసమే నిలబడ్డాను, ఇక ముందు కూడా నిలబడతానని పేర్కొన్నారు. ఇరాన్ హార్ముజ్ జలసంధిని తెరవకపోతే ఆ దేశంలోని అనేక స్థావరాలను, మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుంటామని ట్రంప్ హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈసారి డెడ్‌లైన్ పొడిగింపు ఉండదని, ఇరాన్‌ను తమ బలగాలు ఒక్క రాత్రికే తుడిచి పెట్టేయగలవని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ఇరాన్ అధ్యక్షుడు ధీటుగా స్పందించారు. అమెరికా తాత్కాలిక ఒప్పందాలకు అంగీకరించబోమని, తమ శాశ్వత డిమాండ్లు అంగీకరించాలని చెబుతోంది. తాను, తమ దేశ ప్రజలు ప్రాణత్యాగాలకు కూడా సిద్ధమని ఇరాన్ అధ్యక్షుడు ప్రకటించడం చూస్తుంటే పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## రైళ్లలో వెళ్లద్దంటూ ఇరాన్‌ప్రజలకు ఇజ్రాయెల్ హెచ్చరికలు

**టెల్ అవీవ్, ఏప్రిల్ 7:** ఇరాన్‌ఇజ్రాయెల్, అమెరికా యుద్ధం మరింత ఉగ్రరూపం దాలుస్తోంది. భీకర దాడులకు ఇరు దేశాలు సిద్ధమవుతున్నాయి. ఈ క్రమంలో ఇరాన్ ప్రజలకు ఇజ్రాయెల్ ఒక హెచ్చరిక జారీ చేసింది. రైల్వే వ్యవస్థలకు, రైళ్లకు దూరంగా ఉండాలని హెచ్చరించింది. ముఖ్యంగా 12 గంటలపాటు రైళ్లలో ప్రయాణించకపోవడమే మంచిదని సూచించింది. స్థానిక కాలమానం ప్రకారం ఇప్పటి నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు ఇరాన్‌లోని ఏ రైళ్లలో అయినా ప్రయాణించడం మానేయండి అని ప్రజల్ని హెచ్చరిస్తూ ఎక్స్‌లో ఇజ్రాయెల్ మిలిటరీ ఒక ప్రకటన జారీ చేసింది. వారి భద్రత కోసమే హెచ్చరికలు చేస్తున్నట్లు తెలిపింది. రైళ్లలో లేదా రైల్వే లైన్ల సమీపంలో ఉంటే ప్రాణాలకు ముప్పు తప్పదని హెచ్చరించింది. ఇజ్రాయెల్ ఇరాన్‌పై సోమవారం భారీ దాడులు నిర్వహించింది. యేహ్లోని పెట్రో కెమికల్ స్థావరాలపై దాడి చేసింది. ఇరాన్‌కు అవసరమైన చమురులో 50 శాతం అందించే స్థావరంపై దాడి చేసినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. ఇది దేశంలోనే అతిపెద్ద చమురు స్థావరం. సౌత్‌పార్స్ గ్యాస్ ఫీల్డ్‌పై దాడి జరిగినట్లు ఇరాన్ మీడియా కూడా ధృవీకరించింది. ఈ ప్రదేశంపై దాడి జరగడం అంటే ఇరాన్‌కు భారీ ఆర్థిక నష్టం కలిగినట్లే. దీని విలువ వందల కోట్ల డాలర్లు ఉంటుందని ఇజ్రాయెల్ తెలిపింది.

# అంతా గ్యాస్!

**• రెండు రోజుల్లో డెలివరీ అని ప్రకటనలు • అమలులో 15 రోజులకంటే పై మాటే • గృహ వినియోగ సిలిండర్ వీధుల్లో ప్రత్యక్షం • కొరవడిన తనిఖీలు**



ఏలూరు, ఏప్రిల్ 7 పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో: అమెరికా, ఇజ్రాయిల్, ఇరాన్ గల్ఫ్ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధం భారతదేశంలోని చమురు, గ్యాస్ నిల్వలపైన తీవ్ర ప్రభావం చూపిస్తున్నది. రానున్న రోజుల్లో సామాన్యులకు ఇవి అందుబాటులో ఉండవని జరుగుతున్న ప్రచారాన్ని రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి ఉన్నతాధికారులు ఖండించారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వార్తలను నమ్మవద్దని సంబంధిత అధికారులు ప్రెస్ మీట్‌లు పెట్టి కిందిస్థాయి అధికారుల ద్వారా ప్రచారం జరిగించారు. ఇందులో భాగంగా ప్రధానంగా గ్యాస్ సరఫరాపై వదంతులు నమ్మవద్దు అని, వినియోగానికి సరిపడ గ్యాస్ నిల్వలు ఉన్నాయని బుక్ చేసుకున్న వినియోగదారునికి రెండు నుంచి మూడు రోజుల్లో గ్యాస్ సిలెండర్ అందజేయడం జరుగుతుందని పలుమార్లు భరోసానిస్తూ ప్రకటనలు జారీ చేశారు. అయితే వాస్తవం దీనికి విరుద్ధంగా ఉంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సుమారు 8 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉండగా వీటిలో 80శాతం మందికి గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకున్న 15 రోజుల నుంచి నెలలోపు సిలిండర్ అందజేస్తున్నారు. ప్రధానంగా ఇండేన్ గ్యాస్ సంస్థ విధించిన షరతులతో వినియోగదారులు గ్యాస్ సిలిండర్ పొందడం కంటే అడవికి పోయి కట్టెలు తెచ్చుకోవడం సులభమని సెట్టైర్లు వేసుకుంటున్నారు. ఇండియన్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ కనీసం 15 రోజులు గరిష్టంగా 25 రోజుల్లో సిలిండర్ డెలివరీ ఇస్తున్నారు. వినియోగదారుడు ప్రతి 25రోజులకు ఒకసారి మాత్రమే గ్యాస్ బుక్ చేసుకోవడానికి అనుమతినిస్తున్నారు. అలాగే ఇకెవైసి పూర్తికాని వారికి గ్యాస్ సిలిండర్ ఆపివేశారు. తణుకులో ఒక డిస్ట్రిబ్యూటర్ అందించిన వివరాల ప్రకారం తమ ఏజెన్సీ 15 రోజుల్లో సిలిండర్ అందిస్తున్నామని, రోజూ 5000 మందికి పైగా క్యూలో ఉంటున్నారని తెలిపారు. 80 శాతం మంది మాత్రమే ఇకెవైసి పూర్తిచేసుకున్నారని మిగతా 20శాతం మంది అందుబాటులో లేరన్నారు. గ్యాస్ లభించదని వదంతులు నమ్మిన ప్రజలు అవసరం లేకున్నా సిలిండర్లు బుక్ చేసుకుంటున్నారని వివరించారు. ఆన్ టైం డెలివరీలో తమ ర్యాంకులు నెంబర్ వన్ స్థానం నుంచి అట్టడుగు స్థానానికి పడిపోయాయన్నారు. ఆర్డర్ పెట్టినప్పటికీ హెచ్‌పి గ్యాస్, భారత్ గ్యాస్ సంస్థలకు వచ్చినట్టు ఇండియన్ గ్యాస్ రావట్లేదని, వినియోగదారుల ఆగ్రహానికి గురవుతున్నామని ఆ డిస్ట్రిబ్యూటర్ ఆవేదన వ్యక్తం చేశారు. రోజూ అధికారులు తమ కార్యాలయాలు, బిల్లులు తనిఖీలు చేస్తున్నారని అయితే అవసరం లేకున్నా సిలిండర్లు బుక్ చేసి నల్ల బజారులో విక్రయిస్తున్న గృహ వినియోగదారులను అరికట్టలేకపోతున్నారని వాపోయారు. గతంలో సిలిండర్ మీద 300 వరకు సబ్సిడీ ఇచస్తామన్నా ముందుకు రాని కమర్షియల్ గ్యాస్ వినియోగదారులు ఇప్పుడు గ్యాస్ కోసం క్యూ కడుతున్నారన్నారు.

ఇదిలా ఉండగా హోటల్, రెస్టారెంట్ యజమానులు పిఎన్‌జి గ్యాస్ కనెక్షన్లకు దరఖాస్తు చేసుకోమని ప్రభుత్వ అధికారులు పిలుపునిస్తున్నప్పటికీ మన జిల్లాలో ఇప్పట్లో పిఎన్‌జి గ్యాస్ సరిపడ స్థాయిలో అందుబాటులోకి వచ్చే అవకాశాలు లేవంటున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలోని తాడేపల్లిగూడెం ప్రాంతంలో గోదావరి గ్యాస్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా పిఎన్జి గ్యాస్ సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ నాగరాణి గతంలోనే సూచించారు. అయితే కమర్షియల్ గ్యాస్ యజమానులు బ్లాక్ మార్కెట్లో గ్యాస్ సిలిండర్లు కొనడానికి మొగ్గు చూపుతున్నారు. డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ బ్లాక్ మార్కెట్లో 3000 రూపాయలకు అమ్ముడుపోతుందని సమాచారం.

హోటళ్ళు, స్ట్రీట్ ఫుడ్ యజమానులు బహిరంగంగానే గృహ వినియోగ సిలిండర్లో వినియోగిస్తున్నారు. వీరిపై నిఘా లేకపోవడంతో యథేచ్ఛగా సిలిండర్లను బ్లాకులో కొని వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. గ్యాస్ కొరత నేపథ్యంలో తనిఖీలు నిర్వహించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించటంతో గృహవినియోగ గ్యాస్ సిలిండర్లు వీధుల్లో దర్శనమిస్తున్నాయని పలువురు బహిరంగానే వ్యాఖ్యానిస్తున్నారు.

## కందుల కొనుగోలు గడువు మే 4 వరకు పొడిగింపు

**• మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడి**

విజయవాడ ఏప్రిల్ 7 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో కందుల కొనుగోలు గడువు మే 4 వరకు పొడిగించడం జరిగిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి జీసన్‌కు సంబంధించి కందులు కొనుగోలు గడువును కేంద్ర ప్రభుత్వం పొడిగించడం రైతులకు ఎంతో ఊరటనిచ్చే నిర్ణయం అని అన్నారు. రాష్ట్రంలో ధర మద్దతు పథకం కింద కొనుగోలు కొనసాగుతుందని మంత్రి తెలిపారు. కొనుగోలు గడువును పొడిగించాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు విజ్ఞప్తిని పరిశీలించిన కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ, మే 4 వరకు పొడిగింపునకు ఆమోదం తెలిపిందన్నారు. రైతులు తమ పంటను నష్టపోకుండా విక్రయించుకునేలా చూడటం కూటమి ప్రభుత్వం బాధ్యత, రైతు పండించిన ప్రతి గింజకు గిట్టుబాటు ధర అందేలా ముఖ్యమంత్రి నిరంతరం కృషి చేస్తున్నారు అని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు వచ్చిన ప్రభుత్వం వెంటనే స్పందిస్తోంది. పంటల కొనుగోలు, గిట్టుబాటు ధర, మార్కెటింగ్ వంటి అన్ని అంశాల్లో రైతులకు న్యాయం జరిగేలా చర్యలు కొనసాగిస్తాము అని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

## 96 కోర్టులు ఏర్పాటుపై మాధవ్ హర్షం

విశాఖపట్నం, ఏప్రిల్ 7 ప్రభాతవార్త: రాష్ట్రంలో న్యాయవ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం 96 కొత్త కోర్టులను ఏర్పాటు చేయడానికి ఆమోదం తెలిపిన నిర్ణయాన్ని బిజెపి రాష్ట్ర శాఖ అధ్యక్షుడు పివియన్ మాధవ్ హర్షం వ్యక్తం చేసారు. ఈ నిర్ణయం ద్వారా పెండింగ్‌లో ఉన్న కేసుల భారాన్ని తగ్గించడంతో పాటు ప్రజలకు వేగవంతమైన న్యాయం అందించే అవకాశం ఏర్పడుతుందన్నారు. న్యాయం అందుబాటులోకి రావడం ప్రజాస్వామ్యానికి అత్యంత కీలకం అని బిజెపి భావిస్తుందని పేర్కొన్నారు. అదేవిధంగా, ఈ కోర్టుల స్థాపనతో సుమారు 1,700 పైగా ఉద్యోగ అవకాశాలు సృష్టించబడటం కూడా సానుకూల పరిణామం. యువతకు ఉపాధి అవకాశాలు పెరగడం రాష్ట్ర అభివృద్ధికి దోహదం చేస్తుందని తెలిపారు. రాష్ట్రంలో న్యాయ వ్యవస్థ మరింత సమర్థవంతంగా పనిచేసేలా ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకోవాలని కోరారు.

## తిరువూరులో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ ధర్నా



విజయవాడ, ఏప్రిల్ 7 ప్రభాత వార్త ప్రతినిధి: ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ ధర్నా చేశారు. జాతీయ రహదారి వెంట స్థలాలు కబ్జాకు గురవుతున్నాయని కొలికపూడి నిరసన వ్యక్తం చేశారు. కబ్జా దారులను ప్రభుత్వ స్థలాల నుంచి ఖాళీ చేయించాలని ఎమ్మెల్యే కొలికపూడి కోరారు. అధికారులు అలసత్వం, అవినీతి కారణంగా కబ్జాదారులు రెచ్చిపోతున్నారన్నారు. దీని వలన తమ ప్రభుత్వానికి చెడ్డ పేరువస్తుందని, అధికారులు వైఖరి మార్చుకోవాలన్నారు. ఎమ్మెల్యే నిరసన చేస్తున్న విషయం తెలుసుకున్న అధికారులు హుటా హుటిన చేరుకున్నారు. ఎమ్మార్వో, పోలీసులు చేరుకొని ఎమ్మెల్యేతో మాట్లాడారు. 10 రోజుల్లో సర్వే చేయించి సమస్య పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. అధికారుల హామీతో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ నిరసన విరమించారు.

## మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్‌తో పాలనలో విప్లవాత్మక మార్పులు

**• విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీ వర్క్‌షాపు ఎంతో ఉపయోగం • ఎపి టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ**



విజయవాడ, ఏప్రిల్ 7 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రాన్ని డిజిటల్ భద్రతలో అగ్రగామిగా నిలపాలనే దూరదృష్టితో, దేశంలోనే అత్యంత ఆధునిక సాంకేతిక ప్రమాణాలతో కూడిన "సైబర్ సెక్యూరిటీ ఆపరేషనల్ సెంటర్ (ఎపిసిఎస్‌ఓసి)"ను ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయడం జరిగిందని ఎపిటిఎస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ తెలిపారు. దీని ద్వారా ప్రభుత్వ విభాగాలు, కీలక మౌలిక వసతులు, పౌరుల డేటాకు సమగ్ర రక్షణ కల్పిస్తూ, సైబర్ ముప్పులను ముందుగానే గుర్తించి సమర్థవంతంగా ఎదుర్కొనే విధంగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామన్నారు. మంగళవారం విజయవాడ కానూరులోని విఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో ఎపిటిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాట్సాప్ గవర్నెన్స్ (మన మిత్ర), సైబర్ సెక్యూరిటీ అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ వినూత్న ఆలోచనతో, దేశంలోనే తొలిసారిగా వాట్సాప్ ద్వారా 1,000కి పైగా ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేశామని తెలిపారు. మన మిత్ర డిజిటల్ పాలనలో సరి కొత్త అధ్యాయం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్ మేరకు, ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేకుండా 95523 00009 నంబర్‌కు వాట్సాప్‌లో హాయ్ అని మెసేజ్ పంపడం ద్వారా నిమిషాల్లో సేవలు పొందవచ్చని ఆయన వివరించారు. అందుబాటులో ఉన్న ప్రధాన సేవలు డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్, కుల, ఆదాయ ధ్రువపత్రాలు, భూమి పాస్‌బుక్ వివరాలు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, పెన్షన్ దరఖాస్తులు, ఆరోగ్యశ్రీ, హాల్ టికెట్లు, పరీక్షా ఫలి తాలు, తిరుమల సహా ప్రముఖ ఆలయాల దర్శనం, వసతి బుకింగ్స్, ఆర్టీసీ టికెట్లు అందిస్తుందన్నారు. విద్యార్థులు, ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలను ఆయన సూచించారు. పబ్లిక్ వైఫైలో బ్యాంకింగ్ లావాదేవీలు చేయడం అంత మంచిదికాదని సూచించారు. అనుమానాస్పద లోన్ యాప్స్, ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలన్నారు. వీడియో లైక్ చేస్తే డబ్బులు వస్తాయనే స్కామ్‌లను నమ్మవద్దన్నారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు.

సైబర్ సెక్యూరిటీ రంగంలో యువతను ప్రోత్సహించేందుకు ఎపిటిఎస్ ప్రతి ఏటా హ్యాకథాన్‌లు నిర్వహిస్తోందని, ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.10,000 స్టైఫండ్ తో ఇంటర్న్ షిప్ సదుపాయం కల్పిస్తుందని ఆయన వెల్లడించారు. ఎపిటిఎస్ ప్రతినిధులు శ్రీనివాస్, దినేష్‌లు సైబర్ మోసాల పై విద్యార్థులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో విఆర్ సిద్ధార్థ కళాశాల వైస్ ఛాన్సలర్ డా. పి. వెంకటేశ్వరరావు, ఎన్.ఎస్.ఎస్ కోఆర్డినేటర్ డా. జె.శివరామ్ ప్రసాద్‌లు పాల్గొన్నారు.

## అడ్వకేట్ ఎల్లయ్య దారుణ హత్య



కె.విపల్లి, ఏప్రిల్ 7 ప్రభాతవార్త: అన్నమయ్య జిల్లా కె.వి. పల్లి మండలంలోని తీతవగుంటపల్లి పంచాయతీ పాత వడ్డిపల్లికి చెందిన అడ్వకేట్ పూజారి ఎల్లయ్య (40) సోమవారం రాత్రి దారుణ హత్యకు గురయ్యారు. సోమవారం సాయంత్రం అదేపల్లెకు చెందిన శ్రీనివాసులు తదితరులతో ఊరిలో ట్రాన్స్‌ఫార్మర్ విషయమై ఘర్షణ పడ్డారు. అనంతరం వారు బయటకు వెళ్లిపోయి రాత్రి 11 గంటల సమయంలో అడ్వకేట్ ఇంటిపైకి వచ్చారు. ట్రాన్స్‌ఫార్మర్ విషయంలో కోపం పెంచుకున్న నిందితులు పూజారి ఎల్లయ్యను బయటకు తీసుకువచ్చి రాళ్లతో కొట్టి చంపారు. ఘటనకు సంబంధించిన వివరాలను రాయచోటి డిఎస్పి కృష్ణమోహన్ విలేకరులకు వివరించారు. అతని తల్లిదండ్రులకు తీవ్రగాయాలు కావడంతో పీలేరులో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయాకు తరలించారు. నిందితులను పట్టుకోవడానికి ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. త్వరలోనే నిందితులను అరెస్టు చేస్తామని డిఎస్పి పేర్కొన్నారు. మృతుని తండ్రి వెంకటరమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని డిఎస్పి తెలిపారు.

## తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదం @4 దశాబ్దాలు

**ఎన్టీఆర్ చేతుల మీదుగా 1985 ఏప్రిల్ 6న ప్రారంభం**



తిరుమల, ఏప్రిల్ 7 ప్రభాతవార్త ప్రతినిధి: "అన్నం పరబ్రహ్మస్వరూపం"గా భావించి ఆకలితో అలమటించే ప్రాణికి పట్టెడు అన్నం పెట్టడం కంటే ఏ దానమూ గొప్పదికాదని ధార్మిక సంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం విశ్వసిస్తోంది. ఇదే నినాదంతో 1985 ఏప్రిల్ 6న తిరుమలలో ఎస్వీ నిత్యాన్నదానం పథకం ప్రారంభమైంది. తొలుత 2వేల మందితో ప్రారంభమై నేడు రోజుకు లక్ష మందికిపైగా భక్తులకు అన్నప్రసాదాల వితరణ చేసే స్థాయికి పూర్తిగా దాతల సహకారంతోనే అభివృద్ధి చెందింది. తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం విచ్చేస్తున్న లక్షలాది మంది భక్తులకు మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంలో నిరంతరంగా రుచిగా శుచిగా నాణ్యమైన అన్నప్రసాదాలను టిటిడి భక్తులకు అందిస్తోంది. తిరుమలకు వచ్చిన అశేషసంఖ్య భక్తులకు ఆకలి అనేది తెలియకుండా రుచిగా, శుచిగా తిరుమల తిరుపతి దేవస్థానం ఉదయం నుండి రాత్రి వరకు అన్నప్రసాదాలు వడ్డిస్తోంది. ఒక్కసారిగా నాలుగు వేల మంది భక్తులు కూర్చుని స్వీకరించేలా సేవలందిస్తున్నారు. గత కొన్నినెలల నుండి అన్నప్రసాదాల్లో మసాలవడ అదనంగా భక్తులకు వడ్డిస్తున్నారు. ఉదయం 8.30గంటల నుండి రాత్రి 11గంటల వరకు వెంగమాంబ అన్నప్రసాద భవనంలో నాణ్యమైన అన్నం, సాంబారు, రసం, మజ్జిగ, చక్కెరపొంగలి, తాళింపు(కర్రీ)ని, మసాలవడ రుచికరంగా భక్తులకు వడ్డిస్తుండటం జరుగుతుంది. రోజువారీగా తిరుమలకు లక్షమందివరకు భక్తులు చేరుకుంటున్నా 1.20లక్షలమంది వరకు భక్తులు ప్రతిరోజూ అన్నప్రసాదాలు స్వీకరిస్తున్నట్లు టిటిడి గణాంకాలు. తిరుమలకు గోవింద నామస్మరణతో వచ్చే భక్తులకు అప్పట్లో తొలుత ఆ దేవుని దర్శనం చేసుకున్న వారికి మాత్రమే టోకెన్ విధానంలో ఉచితంగా అన్నదానం చేసేవారు.

1985 ఏప్రిల్ 6న తిరుమలలో నిత్యఅన్నదానం సత్రం ప్రారంభమైంది. అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీరామారావు ఉచిత అన్నప్రసాద వితరణను ప్రారంభించారు. ఎల్వీ రామయ్య అనే భక్తుడు ఇచ్చిన 10లక్షల రూపాయలు విరాళాలతో టిటిడి ఉచిత అన్నప్రసాదానికి శ్రీకారం చుట్టింది. అప్పట్లో పరిమిత సంఖ్యలో మాత్రమే ఉచిత భోజనం లబించేది. శ్రీవారి దర్శనం చేసుకున్న భక్తులకు మాత్రమే ఆలయంలో ఉచిత భోజనం టోకెన్లు అందించేవారు. తొలుత రెండు వేల మందికి మాత్రమే భోజనం అందించడం నుండి 20వేల మందికి పెరిగిది. ప్రస్తుతం లక్షమంది వరకు కూడా అందిస్తున్నారు.

**17వ శతాబ్దం నుండే అన్నప్రసాదాలు:** శ్రీవారి అపరభక్తురాలు మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ 17వ శతాబ్దంలో తిరుమలలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేసినట్లు ఆధారాలు లభిస్తున్నాయి. ఏటా వైశాఖ మాసంలో తిరుమలలో నృసింహజయంతి జరిపే వెంగమాంబ పదిరోజులపాటు అన్నప్రసాద వితరణ, చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చరిత్ర చెబుతోంది. ప్రస్తుతం తిరుమలలోని తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంలో ఒకేసారి 4వేలమంది భక్తులకు భోజనం స్వీకరించేలా ఏర్పాట్లు ఉన్నాయి. ఈ భవనాన్ని 2011 జులై 11న అప్పటి రాష్ట్రపతి ప్రతిభాపాటిల్ ప్రారంభించారు.

**1985లో రూ.10లక్షలతో అన్నప్రసాదం వితరణ:** తిరుమలలో భక్తుల సంఖ్యకు తగ్గట్లు అప్పట్లో ఉచిత అన్నప్రసాద వితరణకు టిటిడి శ్రీకారం చుట్టింది. దాతలిచ్చే విరాళాలపై వచ్చే వడ్డీతోనే ఈ అన్నదానం నడుపుతున్నారు. ఈ పథకం క్రింద దాత ఒకరోజుకు 44లక్షలు రూపాయలు విరాళాలిస్తే దాత స్వయంగా వచ్చి వడ్డించే అవకాశమేగాక దాత పేరు ప్రదర్శన చేస్తారు. ఉదయం అల్పాహారం కోసం 10లక్షలు రూపాయలు, మధ్యాహ్నం భోజనం కోసం 17లక్షలు, రాత్రి భోజనం కోసం 17లక్షలు రూపాయలు అందించి దాతలు స్వయంగా భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించవచ్చు.

## 26 నుంచి తిరుపతిలో సిపిఐ రాష్ట్ర మహాసభలు

**- పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు హరినాథరెడ్డి**



తిరుపతి, ఏప్రిల్ 7 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుపతి జిల్లా కేంద్రంలో ఈ నెల 26వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జరిగే ఎఐటియూసీ మహాసభలు జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి. హరినాథరెడ్డి పిలుపు నిచ్చారు. తిరుపతి నగరం బైరాగిపట్టెడలో గల గంధమనేని శివయ్యభ భవన్‌లో మంగళవారం సిపిఐకార్యవర్గ సభ్యులు, ఎఐటియుసి జిల్లా ముఖ్య నాయకుల సమావేశం చిన్నయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా హరినాథరెడ్డి మీడియాతో మాట్లాడారు. తిరుపతిలో జరిగే మహాసభలకు సుమారు వెయ్యి మంది ప్రతినిధులు హాజరు అవుతారన్నారు. 26వ తేదీ ఇందిరామైదానంలో బహిరంగ సభ జరుగుతుందన్నారు. ఈ సభలకు ఎఐటీయూసీ జాతీయ కార్యదర్శి అమరజిత్ కౌర్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య ముఖ్య అథిథులుగా హాజరవుతారన్నారు. ఈ మహాసభ చాలా ప్రాధాన్యతతో కూడకున్నదని హరినాథరెడ్డి చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా అనేక పరిణమాలు జరుగుతున్న నేపథ్యంలో ఈ మహాసభలు జరుగుతున్నాయన్నారు. కార్మికవర్గం బ్రిటీషు సామ్రాజ్యవాదులతో కొట్లాడి సుమారు 60 చట్టాలను సాధించుకున్నారన్నారు. అయితే కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేసి... వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్ లను తెచ్చిందన్నారు. కార్మికవర్గాన్ని కట్టు బానిసలుగా మార్చే కుట్రలో భాగంగానే మోడీ ప్రభుత్వం ఈ లేబర్ కోడ్‌లు తెచ్చిందన్నారు. ఈ లేబర్ కోడ్‌లను రాష్ట్ర ప్రభుత్వం కూడా సమర్థించడం బాధాకరమన్నారు. ఈ లేబర్ కోడ్‌లతో కార్మికుల హక్కులు హరించుకుపోతాయని హరినాథరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సమాన పనికి సమాన వేతనం.. కార్మికులకు ఉద్యోగభద్రత కల్పించాలని దేశ అత్యున్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చినా పాలకులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. కార్మికులు ఎక్కువ గంటలు పనిచేయాలని నేటి పాలకులు వింత వాదన చేస్తున్నారని, ఇందులో భాగంగానే 8గంటలకు బదులు 10గంటలు పని అమల్లోకి తెచ్చేందుకు రాష్ట్ర శాసనసభ ఆమోదం తెలిపిందన్నారు. మరో పక్క కేంద్ర ప్రభుత్వం 12గంటల పని దినాలు అమల్లోకి తెచ్చేందుకు ప్రయత్నం చేస్తోందన్నారు. ఇక ఉత్పత్తి వికేంద్రీకరణ చేయక పోవడం వలన ఆదాయం కేవలం కొన్ని సంపన్న కుటుంబాలకే చెందుతోందన్నారు. ఈ కారణంగానే పేదవాడు మరింత పేదగా మారిపోతున్నాడని పుట్టా హరినాథరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్పత్తి అందరికీ సమానంగా పంచాలని.. లేబర్ కోడ్ లు రద్దు చేయాలని... అసంఘటిత కార్మికుల హక్కులు కాపాడాలనే ప్రధాన అజెండాతో ఈ ఏఐటీయూసీ మహాసభలు జరుగుతున్నాయన్నారు. ఈ మహాసబలకు కార్మికవర్గం తరలివచ్చి జయప్రదం చేయాలని పుట్టా హరినాథరెడ్డి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి నాగ సుబ్బారెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, జిల్లా కార్యదర్శి మురళి తదితరులు పాల్గొన్నారు.

## బంగారం కోసం వృద్ధురాలు హత్య

**• సొంత మేనల్లుడే ఘాతకానికి సూత్రధారి • నిందితులు రిమాండ్‌కి తరలింపు**





చీపురుపల్లి, ఏప్రిల్ 7 ప్రభాతవార్త: చీపురుపల్లి మండలం శివారులో గల గొల్లలపాలెం గ్రామంనకు చెందిన గొర్లె చిన్నప్పమ్మ (68) అనే వృద్ధురాలిని రెండు తులాల బంగారం కోసం సొంత మేనల్లుడే హత్య చేసి ఊరు చివర్లో గల చెరువులో పాతిపెట్టిన ఘటన మంగళవారం వెలుగు చూసింది. చీపురుపల్లి డి.ఎస్.పి. ఎస్ రాఘవులు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎన్.శంకరరావు సారథ్యంలో ఈ సంఘటనకు సంబంధించి వివరించిన విషయాలు ఇలా ఉన్నాయి. విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం గొల్లలపాలెం గ్రామానికి చెందిన వృద్ధురాలు చిన్నప్పమ్మ ఫిబ్రవరి నెల 23న ఇంటి నుండి కనబడకుండా పోయినట్లు ఆమె కుమార్తె అల్లుడు రెడ్డి పాపినాయుడు ఫిబ్రవరి 27న చీపురుపల్లి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిబ్రవరి 23 నుండి కనబడకుండా పోయిన చిన్నప్పమ్మను బంధువులు, తెలిసిన కుటుంబాల వద్ద ఈ నెల 26 వరకు వెతక సాగారు. ఈ క్రమంలో మృతురాలు సొంత మేనల్లుడైన ఎజ్జపురపు రమణ, అదే గ్రామానికి చెందిన చందకరమన కదలికల పైన గ్రామస్తులకు అనుమానం రావడంతో పోలీసులు దర్యాప్తును కొనసాగించారు. దర్యాప్తులో భాగంగా నిందితులను అదుపులోకి తీసుకొని పోలీసులు ప్రశ్నించగా తామే ఈ హత్యకు పాల్పడినట్లు అంగీకరించడంతో మంగళవారం నాడు నిందితులతో పాటు శవాన్ని పాతిపెట్టిన స్థలానికి పోలీస్, అధికారులు, రెవెన్యూ, క్లూస్ బృందంతో పాటు ఆర్ఎఫ్ఎస్ఎల్ పోలీస్ లేబరేటరీ సిబ్బంది కూడా సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వెలికి తీశారు. బంధువుల సమక్షంలో మృతురాలని గుర్తించి హత్యా నేరంగా పరిగణించారు. పోలీసుల కథనం మేరకు ఫిబ్రవరి 23న మృతురాలిని ఇంటిలోనే సొంత మేనల్లుడైన ఎజ్జిపురపు రమణ, చందకర రమణ ఇద్దరు కలిసి మృతురాల్ని హత్య చేసి ప్లెక్సీల కవర్లలో చుట్టి గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో గల చెరువులో పాతిపెట్టినట్లు పోలీసులు వెల్లడించారు. తమకున్న సమాచారం మేరకు ఇద్దరు నిందితులను కూడా రణస్థలం వద్ద అరెస్టు చేశామని సిఐ వివరించారు.

ప్రాథమిక సమాచారం మేరకు నిందితులు దొంగిలించిన బంగారంతో పాటు, వారికి ఎవరెవరు సహకరించారు అనే అంశం పైన కూడా దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. వ్యసనాలకు అలవాటు పడి ఈ ఘాతకానికి పాల్పడినట్లు పోలీసులు వివరించారు. ఈ మేరకు సీఐ శంకర్రావు ఆధ్వర్యంలో చీపురుపల్లి ఎస్ఐ దామోదర్ రావు, గరివిడి ఎస్ఐ లోకేష్, బుధ రాయవలసి ఎస్ఐ లోకేష్, గుర్ల ఎస్ఐ నారాయణరావు, పోలీస్ సిబ్బంది స్థలానికి చేరుకొని చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ డి ధర్మరాజు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఐక్యంగా పోరాడితే సమస్యలు పరిష్కారం

**• రాష్ట్ర మున్సిపల్ పెన్షనర్స్ అసోసియేషన్ రీజనల్ సమావేశంలో నిర్ణయం**




తిరుపతి, ఏప్రిల్ 7 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్ర మున్సిపల్ పెన్షనర్స్ అసోసియేషన్ రాయలసీమ రీజనల్ సర్వేసభ్య సమావేశం మంగళవారం తిరుపతిలో జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ గోగురాజు అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసోసియేషన్ బలోపేతం చేయుటకు అన్ని జిల్లాలలో కమిటీలు ఏర్పాటు చేసి ఎక్కువ సభ్యులను చేర్పించాలని కోరారు. అదేవిధంగా వారి సమస్యలు ఏమైనా ఉంటే వెంటనే తెలియజేస్తే, వాటిని పరిష్కరించుటకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్ర అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డివిఎస్ఎన్ మూర్తి (మురళి) మాట్లాడుతూ సభ్యులు సమస్యలు పరిష్కరించుటకు అసోసియేషన్ ఇప్పటి వరకు తీసుకొన్న చర్యలు తెలియజేశారు. రాష్ట్ర సోసియేషన్ కోశాధికారి జి వేణుగోపాలస్వామి మాట్లాడుతూ కాకినాడ, రాజమండ్రి కార్పొరేషన్ లో మొత్తం 200 మంది సభ్యులను జీవిత సభ్యులుగా చేర్పించారన్నారు. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలకు మున్సిపల్ కార్పొరేషన్‌లకు ఆదర్శంగా నిలిచినారని, వారిని ఆదర్శంగా తీసుకొని మిగిలిన మున్సిపాలిటీలోనూ, మున్సిపల్ కార్పొరేషన్‌లోను సభ్యులను చేర్చుటకు అందరూ కష్టపడాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో వక్తలు నరసింహ మూర్తి, నవాబ్ జానీ, మునిస్వామి, వెంకటరామయ్య, ముఖ్య అతిథిగా కేఎల్ వర్మ మాట్లాడుతూ అందరూ కలిసికట్టుగా ఐక్యమత్యంతో పోరాడితే ఏదైనా సాధించగలమని, గతంలో 010 జీతాలు సాధించుకున్నామని తెలిపారు. ఈ సమావేశంలో తుని, కాకినాడ, రాజమండ్రి, భీమవరం, రాయలసీమ జిల్లాల్లోని మున్సిపా లిటీలు, మునిసిపల్ కార్పొరేషన్స్ విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు. పలు తీర్మానాలు చేశారు.

# ఆంధ్ర వర్సిటీ అంతర్జాతీయంగా ఖ్యాతి గడించాలి

**● శతాబ్ది ఉత్సవాల్లో ఎంపి ఎం.శ్రీభరత్ ఆకాంక్ష ● వేడుకల్లో పాల్గొన్న సినీ నటుడు శివాజి**



విశాఖపట్నం, ఏప్రిల్ 7 ప్రభాతవార్త: ప్రపంచంలోనే గొప్ప విశ్వవిద్యాలయంగా ఆంధ్ర విశ్వవిద్యాలయం నిలవాలని విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎం.శ్రీభరత్ అన్నారు. ఏయూ శతాబ్ది ఉత్సవాలలో భాగంగా ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న మెగా కల్చరల్ ఫెస్ట్ రెండవ రోజు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీభరత్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయాలు నూతన జ్ఞానాన్ని సృష్టించే కేంద్రాలుగా నిలవాలని, మంచి పౌరులను తయారు చేయాలన్నారు. విద్యార్థులు స్వీయ ఆలోచనలను కలిగి ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా వేదికపై ఏయూ విద్యార్థుల ప్రదర్శించిన నృత్యాలు. సాంస్కృతిక కార్యక్రమాలను అభినందించారు. ఆటపిక, సహనంతో ఉంటే విజయం తప్పక వరిస్తుందని సినీ నటుడు శివాజి అన్నారు. ఒత్తిడిలేని జీవితం గడపాలన్నారు. విశ్వవిద్యాలయం వందేళ్ల ప్రయాణం, విజయం వెనుక ఉన్న రహస్యం, కృషిని తెలుసుకోవాలన్నారు. ప్రపంచానికి అవసరమైన మేధావులను, ఉపయుక్తమైన జ్ఞానాన్ని ఏయూ అందించిందన్నారు. యువత సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని, మద్యానికి దూరంగా ఉండాలని, ఎవ్వరినీ మోసం చేయకుండా జీవించడం నేర్చుకోవాలన్నారు.ఏయూ వీసీ ఆచార్య జి.పి రాజశేఖర్ మాట్లాడుతూ శతాబ్ధి వేడుకలలో భాగంగా నిర్వహించిన వివిధ కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో కల్చరల్ ఫెస్ట్ చైర్మన్ ఆచార్య ఎన్.విజయ్ మోహన్, వైస్ చైర్మన్ ఆచార్య ఏ.పల్లవి, కన్వీనర్ ఆచార్య ఎన్.ఎం యుగంధర్, సి.హెచ్ ఆశా ఇమ్మానియల్ రాజు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు, ప్రిన్సిపాల్స్, ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఏయూ, అనుబంధ కళాశాలల విద్యార్థుల నృత్యాలు, సాయి దేశ హర్ష, వాగ్దేవిల గానం అలరించాయి. యూత్ ఫెస్టివల్‌లో జాతీయ స్థాయిలో బహుమతులు సాధించిన విద్యార్థులకు రిపబ్లిక్ డే పరేడ్‌లో భాగమైన ఎన్.ఎస్.ఎస్ విద్యార్థులను వేదికపై సత్కరించారు.

# విఆర్‌ఎల సమస్యలపై కేబినెట్‌లో చర్చించండి

**● రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు విఆర్‌ఎల వినతి**



విజయవాడ, ఏప్రిల్ 7 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న చిరు ఉద్యోగులైన గ్రామ రెవెన్యూ సహాయకులు యొక్క దీర్ఘకాలిక సమస్యలుపై ఈ నెల 10వ తేదీన జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో చర్చలు జరపాలని తద్వారా నిర్ణయాత్మక తీర్మానాలు చేసి సమస్యలకు వెంటనే పరిష్కారం చూపాలని ఎపి విఆర్‌ఎ వెల్ఫేర్ అండ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను ప్రత్యేకంగా కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు 9 సంవత్సరాలుగా కేవలం 10.500/-వేతనంతో ప్రభుత్వ విధులు నిర్వహిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంపై మాకు అపారమైన నమ్మకం ఉందని, గతంలో కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించి న్యాయం చేశారని, అదే విధంగా ఇప్పుడు కూడా మాకు న్యాయం చేస్తారనే ధీమాతో రాష్ట్రంలోని వీఆర్‌ఏలు ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటిదాకా అనేక దఫాలుగా రెవెన్యూశాఖలోని రాష్ట్ర ఉన్నతాధికారులకు రాష్ట్ర మంత్రులకు, ప్రభుత్వ పెద్దలకు అనేక దఫాలుగా వినతి పత్రాలు అందించి ఆదుకోమని అర్థించామని చెప్పారు. వీఆర్‌ఏలు దాదాపు ఎస్సీ, ఎస్టీ, బిసి, ముస్లిం మైనార్టీ వర్గాలకు చెందిన అత్యంత నిరుపేద కుటుంబాలకు చెందినవారు అనే సంగతి ప్రభుత్వం గుర్తురెగాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వీఆర్‌ఏలకు పే స్కేల్ ఇవ్వాలని నామినీ విఆర్‌ఏలను రెగ్యులర్ చెయ్యాలని, ప్రస్తుతం 30 శాతం ఉన్న ప్రమోషన్ కోటాను 70 శాతంకు పెంచాలని కోరారు.



## కనకదుర్గమ్మవారికి మంగళసూత్రములు కానుక

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 7 ప్రభాతవార్త: దుర్గమ్మవారికి బంగారు డైమండ్ సూత్రాలు బరువు 22 గ్రాములు హైదరాబాద్‌కు చెందిన టి. శ్రీనివాస రావు కుటుంబం సుమారు రూ.2.70 లక్షల విలువైన మంగళసూత్రాలను ఆలయ సూపరింటెండెంట్ డివివి సత్యనారాయణకు అందజేశారు. దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు అనంతరం వారికి దుర్గమ్మ ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటో అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

**మొయినాబాద్ ఫామ్‌హౌస్ డ్రగ్స్ కేసు**

## నిందితుల కస్టడీపై తీర్పు నేటికి వాయిదా



**హైదరాబాద్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన మొయినాబాద్‌లోని రోహిత్ రెడ్డి ఫాం హౌస్ డ్రగ్స్ కేసు వ్యవహారంలో అ రెస్టయిన ముగ్గురు నిందితుల మూడవ దఫా కస్టడీ పిటిషన్‌పై రాజేంద్రనగర్ కోర్టు తీర్పును బుధవారానికి వాయిదా వేసింది. ఈ కేసులో అరెస్టయిన రోహిత్ రెడ్డితో పాటు ఆయన సోదరుడు రితేష్ రెడ్డి, ఢిల్లీ రియల్టర్ నమిత్ శర్మలు బెయిల్ కోసం దాఖలు చేసిన పిటిషన్లను కోర్టు డిస్మిస్ చేసింది.

మొయినాబాద్ ఫాం హౌస్ డ్రగ్స్ పార్టీ కేసులో ముగ్గురు నిందితులను మూడవసారి ఐదు రోజుల కస్టడీకి ఇవ్వాలని చేవెళ్ల పోలీసులు కోరడం తెలి సిందే. అయితే డిఫెన్స్ న్యాయవాది దీనిని వ్యతిరేకించి తన క్లయింట్లకు వెంటనే బెయిల్ మంజూరు చేయాలని అభ్యర్థించడం విదితమే. దీనిపై సో మవారమే వాదనలు ముగియగా మంగళవారం తీర్పు వెలువడాల్సి వుంది. అయితే మంగళవారం సాయంత్రం నిందితుల కస్టడీ పిటిషన్‌పై తీర్పును బుధవారానికి వాయిదా వేసిన కోర్టు ఇదే సమయంలో నిందితుల తరఫున దాఖలైన బెయిల్ పిటిషన్‌ను డిస్మిస్ చేసింది.

ఈ ముగ్గురు మూడు వారా లుగా చంచల్‌గూడ జైల్లో రిమాండులో వున్నారు. ఫాం హౌస్ డ్రగ్స్ కేసులో ముగ్గురు నిందితులను రెండు దఫాలు మూడేసి రోజుల పాటు పోలీసు విచారించడం తెలిసిందే. రెండు దఫాల విచారణలో ముగ్గురు పెద్దగా సమాచారం వెల్లడించక పోవడంతో మూడదఫా కస్టడీ విచారణకు పోలీసులు కోర్టును ఆశ్రయించారు.




# కులం వద్దంటూ మారథాన్ వాక్

విజయవాడ, ఏప్రిల్ 7 ప్రభాతవార్త ప్రతినిధి: "కులం వద్దంటూ వేలాది మంది యువతీయువకులు, ప్రజాస్వామ్య వాదుల నినాదాలతో విజయవాడ నగర రహదారులు మారు మోగ్రాయి.విజయవాడ నగరంలో అనేక సామాజిక చైతన్య సంస్థలు సంయుక్తంగా కులరహిత యాత్రను నిర్వహించాయి.మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం (ఎంబివికె), జాషువా సాంస్కృతిక వేదిక (జెఎస్‌ఎస్) సంయుక్త ఆధ్వర్యంలో కుల రహితం – సమాజ హితం్ నినాదంతో మంగళవారం నుండి 14వ తేదీ వరకు విజయవాడలో పలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. తొలి రోజు కార్యక్రమంలో భాగంగా ఉదయం ఏడు గంటలకు విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం నుండి ఎంజి రోడ్డులోని అంబేద్కర్ స్మృతివనం వరకు మారథాన్ వాక్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ప్రారంభించారు. రాష్ట్ర పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్‌మెంట్ సోషల్ ఆడిట్ విభాగం డైరెక్టర్ జి.శ్రీకాంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాడుతా తీయగా ఫేమ్ రసూల్ బృందం సాయంత్రం ఆరు గంటలకు హనుమంతరాయ గ్రంథాలయంలో కులాలకు వ్యతిరేకంగా వచ్చిన సినిమా పాటలతో సినీ పాటల కచేరి నిర్వహించారు. ఇక ఈ కార్యక్రమాలకు అనుసరణగా 9వ తేదీ మధ్యాహ్నం 2గంటలకు ఎంబివికె ఎసి ఆడిటోరియంలో "దండోర్గా సినిమా ప్రదర్శన, సాయంత్రం రీల్స్ పోటీలు, కుల రహిత నృత్యాల ప్రదర్శన ఉంటాయి. 10వ తేదీ సాయంత్రం బాలోత్సవ భవన్ రెండో అంతస్తులో కవి సమ్మేళనం, పాటల పుస్తకం ఆవిష్కరణ, కవిత, కథా పుస్తకాల పరిచయ కార్యక్రమాలు జరుగుతాయి. 11న ఎంబివికె 3వ అంతస్తులో చిత్రలేఖనం, కార్టూన్లపై ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేస్తున్నారు. 12న అంబేద్కర్ స్మృతివనం నుండి అమరావతి రన్నర్స్ అసోసియేషన్, సమభావన కమిటీ సంయుక్త ఆధ్వర్యాన సైకిల్ ర్యాలీ, ఎంబివికె 4వ అంతస్తులో అంబేద్కర్ కుల నిర్మూలన, జ్యోతిరావు పూలే, జాషువా, పెరియార్ సాహిత్య పరిచయాలు ఉంటాయి. గోరా ప్రస్తావన తదితరంశాలు కుడా ఉంటాయి. 13న ఎంబివికె 3వ అంతస్తులో "కుల నిర్మూలనపై రాష్ట్ర, జిల్లా స్థాయి గాయకుల పాటల కచేరి, 14న ఎంబివికె గ్రౌండ్ ఫ్లోర్లో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌కు నివాళి కార్యక్రమాలు జరుగుతాయి.

# డ్రగ్స్ కట్టడికి ప్రత్యేక చర్యలు

## విజయవాడ సిపి రాజశేఖరబాబు




విజయవాడ, ఏప్రిల్ 7 ప్రభాతవార్త: విజయవాడ కమీషనరేట్ పరిధిలో డ్రగ్స్ విక్రయాలు, వినియోగాన్ని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు విజయవాడ సిపి రాజశేఖరబాబు తెలిపారు. డ్రగ్స్‌పై దండయాత్ర-2 కార్యక్రమాన్ని విజయవాడ రూరల్ మండలం వాంబే కాలనీలో ఎన్‌టిఆర్‌జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశాతో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈసంద్భంగా డ్రగ్స్‌పై దండయాత్ర-2 పోస్టర్‌లను ఆవిష్కరించిన అనంతరం సిపి మాట్లాడుతూ డ్రగ్స్‌పై దండయాత్ర-1 ను 35రోజులపాటు నిర్వహించామన్నారు. ఈయాత్ర ద్వారా 3లక్షల మందితో డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని డిజిటల్ ప్రతిజ్ఞచేయించినట్లు తెలిపారు. ఈయాత్ర ప్రజలపై మంచి ప్రభావం చూపిందన్నారు. 5గురు మహిళా సిబ్బంది 35రోజులపాటు 550 కిలోమీటర్ల మేర సైకిల్‌యాత్ర నిర్వహించి ప్రజలకు డ్రగ్స్ తీసుకోవటం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించినట్లు సిపి తెలిపారు. విజయవాడ పోలీస్ కమీషనరేట్ పరిధిలో 149 హాట్‌స్పాట్‌లను గుర్తించామని, ఈస్పాట్‌లలో 30రోజులపాటు 3వేల మందికి డ్రగ్స్ టెస్ట్‌కిట్‌ల ద్వారా పరీక్షలు చేస్తామన్నారు. స్వచ్ఛందంగా వచ్చి పరీక్షలు చేయించుకున్న వారికి పాజిటివ్ వస్తే వారిలో మార్పు తీసుకువచ్చేందుకు అడిక్షన్ కేంద్రానికి పంపిస్తామన్నారు. పరీక్షలు నిర్వహించేందుకు బస్సును ఏర్పాటు చేసామని, బస్సులో 20మంది పోలీస్‌లు, 10 ఆరోగ్యశాఖ సిబ్బంది విధులు నిర్వహిస్తారన్నారు. విజయవాడ నగరం మొత్తం నిరంతరాయంగా సిసికెమెరాల పర్యవేక్షణలో ఉందన్నారు. గుర్తించిన 149 హాట్‌స్పాట్‌లలో ఎఫ్‌ఆర్‌ఎస్ వ్యవస్థను అందుబాటులోకి తేవాలని యోచిస్తున్నట్లు సిపి వివరించారు. హాట్‌స్పాట్‌లలో లైటింగ్ ఏర్పాటు చేయటంతోపాటు డ్రోన్‌లతో పర్యవేక్షిస్తామన్నారు. అంతేకాకుండా బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తప్పవని సిపి హెచ్చరించారు. రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్‌లపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని జాగ్రత్తగా ఉండాలని హితవు పలికారు. జూన్, జులై నెలల్లో డ్రగ్స్‌పై దండయాత్ర-3 కార్యక్రమం చేపడతామన్నారు. ఈకార్యక్రమంలో బాగంగా ప్రతి కళాశాలలోనూ విద్యార్థులు, యువత ప్రతిఒక్కరిని తనిఖీ చేసే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు సిపి పేర్కొన్నారు. గంజాయి విక్రయిస్తూ నేరాలకు పాల్పడుతున్న 25మందికిపై పిట్ ఎన్.డి.పి.ఎస్ అమలు చేసామని, మరో 20పై చర్యల కోసం ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. కలెక్టర్ లక్ష్మీశా మాట్లాడుతూ డ్రగ్స్ మహమ్మారి వాటిని తీసుకున్న వ్యక్తిపైనే కాకుండా కుటుంబం మొత్తంపై ప్రభావం చూపిస్తుందన్నారు. డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టేందుకు ఇప్పటి వరకు ప్రేమతో చెప్పామని, ఇక నుండి దండన తప్పదని హెచ్చరించారు. డ్రగ్స్ రహిత జిల్లానే ధ్యేయంగా అధికార యంత్రాంగం పనిచేసుందని, దండయాత్ర-2లో బాగస్వాములు అయిన వారిని పి-4 కార్యక్రమంలో బాగస్వాములుగా గుర్తించటంతోపాటు సర్టిఫికెట్‌లు అందిస్తామని హామి ఇచ్చారు. ప్రజలందరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి డ్రగ్స్ నివారణకు సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేసారు. డ్రగ్స్ పరీక్షల కోసం వినియోగించే వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈకార్యక్రమంలో విజయవాడ మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్, డిసిపిలు కృష్ణకాంత్ పటేల్, షరీన్‌బేగం, కె.తిరుమలేశ్వరరెడ్డి, కెజివి. సరిత, బి.లక్ష్మీనారాయణ, కృష్ణప్రసన్న, ఎస్‌విడి.ప్రసాద్, డ్రగ్‌కంట్రోల్ ఏడి శ్రీరామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయండి

**● కృష్ణా-గోదావరి అనుసంధానం సత్వరమే చేపట్టండి ● ఎపి రాజధాని సమస్యలో బిజెపి కూడా ముద్దాయే**

**● అమెరికా చేస్తున్న యుద్ధంపై మోడీ స్పందించాలి ● సిపిఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ డిమాండ్**



విజయవాడ, ఏప్రిల్ 7 ప్రభాతవార్త ప్రతినిధి: సిఎం చంద్రబాబు యాడికి పర్యటనకు వెళ్లి రాయలసీను అభివృద్ధికి 200 టిఎంసి నీళ్లు అవసరం ఉందని, గోదావరి నీళ్లు దాదాపు 3వేల టిఎంసిలు సముద్రంలో కలుస్తున్నాయని వాటిని మళ్లించాల్సి అవసరంపై మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ ఎద్దేవా చేశారు. స్థానిక దాసరి భవన్‌లో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, కార్యదర్శివర్గ సభ్యులు దోనేపూడి శంకర్ కలిసి మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ గాలేరు నగరి, వెలుగొండ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసి 30ఏళ్లు అవుతున్నా ఎప్పటికి పూర్తౌతాయో తెలియని పరిస్థితి ఉందన్నారు. ఇప్పుడు శ్రీకాకుళంలో వంశధార, నాగావళి నదుల నుంచి అనంతపురానికి నీళ్లు తీసుకెళతామని చంద్రబాబు కొత్త పాట అందుకున్నారన్నారు. 1995లో శంకుస్థాపన చేసిన ప్రాజెక్టులను నిర్దిష్ట గడువులో పూర్తి చేస్తామని స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్ర ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయాలని కోరారు. గోదావరి నీళ్లను రాయలసీమకు మళ్లించటం ద్వారా ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. నేను తప్ప ఎవరూ లేదు, ఎవరూ చేయలేరనే ధోరణితో చంద్రబాబు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కృష్ణా, గోదావరి అనుసంధానం త్వరగా పూర్తి చేయాలని, ప్రకాశం జిల్లాలో వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రాజధాని అమరావతి విషయంలో భారత కమ్యూనిస్టు పార్టీ స్పష్టంగా ఉందన్నారు. జగన్ ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు రాజధానిగా అమరావతే ఉండాలని, దానికి 30 వేల ఎకరాల భూమి అవసరం ఉంటుందని జగన్ చెప్పినట్లు గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తరువాత మాటమార్చితే ప్రజలు తిరస్కరించారని చెప్పారు. తరువాత ప్రజలు స్పష్టమైన తీర్పు కూడా ఇచ్చారని తెలిపారు. దేశంలో చాలా రాజకీయ పార్టీలు, పార్లమెంటు ఉభయ సభల్లో ఆమోదం పొందిన తరువాత అమరావతిని రాజధానిగా అంగీకరించాల్సి ఉంటుందన్నారు. వైసిపి ఎంపిలు, జగన్మోహన్‌రెడ్డి వేరువేరు అభిప్రాయాలతో మాట్లాడటం మంచిది కాదన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం రాజధాని, సిఆర్డీఏ భూములపై ప్రచార పిచ్చిని తగ్గించి పనులు చేయాలని హితవు పలికారు. రాజధానికి చట్టబద్ధత ఉందని, డబ్బులు ఉన్నాయని ఇక పనులు వేగంగా చేయాలని సూచించారు. జగన్ మూడు రాజధానులు అంటూ కొత్త సమస్యను తెచ్చినప్పుడు బిజెపి నాయకులు ప్రధాని మోడీ శంకుస్థాపన చేశారని మార్చటానికి వీలు లేదని చెప్పలేదని, కనీసం అమిత్ షా కూడా స్పందించలేదన్నారు. ఇప్పుడు రాజధాని నిర్మాణానికి కేంద్రం సాయం ఉందని బిజెపి నేతలు నంగనాచి మాటలు మాట్లాడున్నారని ఎద్దేవ చేశారు. రాజధాని సమస్యలో బిజెపి కూడా ముద్దాయేవని పేర్కొన్నారు. ఇరాన్ పై ఇజ్రాయెల్‌తో కలిసి అమెరికా చేస్తున్న యుద్ధం ప్రపంచ దేశాల్లో అనేక సమస్యలకు కారణం అవుతున్న పరిస్థితుల్లో ప్రధాని మోడీ వెంటనే స్పందించాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.



# ఎంఎస్ఎంఇల కోసం రూ.2.5 లక్షల కోట్లతో క్రెడిట్ గ్యారంటీ స్కీం

**పశ్చిమాసియా సంక్షోభం అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం తాజా యోజన**

**త్వరలో మంత్రివర్గ సమావేశం పరిశీలనకు వస్తున్న పథకం ప్రతిపాదనలు**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7: పశ్చిమాసియా సంక్షోభంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న అన్ని రంగాలకు కేంద్ర ప్రభుత్వం చేయూతనిచ్చేందుకుగాను రూ.2.5 లక్షలకోట్లుతో క్రెడిట్ గ్యారంటీ స్కీంను అమలుకు తెస్తోంది. ఎంఎస్ఎంఇ రంగంలోని అన్ని సెక్టార్లకు ఈస్కీంను వర్తింపచేయనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం నడుస్తున్న అత్యవసర రుణగ్యారంటీ స్కీంకు విస్తరణగా ఈ స్కీం అమలవుతుంది.ప్రస్తుతం ఇసిజిఎల్ఎస్ ఫ్రేమ్‌వర్క్‌లోనే ఈస్కీంకూడా ఉంటుందని కేంద్రం చెపుతోంది. ఈ స్కీంను కొవిడ్ కాలంలో చిన్న పరిశ్రమలను ఆదుకునేందుకు ఈసీజిఎల్ఎస్‌ను అమలుకు తెచ్చింది. ఈ స్కీంకింద ఎంఎస్ఎంఇ పరిశ్రమలకు 90శాం రుణహామీ ఇస్తుంది. ఇందుకు నేషనల్ క్రెడిట్ గ్యారంటీ ట్రస్టీ కంపెనీ హామీదారుగా ఉంటుంది. బ్యాంకర్లు ఇచ్చిన రుణాల్లో రుణగ్రహీత బకాయిపడితే ఆమొత్తాన్ని ప్రభుత్వం బ్యాంకరుకు భర్తీచేస్తుంది. అదనంగా ఈ స్కీంను కేవలం నాలుగేళ్ల కాలానికి మాత్రమే పరిమితంచేస్తారు. అన్నిరంగాలు, వాటిలోని ఉపరంగాలకు కూడా ఈ స్కీంను వర్తింపచేస్తారు. ఈ స్కీం వివరాలను కేబినెట్ ఆమోదంకోసం పంపించారు.రానున్న రోజుల్లోనే ఈ కొత్త స్కీం ఆమోదం పొంది అమలుకువస్తుందని అంచనా. ఎంఎస్ఎంఇతోపాటే ఏవియేషన్, ఇతరత్రా నగదు కొరత సమస్యను ఎదుర్కొంటున్న అన్ని రంగాలకు వర్తింపచేస్తారు. పశ్చిమాసియా యుద్ధకాలంలో ప్రత్యేకించి వైమానికరంగం నష్టాలను ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. ఇప్పటివరకూ కొనసాగిన ఇసిజిఎల్ఎస్ స్కీంలో రుణగ్రహీత అదనపు సెక్యూరిటీ ఏమి చూపించనవసరం లేకపోయింది. అందుబాటులో ఈరుణం పొందేందుకు వడ్డీరేట్లు కూడా 9.25శాతంగా మాత్రమే కేంద్రం ప్రకటించింది. నాన్‌బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు అయితే 14శాతంగా నిర్ణయించింది. రుణం పొందిన తర్వాత ప్రిన్సిపల్‌మొత్తంపై ఒక ఏడాదిపాటు మారటోరియం కూడా ఉంటుంది. ఈకాలంలో కేవలం వడ్డీచెల్లిస్తే సరిపోతుంది. ఆర్థికసేవల విభాగం అంచనాప్రకారం సుమారు 1.19 కోట్ల గ్యారంటీలు ఇప్పటివరకూ ఈసీజిఎల్ఎస్ స్కీం కింద జారీచేసారు. వీటిలో ఎంఎస్ఎంఇలకు 1.13 కోట్లు జారీ అయ్యాయి. కష్టసమయాల్లోను, అనుకోని విపత్కరపరిస్థితుల్లో చిన్నపరిశ్రమలను ఆదుకునేందుకుగాను ఇసిజిఎల్ఎస్ స్కీం ఎంతోప్రయోజనకారిగా ఉంటుంది.

# అడుగంటుతున్న జలాశయాలు

**డెడ్‌స్టోరేజీ లెవల్‌కు నీటి మట్టం**

**కొద్ది రోజులుగా భారీగా పెరిగిన సాగు, తాగునీటి వినియోగం**

**శ్రీశైలంలో 43 టిఎంసిలే మిగులు**

**హైదరాబాద్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** రికార్డుస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో రాష్ట్రంలోని ప్రధాన, మధ్య తరహా ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు క్రమంగా తగ్గిపోతున్నాయి. ముఖ్యంగా రబీ పంట కాలం చివరిదశలో ఉన్నందున జలాశయాల్లో నీటి మట్టం డెడ్ స్టోరేజీ స్థాయికి చేరువవుతుండటం రైతులను తీవ్రంగా కలవరపెడుతోంది. ఇప్పటికే కొన్ని చిన్న, మధ్య తరహా ప్రాజెక్టుల్లో నీటి లభ్యత ప్రమాదకర స్థాయికి పడిపోవడంతో చివరి దశలో ఉన్న యాసంగి పంటలకు సాగు నీటి సరఫరా కొనసాగుతుందా? లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతు న్నాయి. ఇప్పటివరకు ప్రాజెక్టుల్లో ఉన్న నిల్వల వినియోగం అధికంగా ఉండటంతో 20 రోజులుగా నీటి మట్టం వేగంగా పడిపోతోంది. వేసవి ఎండలు తీవ్రమైన నేపథ్యంలో సాగు, తాగునీటి అవసరాలు పెరగడంతో జలాశయాల్లోని నీటి నిల్వలపై ఒత్తిడి మరింత ఎక్కువవుతోంది. కొన్ని ప్రాజెక్టుల్లో కనిష్ట స్థాయికి నీరు చేరుకోవడంతో డెడ్ స్టోరేజి పరిస్థితి నెలకొందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో అంతరాష్ట్ర జల వినియోగంపై వివాదాలు ముదురుతూ ఏపీ నీటి విని యోగంపైనా ఆందోళనలు వ్యక్తమవు తున్నాయి. గత ఏడాది మాదిరిగా ఈ సారి కూడా వానాకాలం ఆలస్యమైనా లేదా తక్కువ వర్షపాతం నమోదైతే పరిస్థితి మరింత విషమించే ప్రమాదం ఉందన్న హెచ్చరికలను నీటిపారుదల నిపుణులు చేస్తున్నారు.

రాష్ట్రంలోని ప్రధాన జలాశయాల్లో నీటి మట్టాలు గణనీయంగా పడిపోతున్నాయి. కీలక ప్రాజెక్టులు డెడ్ స్టోరేజీకి చేరుకుంటున్నాయి. కృష్ణా, గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లోని ప్రధాన ప్రాజెక్టుల్లో ఈ పరిస్థితి స్పష్టంగా కనిపిస్తున్నది. శ్రీశైలం ప్రాజెక్టులో 215.81 టిఎంసిల సామర్థ్యానికిగాను ప్రస్తుతం కేవలం 43.75 టిఎంసిలు, నాగార్జునసాగర్ ప్రాజెక్టులో 312.05 టిఎంసిల సామర్థ్యానికి కేవలం 176.06 టిఎంసిలు, శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో 80.50 టిఎంసిల సామర్థ్యానికి కేవలం 28.85 టిఎంసిలు, నిజాంసాగర్‌లో 17.80 టిఎంసిల సామర్థ్యానికి 9.54 టిఎంసిలు, సింగూర్లో 29.91 టిఎంసిల సామర్థ్యానికి 7.46 టిఎంసిలు, జూరాల ప్రాజెక్టులో 9.66 టిఎంసిల సామర్థ్యానికి కేవలం 4.71 టిఎంసిలు నీటి నిల్వలు మాత్రమే ఉన్నాయి. పరిస్థితి ఇలానే కొనసాగితే రాష్ట్రంలో సాగు, తాగు నీటికి తీవ్ర సంక్షోభం ఏర్పడే అవకాశం ఉందని నీటిపారుదల నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## బస్సుల్లో ఈ జాగ్రత్తలు పాటించండి

**ఆర్టీఏ అధికారిని ప్రశంసించిన లోకేశ్**

విజయవాడ ఏప్రిల్ 7 ప్రభాతవార్త ప్రతినిధి: ట్రావెల్స్ బస్సుల్లో తరచూ అగ్నిప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రయాణికులకు రవాణా శాఖ అధికారి ఒకరు అవగాహన కలిగించారు. కృష్ణా జిల్లా ఉయ్యూరులో మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ సిద్దిఖ్.. ట్రావెల్స్ బస్సును ఆపి ప్రయాణికులకు మాట్లాడారు. అగ్ని ప్రమాదం జరిగితే విలువైన వస్తువుల కోసం సమయం వృథా చేయొద్దని వెంటనే దిగిపోవాలని కోరారు. ఎమర్జెన్సీ డోర్ ఎక్కడుందో ముందే తెలుసుకోవాలని సూచించారు. ఈ వీడియోపై ఏపీ మంత్రి నారా లోకేశ్ స్పందించారు. ఇందుకు సంబంధించిన వీడియోను ఎక్స్‌లో పంచుకున్నారు. ప్రయాణికుల భద్రతపై ఈ అధికారి చొరవ ఎంతో మంది ప్రాణాలను కాపాడుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ భద్రతా నిబంధనలు పాటించాలని, ఈ వీడియోను స్నేహితులు, కుటుంబ సభ్యులతో పంచుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## 104 సంచార వైద్య వాహనాల్లో మందుల సరఫరా మరింత పటిష్టం

**● ఇ-ఔషధిలో తప్పనిసరిగా నమోదు చేసేలా చర్యలు**

విజయవాడ, ఏప్రిల్ 7 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలోని 104 సంచార వైద్య వాహనాలకు మందులు, సర్జికల్స్ సరఫరా వ్యవస్థను మరింత పటిష్టపర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ వాహనాల్లో గ్రామాలకు వెళ్లి రోగులకు మందులు పంపిణీ చేస్తారు. సెంట్రల్ డ్రగ్ స్టోర్స్ నుంచి మందులు, సర్జికల్స్ సరఫరాకు సంబంధించిన స్టాకు వివరాల్ని ఇ-ఔషధి పోర్టల్ లో తప్పనిసరిగా నమోదు చేయాలన్న వైద్యారోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్ ఆదేశాల మేరకు ఈ విధానంపై రెండు రోజులపాటు రాష్ట్ర స్థాయి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ పర్యవేక్షణలో జరిగిన ఈ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించింది. రాష్ట్రా స్థాయిలో శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్లు 104 సంచార వైద్య వాహనాల డేటా ఎంట్రీ ఆపరేటర్లకు జిల్లాల్లో శిక్షణ ఇస్తారని సి-డాక్ సీనియర్ ప్రాజెక్టు ఇంజనీర్ పసుపులేటి అశ్విని నేడొక ప్రకటనలో తెలిపారు. 104 సంచార వైద్య వాహనాల విభాగంలో పనిచేసే జిల్లా, రీజినల్ మేనేజర్లు, ఆపరేషన్స్ ఆగ్జిక్యూటివ్‌లకు శిక్షణ ఇచ్చామని ఆమె తెలిపారు. ఆన్‌లైన్‌లో స్టాకు వివరాలు అందుబాటులో ఉండడం వల్ల మందులు సర్జికల్స్ ఎప్పటికప్పుడు చెక్ చేసుకునేందుకు వీలుంటుందని పేర్కొన్నారు.

# వరల్డ్ కప్ హీరో ఐపిఎల్ జీరో




సూపర్-8లో వెస్టిండీస్‌పై 97 రన్స్

సెమీస్‌లో ఇంగ్లాండ్‌పై 89 రన్స్

ఫైనల్లో న్యూజిలాండ్‌పై 89 రన్స్

రాజస్థాన్ రాయల్స్‌పై 6 రన్స్

పంజాబ్ కింగ్స్‌పై 7 రన్స్

రాయల్ ఛాలెంజర్స్‌పై 9 రన్స్

**ఐపీఎల్‌కు ముందు సీఎస్‌కేది హాట్ ఫేవరేట్ హోదా. సంజూ శామ్సన్‌ది టీ20 ప్రపంచకప్ హీరో ఇమేజ్. నాకౌట్ మొదలు సెమీఫైనల్, ఫైనల్లో ధూంధాం ఇన్నింగ్స్‌తో సంజూ ఒంటిచేత్తో టీమిండియాకు ప్రపంచకప్ అందించాడు. అభిషేక్ వైఫల్యం ఈ కేరళ ఓపెనర్‌కు కలిసివచ్చింది. మూడే మూడు ఇన్నింగ్స్‌లతో హీరోగా మారిపోయాడు. ఇపుడు ఆ మూడే మూడు ఇన్నింగ్స్‌లతో జీరోగా మారాడు. సంజూ శామ్సన్ జట్టులో ఉండడంతో సీఎస్‌కే ఫ్యాన్స్ అయితే తమ జట్టు ఆరో ఐపీఎల్ ట్రోఫీ గెలిచేస్తోంది అన్నంతగా హల్‌చల్ చేశారు. తీరా ఐపీఎల్ మొదలయ్యాక సీన్ రివర్స్ అయింది. సీఎస్‌కేకు సంజూ అదృష్టమనుకుంటే భారంగా మారాడు. వరుస వైఫల్యాలతో జీరో అవుతున్నాడు.**

(వార్త క్రీడా విభాగం)

9, 7, 6.. ఇవి ప్లేయర్స్ జెర్సీ నెంబర్లు అనుకుంటే పొరపాటే. వరల్డ్ కప్ హీరో... ఐపీఎల్‌లో చేసిన స్కోర్లు. మూడు మ్యాచ్‌ల్లో 22 పరుగులు మాత్రమే. ఆడిన మూడు ఇన్నింగ్స్‌ల్లోనూ సింగిల్ డిజిట్ దాటలేకపోయాడు. సీఎస్‌కే తరపున వరుసగా విఫలమవుతూ ఆ జట్టు అభిమానులను తీవ్రంగా నిరాశపరుస్తున్నాడు. తన పాత బలహీనతలతో వికెట్లు పారేసుకుంటూ విమర్శల పాలవుతున్నాడు. సంజూ శామ్సన్ వైఫల్యం సీఎస్‌కే విజయావకాశాలను దారుణంగా దెబ్బతీస్తున్నాయి. మూడు మ్యాచ్‌లాడినా ఇప్పటికీ గెలుప బోణీ కొట్టలేకపోయింది. ఐపీఎల్‌కు ముందు హాట్ ఫేవరేట్ హోదా కాస్తా ఇపుడు కనీసం లీగ్ స్టేజ్ అయినా దాటుతుందా అన్న డౌట్స్ అభిమానుల్లో ఆందోళన రేపుతోంది.

**అపుడు ధనాధన్ ఇనింగ్స్**

సొంతగడ్డపై జరిగిన టీ20ప్రపంచకప్‌లో సంజూ ఎంట్రీనే అదృష్టం. డాషింగ్ ఓపెనర్ అభిషేక్ శర్మ వరుస వైఫల్యాలు సంజూకు తుది జట్టులో చోటుకు కలిసొచ్చింది. ఆకాశమే హద్దుగా చెలరేగాడు. గెలిస్తేనే నిలిచే సూపర్8 మ్యాచ్‌లో విండీస్‌పై అజేయంగా 97 రన్స్ సాధించి... టీమిండియాను సెమీస్‌కు చేర్చాడు. ఇక సెమీస్‌లో ఇంగ్లాండ్‌పై 89 రన్స్, ఫైనల్లో న్యూజిలాండ్‌పై మరో89రన్స్‌తో టీమిండియాకు కప్ అందించడంలో కీలక భూమిక పోషించాడు. ఏకంగా ప్లేయర్ ఆఫ్ ది టోర్నీగా నిలిచాడు.

**ఇపుడు తుస్‌తుస్**

రాజస్థాన్ రాయల్స్ నుండి చెన్నై సూపర్ కింగ్స్‌కు మారిన తర్వాత...కొత్త టీమ్‌కు సంజూ మ్యాజిక్ చేస్తాడని అభిమానులు ఆశించారు. సంజూపై భారీ అంచనాలు పెట్టుకున్నారు. చెపాక్ స్టేడియంలో సంజూ..సంజూ అంటూ హోరెత్తించాడు. కానీ, ఐపీఎల్ మొదలైన పది రోజుల్లోనే సీన్ రివర్స్ అయింది. సీఎస్‌కే తరపున ఆడిన మొదటి మూడుఇన్నింగ్స్‌ల్లో సంజూ వరుసగా 6, 7, 9పరుగులు మాత్రమే చేశాడు. అంటే మూడు మ్యాచ్‌ల్లో కలిపి 22 పరుగులు. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్‌తో కలిసి పవర్ ప్లేలో సంజూ మెరుపులు మెరిపిస్తాడనుకుంటే, అనవసరమైన షాట్లకు ప్రయత్నిస్తూ వికెట్ పారేసుకుంటున్నాడు. కేవలం బ్యాటింగ్‌లోనే కాదు, వికెట్ కీపింగ్‌లో కూడా సంజూ తడబడుతున్నాడు. ధోనీ గైర్హాజరీలో కీపింగ్ బాధ్యతలు చేపట్టిన శాంసన్ వికెట్ల వెనకా ఇబ్బంది పడుతున్నాడు. తన సహజ సిద్ధమైన ఆటను మరిచిపోయి, అంచనాల భారంతో సతమతమవుతున్నట్లు స్పష్టమవుతోంది.

**సంజూపై అదే నమ్మకం**

సంజూ శామ్సన్ ఫామ్ కోల్పోయినప్పటికీ, సీఎస్‌కే మేనేజ్మెంట్ మాత్రం అతడికి పూర్తి మద్దతుగా నిలుస్తోంది. కొత్త టీమ్‌లోకి వచ్చినపుడు ఇలాంటి ఇబ్బందులు సహజం అంటూ కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్... సంజూ శామ్సన్‌ను వెనకేసుకొస్తున్నాడు. సంజూ సీఎస్‌కే జట్టులో బాగా కలిసిపోయాడని, పరుగులు చేయాలనే కసి అతడిలో ఉందని, త్వరలోనే మళ్ళీ ఫామ్ లోకి వస్తాడని ధీమా వ్యక్తం చేశారు. కోచ్ ఫ్లెమింగ్ నమ్మకాన్ని నిలబెట్టేలా రాబోయే మ్యాచ్‌ల్లో సంజూ శామ్సన్ ఆటతీరు గాడిన పడితే సీఎస్‌కే కష్టాలు తీరుతాయి.

## ఫైనల్లో 8మంది భారత్ బాక్సర్లు



**ఉలన్‌బతర్:** మంగోలియాలో జరుగుతున్న ఆసియా బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్లు జోరు కొనసాగుతోంది. ఏకంగా ఎనిమిది మంది భారత బాక్సర్లు ఫైనల్లో ప్రవేశించారు. మహిళల విభాగంలో ఆరుమంది, పురుషుల విభాగంలో ఇద్దరు పసిడి పతకం కోసం పోటీపడతారు. మహిళల 48కిలోల విభాగంలో మీనాక్షి 4-1తో థాయిలాండ్ ప్రత్యర్థి తిప్పచపై విజయంతో, 57 కిలోల విభాగంలో జాస్మిన్ 3-2పాయిట్ల తేడాతో నిగిన ఉత్కమోవా(ఉజ్బెకిస్థాన్)పై నెగ్గి ఫైనల్ చేరారు. పసిడి పతకం కోసం మీనాక్షి.. మంగోలియా బాక్సర్ అమ్గలాన్‌తో, జాస్మిన్.. థాయిలాండ్‌కు చెందిన పున్రవితో తలపడనుంది.

ఇక పరుషుల 50 కిలోల విభాగంలో విశ్వనాథ్ సురేష్ డామినేట్ చేశాడు. సెమీఫైనల్లో జోర్డాన్ బాక్సర్ హుథాయ్‌ఫాపై పిడిగుద్దులతో విరుచుకుపడి ఏకపక్షంగా ముగించాడు. 60కిలోల విభాగంలో సచిన్ 4-1 పాయింట్ల తేడాతో థాయిలాండ్ బాక్సర్ సక్దాపై నెగ్గి ఫైనల్ చేరాడు. ఇప్పటికే ఫైనల్ చేరిన ప్రీతి 54 కిలోల విభాగం ఫైనల్లో చైనీస్ తైఫీ బాక్సర్ హ్యాంగ్ వెన్‌తో... ప్రియ 60 కిలోల విభాగం ఫైనల్లో కొరియా బాక్సర్ యున్ యాంగ్‌తో... అరుందతి చౌదరి 70 కిలోల విభాగం ఫైనల్లో కజకిస్థాన్‌కు చెందిన సీదెష్‌తో తలపడనుంది. ఆసియా ఛాంపియన్‌షిప్‌లో ఏకంగా 8 మంది భారత బాక్సర్లు ఫైనల్ చేరడం ఇదే మొదటిసారి.



## భారత్ జట్టులో హృతిక్

**హైదరాబాద్:** ఆసియా ఓసియానియా జూనియర్ డేవిస్‌కప్ ఫైనల్ క్వాలిఫయింగ్ టోర్నీలో పాల్గొనే భారత టెన్నిస్ జట్టును ప్రకటించారు. ముగ్గురు సభ్యులతో కూడిన భారత జట్టులో హైదరాబాద్‌కు చెందిన 15 ఏళ్ల హృతిక్ కటకం చోటు సంపాదించాడు. న్యూఢిల్లీలో జరిగిన సెలెక్షన్ ట్రయల్స్‌లో హృతిక్ ఆడిన 4మ్యాచ్‌ల్లోనూ గెలుపొంది అగ్రస్థానంలో నిలిచాడు. జాతీయ బాలుర సింగిల్స్‌లో మూడో ర్యాంక్‌లో ఉన్న హృతిక్..ట్రినిటీస్ చాలెంజర్స్ అకాడమీలో కోచ్ హెన్రీ ప్రవీణ్ వద్దశిక్షణ తీసుకుంటున్నాడు.

## ఢిల్లీ జోరుకు గుజరాత్ బ్రేకులు వేసేనా?




**ఢిల్లీ:** ఐపీఎల్‌లో జోరుమీదున్న ఢిల్లీ క్యాపిటల్స్... సొంతగడ్డపై మరో మ్యాచ్‌కు సిద్ధమైంది. నేడు గుజరాత్ టైటాన్స్‌తో తలపడనుంది. అక్షర్ పటేల్ నేతృత్వంలోని ఢిల్లీ ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ గెలుపొందగా, గుజరాత్ రెండింటిలోనూ ఓటమితో ఉంది. ఢిల్లీ జట్టులో ఇఫాక్ట్ ప్లేయర్ సమీర్ రిజ్వీ సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. రిజ్వీ 47 బంతుల్లో 70 పరుగులు సాధించి తొలి మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌పై గెలుపందించాడు. ముంబై ఇండియన్స్‌తో జరిగిన రెండో మ్యాచ్‌లోనూ ఓ దశలో 7 పరుగులకే 2 వికెట్లు కోల్పోయిన ఢిల్లీని ఆదుకున్నాడు. 51 బంతుల్లో 90 పరుగులతో చెలరేగి విజయాన్ని ఖాయం చేశాడు. ట్రిస్టన్ స్టబ్స్ కూడా చక్కని ఫామ్‌లో ఉన్నాడు. రాహుల్, నిస్సాంక, నితీస్ పరుగుల ట్రాక్‌లో పడితే ఢిల్లీకి తిరుగుండదు. మ్యాచ్ ఫినిషర్ మిల్లర్, అక్షర్ పటేల్ అండ ఉంది. ఎన్గిడి, కుల్దీప్ యాదవ్ రూపంలో పేస్, స్పిన్ కాంబినేషన్ కలిగిఉంది.

ఇక శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని గుజరాత్ టైటాన్స్ అంచనా మేర రాణించలేకపోతోంది. సొంత గడ్డ అహ్మదాబాద్‌లోనూ ఓటమే ఎదురైంది. శుభ్‌మన్ గిల్ జట్టులోకి తిరిగిరావడంతో గుజరాత్ బ్యాటింగ్ పటిష్టమైంది. సాయి సుదర్శన్ హాఫ్ సెంచరీతో జోరు మీదికొచ్చాడు. బోస్ బట్లర్, గ్లేన్ ఫిలిప్స్, రాహుల్ తెవాటియా, వాషింగ్టన్ సుందర్ బ్యాటింగ్‌లో రాణించాల్సి ఉంది. చక్కని ఓపెనింగ్ భాగస్వామాలు లభిస్తున్నా, మిడిల్ ఆర్డర్ వైఫల్యం గుజరాత్‌ను వెంటాడుతోంది. నితీష్ రాణా, విప్రాజ్ నిగమ్‌లకు మరో ఛాన్స్ ఇచ్చే అవకాశం ఉంది. మిడిల్ ఆర్డర్‌ను బలోపేతం చేయడానికి జేసన్ హోల్డర్‌ను జట్టులోకి తీసుకురావడానికి మొగ్గు చూపవచ్చు. ఇక ప్రసిద్ధ్ కృష్ణ, రషీద్‌ఖాన్, సిరాజ్ రూపంలో చక్కని బౌలింగ్ స్ట్రెంత్ ఉంది.

**ఇరు జట్ల ఫైనల్ ఎలెవన్(అంచనా)**

**ఢిల్లీ క్యాపిటల్స్:** కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), పాతుమ్ నిస్సాంక, నితీష్ రాణా, సమీర్ రిజ్వీ, డేవిడ్ మిల్లర్, ట్రిస్టన్ స్టబ్స్, అక్షర్ పటేల్ (కెప్టెన్), విప్రజ్ నిగమ్, కుల్దీప్ యాదవ్, లుంగ్గి ఎంగిడి, నటరాజన్; ఇంఫాక్ట్ ప్లేయర్: ముకేష్ కుమార్; **గుజరాత్ టైటాన్స్:** శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), సాయి సుదర్శన్, జోస్ బట్లర్ (వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, గ్లెన్ ఫిలిప్స్, రాహుల్ తెవాటియా, రషీద్ ఖాన్, కగిసో రబడ, జాసన్ హోల్డర్, సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, ఇంఫాక్ట్ ప్లేయర్: అశోక్ శర్మ



## చెస్ వండర్ కిడ్ కొండా శ్రేయాన్ష్ రికార్డు

**హైదరాబాద్:** అత్యంత పిన్న వయస్సులోనే చదరంగంలో ప్రపంచ రికార్డు సాధించిన బాలుడిగా కొండా శ్రేయాన్ష్ మురళీ కృష్ణ పటేల్ నిలిచాడు. రెండు సంవత్సరాల 11 నెలల వయసులో ఈ ఘనత సాధించాడు. రాయ్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రెండు అసాధారణ రికార్డులను నెలకొల్పి వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌ల్లో కెక్కాడు.15 నిమిషాల 52 సెకండ్స్‌లలో 93 బ్యాక్ ర్యాంక్ చెక్ మేట్స్‌ను పరిష్కరించడంతో పాటు, 1 గంట 9 నిమిషాల 9 సెకండ్స్ లలో 21 చెస్ బోర్డ్‌లను అమర్చి రెండు ప్రపంచ రికార్డులను సాధించి చరిత్ర సృష్టించాడు. శ్రేయాన్ష్‌కు ట్రోఫీలు, సర్టిఫికెట్ లను మంత్రులు వాకిటి శ్రీహరి, కొండా సురేఖ ప్రదానం చేశారు. త్వరలో బ్రిటిష్ పార్లమెంట్లో సత్కారంతో పాటు సర్టిఫికెట్‌ను శ్రేయాన్ష్ పొందనున్నాడు.

## సెన్సెక్స్ నిఫ్టీలకు ఐటి, మెటల్ రంగాల మద్దతు

### లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబయి, ఏప్రిల్ 7:** ఐటి, మెటల్‌రంగాల్లో స్టాక్స్‌లో కొనుగోళ్ల ర్యాలీ తీయడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాల్లోనే ముగిసాయి. నిఫ్టీ 50 కాంట్రాక్టులు కాలపరిమిత ఇముగియడం కూడా కొంతమేర అనిశ్చితిని కొన్ని రంగాలను తాకింది. అలాగే పశ్చిమాసియా ఉద్రిక్తతలు కూడా ఎంపికచేసిన రంగాలపై ఎఫెక్ట్ చూపించాయి. అమెరికా ఇరాన్‌లు ఒక డీల్‌కు రావచ్చన్న ప్రచారంతో మార్కెట్లు కొంతవరకూ ర్యాలీ తీసాయనే చెప్పాలి. బిఎస్‌ఇ సెన్సెక్స్ 509.73 పాయింట్లుపెరిగి 74,616.58 పాయింట్లవద్దకు చేరింది. నిఫ్టీ 50 సూచీ కూడా 155.40 పాయింట్లుపెరిగి 23,123.65 పాయింట్లుపెరిగింద.

వరుసగా నాలుగు సెషన్లలోసెన్సెక్స్ 3.70శాతం, నిఫ్టీ 3.54 శాతం పెరిగాయి. ఇన్ఫోసిస్ 2.59, భారతి ఎయిర్‌టెల్ 2.13, ఐసిఐసి బ్యాంకు 1.39శాతం చొప్పున పెరిగాయి. బిఎస్‌ఇ 150 మిడ్‌క్యాప్ సూచీ 0.03శాతం, 250 స్మాల్‌క్యాప్ సూచీ 0.16 శాతం పెరిగాయి. మార్కెట్లలో బిఎస్‌ఇలో 2671 షేర్లుపెరిగితే 1555 షేర్లు క్షీణించాయి. మొత్తంగా 18 కంపెనీలషేర్లు యధాతథంగా కొనసాగాయి. ఇక విదేశ ఈకరెన్సీ మార్పిడి మార్కెట్‌లో



డాలరుతోరూపాయి మారకం విలువలు 93 వద్ద కొనసాగింది. ముందురోజు 92.90 నుంచి కొంతమేర బలపడిందనే చెప్పాలి.

ఎంసిఎక్స్‌లో గోల్డ్‌ఫ్యూచర్స్ జూన్ ఐదునాటి ధరలు రూ.1,50,390గా మారాయి. అమెరికా పదేళ్ల బాండ్ల రాబడులు కూడా 0.16శాతం క్షీణించి 4.327గానే కొనసాగింది. కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్‌ముడిచమురు జూన్ సెటిల్‌మెంట్లకు సంబంధించి 89 సెంట్లు క్షీణించి 108.88 డాలర్లుగా కొనసాగింది. నిఫ్టీలో ఐటిసూచీ 2.50శాతంపెరిగింది. ఎంఫసిస్ 4.21, విప్రో 3.71, ఎల్‌అండ్‌టి మైండ్‌ట్రీ 3.42, టిసిఎస్ 2.81, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ 2.65, ఇన్ఫోసిస్ 2.59, ఒరాకిల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ 2.55శాతం, టెక్ మహీంద్ర 1.66శాతం, పెర్సిస్టెంట్ సిస్టమ్స్ 1.24శాతం, కాఫోర్జ్1.05శాతం చొప్పున పెరిగాయి. జూబిలియంట్ ఫుడ్ వర్క్స్ 10.54శాతం క్షీణించింది. డైనాకాన్స్ సిస్టమ్స్ అండ్‌సొల్యూషన్స్ 3.81శాంపెరిగింది. టిటాఘర్ రైల్ సిస్టమ్స్ 8.84శాతం, గోద్రెజ్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ 2.58శాతం, క్రెడిట్ యాక్సెస్4.92శాతం చొప్పున పెరిగాయి. శ్యామ్ మెటాలిక్స్ అండ్ ఎనర్జీ 3.58శాతం, లోధా డెవలపర్స్ 0.89శాతం చొప్పున పెరిగాయి. ఇక కల్యాణ్ జ్యూయెలర్స్1.46శాతం క్షీణించింది. అలెంబిక్ ఫార్మా 5.22, ఐఆర్ ఎఫ్‌సి 0.18, ఫినో పేమెంట్స్ బ్యాంకు 2.10శాతం, ఆర్టెక్ సోలోనిక్స్ 7.32శాతం చొప్పున పెరిగాయి.

## ఐపిఒకు వచ్చే కంపెనీలకు సెబీ సడలింపులు

### ఐపిఒకి 144 కంపెనీలు 1.75 లక్షల కోట్ల సమీకరణ



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 7**

ఐపిఒలకు వస్తునన కంపెనీలకు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ కొన్ని అప్‌డేట్లు విడుదలచేసింది. మార్కెట్లలో ఇన్వెస్టర్ల భాగస్వామ్యం పెంచేందుకు ఇప్పటికే కొన్ని సవరణలు తెచ్చిన సెబీ పారదర్శకతను మరింత పెంపొందింపచేసేందుకుగాను కనీస పబ్లిక్ షేర్ హోల్డింగ్‌పైనా, ఐపిఒ నిబంధనలపైనా సడలింపులు ఇచ్చింది.

ప్రస్తుత నిబంధనలప్రకారం ఐపిఒకు వస్తున్న కంపెనీలకు వచ్చిన పరిశీలన లేఖలు గడువు 12 నెలలు మాత్రమే. ఆ గడువు పూర్తి కాగానే కంపెనీలు మళ్లీ ముసాయిదాలు సమర్పించాల్సి ఉంటుంది. రహస్య ఐపిఒకు దాఖలు చేసిన సందర్భాల్లో ఐపిఒ ప్రారంభానికి కంపెనీలకు 18నెలల గడువు ఇచ్చింది.

భౌగోళిక ఉద్రిక్తతలు, మార్కెట్లలో అనిశ్చితి, ఇన్వెస్టర్ల భాగస్వామ్యం తగ్గడం వంటి పరిస్థితులతో సెబీ ఒకసారి సడలింపులు ఇస్తున్నట్లు సెబీ ప్రకటించింది. పరిశీలన లేఖలు గడువు సెప్టెంబరు వరకూ పొడిగించినట్లు సర్క్యులర్‌లో వెల్లడించింది. మార్కెట్లలో తీవ్రస్థాయి అనిశ్చిత పరిస్థితులు ఎదురైనప్పటికీ 2026లో ఇప్పటివరకూ 1.78 లక్షలకోట్లు ఐపిఒలద్వారా వచ్చింది. మొత్తం 112 మెయిన్‌బోర్డు ఐపిఒలు గత ఏడాది 78 కంపెనీలు సేకరించిన 1.62 లక్షలకోట్లను అధిగమించి ఎక్కువ నిధులు సేకరగించగలిగినట్లు ప్రైమ్‌డేటాబేస్ గణాంకాలు చెపుతున్నాయి.

ప్రస్తుతం 144 కంపెనీలు రూ.1.75 లక్షలకోట్లు సమీకరించేందుకు సెబీ ఆమోదం పొందాయి. మార్కెట్లలో లాంచ్ అయ్యేందుకు వేచి ఉన్నాయి. మరో 63 కంపెనీలు రూ.1.37 లక్షలకోట్లు సమీకరించేందుకు సెబీ క్లియరెన్స్‌కోసం వేచి ఉన్నాయి. 22 కోట్లతో 18 కంపెనీలు దాఖలుచేసి ఆమోదం పొందినా మురిగిపోయాయి. అలాగే మరో 15కంపెనీలు 9200కోట్లు సమీకరించాలని దరఖాస్తుచేసి ఆతర్వాత విత్‌డ్రా చేసుకున్నాయి.

## డాలర్ వర్సెస్ రూపాయి 93.05



**ముంబయి, ఏప్రిల్ 7:** డాలరుతో రూపాయి విలువలు రోజురోజుకూ మారుతున్నాయి. పశ్చిమాసియా యుద్ధప్రభావం వల్లో ఏమో కానీ చమురు ధరలు పెరగడం డాలర్ చెల్లింపులు పెరగడంతో డాలర్‌కు ఎక్కడలేని డిమాండ్ వచ్చింది. దీనితో భారత్‌రూపాయి కనిష్టంగా పడిపోతోంది. యుద్ధ విరమణ ప్రతిపాదనలు మళ్లీ తెరపైకి రావడంతో రూపాయి క్రమేపీ బలపడుతోంది. ముందురోజు 33 పైసలు బలపడిన రూపాయి మంగళవారం మళ్లీ 17 పైసలు క్షీణించింది. ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజి మార్కెట్‌లో రూపాయి 93.05 వద్ద ప్రారంభం అయి ట్రేడింగ్‌ముగిసేనాటికి 93.07 వద్ద స్థిరపడింది. ముందురోజుకంటే 17 పైలు క్షీణించింది. ఇంట్రాడేలో 92.86వరకూ వెళ్లిన రూపాయి తదనంతరం క్షీణిస్తూ వచ్చింది. రిజర్వుబ్యాంకు తన మూడురోజులపాటు నిర్వహించేఎంపిసి సమీక్షలో మారకం విలువలు కూడా తెరపైకి వచ్చినట్లు సమాచారం.

ఆరుగురుసభ్యుల ఎంపిసి కమిటీ బుధవారం తన సమీక్ష నిర్ణయాలను వెల్లడించనున్నది. ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఈ వివరాలు వెల్లడిస్తారు. బ్రెంట్ ముడిచమురు 1.97శాతం క్షీణించి బ్యారెల్‌కు 107.61వద్ద ట్రేడ్ అయింది. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.8167.17 కోట్లు మార్కెట్ల నుంచి విత్‌డ్రాచేసుకున్నారు. ఈపరిణామాలన్నీ కరెన్సీ మార్పిడి మార్కెట్‌పై ప్రభావం చూపించాయి.

## 633 మిలియన్లకు క్యూఆర్ కోడ్ చెల్లింపులు




**ముంబయి, ఏప్రిల్ 7:** యుపిఐ క్యూఆర్ కోడ్‌లద్వారా జరిగే చెల్లింపులు 2025సంవత్సరంలో 15శాతం పెరిగాయి. గత ఏడాది 633.44 మిలియన్లుగా ఉన్న క్యూఆర్ లావాదేవీల ఈ ఏడాది 731.38 మిలియన్లకు పెరిగినట్లు వరల్డ్‌లైన్ నివేదిక వెల్లడించింది. యునిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ క్విక్ రెస్పాన్స్ కోడ్‌ల ద్వారా చెల్లింపులు శరవేగంగా జరుగుతున్నట్లు తేలింది. లావాదేవీలు కూడా 33శాతంపెరిగాయి. 172.2 బిలియన్ లావాదేవీలనుంచి 228.5 బిలియన్ లావాదేవీలకు పెరిగాయి. పాయింట్ ఆఫ్ సేల్ టెర్మినళ్ల లావాదేవీలు కూడా 15శాతంపెరిగి 11.48 మిలియన్లకు పెరిగినట్లు తేలింది. 2025లో గణనీయంగా క్యూఆర్, పిఒఎస్ లావాదేవీలు అత్యధికంగా ఉన్నాయి. సగటు చెల్లింఉలు యుపిఐ క్యూఆర్ కోడ్ సాయంతో రూ.1314గా ఉంది.

అంతకుముందు ఏడాది 1437గా ఉంది. క్రెడిట్‌కార్డులు, డెబిట్‌కార్డులతో సగటు చెల్లింపులు రూ.4150గాను, రూ.3360గాను ఉన్నట్లు అంచనా. డిజిటల్ చెల్లింపులకు అత్యధిక ప్రాధాన్యతను కూడా ఇపుడు ఇస్తున్నాయి. బ్యాంకులు, వ్యాపార సంస్థలు, ఎక్కడ అయినా సరే తినుబండారాల స్టాల్స్‌నుంచి అన్నీ కూడా క్యూఆర్ కోడ్‌లే ఏర్పాటు చేసుకుంటున్నాయి. దీనివల్ల ఇపుడు ప్రపంచ వ్యాప్తంగా కూడా క్యూఆర్ చెల్లింపులు పెరుగుతున్నట్లు వరల్డ్‌లైన్ సర్వేలో తేలింది.

## జెప్టో ఐపిఒకు సెబీ గ్రీన్‌సిగ్నల్




**ముంబయి, ఏప్రిల్ 7:** క్విక్‌కామర్స్ స్టార్టప్ జెప్టో ఐపిఒకు స్టాక్ ఎక్స్ఛేంజిల నియంత్రణ సంస్థ సెబీ సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది. సంస్థాగత ఇన్వెస్టర్లనుంచి కూడా సంసిద్ధత వ్యక్తం అయ్యేందుకువీలుగా కంపెనీ ప్రస్తుతం కసరత్తులు చేస్తోంది. ఐపిఒకు వచ్చేముందు సంస్థాగత అభిప్రాయసేకరణ జరిపి తుదికసరత్తులుచేస్తోంది. అందువల్లనే జెప్టో ఇన్వెస్టర్లతో చర్చలు జరుపుతోంది. కంపెనీ మార్కెట్ విలువలు, ఎంతమేర ఐపిఒకు రావాలి, ఒఎఫ్‌ఎస్‌కింద ఎంతమొత్తం సమీకరించాలి అన్న అంశాలపై తుది చర్చలు జరుపుతున్నట్లు అంచనా. ఐపిఒద్వారా మొత్తం 1.2 బిలియన్ డాలర్లు సమీకరించాలనినిర్ణయించారు. ఐపిఒకోసం ఇపప్టఇకే జెప్టో వాటాదారులనుంచి ఆమోదం పొందింది.

గత ఏడాది డిసెంబరు లోనిర్వహించిన సర్వప్రతినిధి సమావేశంలోనే జెప్టో ఐపిఒకు గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. కంపెనీ మోర్గాన్ స్టాన్లీ, యాక్సిస్ కేపిటల్, హెచ్‌ఎస్‌బిసి, గోల్డ్‌మాన్ శాక్స్, జెఎం ఫైనాన్షియల్, ఐఐఎఫ్‌ఎల్ సెక్యూరి టీస్, మోతీలాల్ ఓస్వాల్ సంస్థలను బ్యాంకర్లుగా నియమించుకుంది. జెప్టో తన కార్యకలాపాలన్నింటినీ సింగపూర్‌నుంచి భారత్‌కు జనవరిలోనే మార్చేసుకుంది.

## ఎయిరిండియా సిఇఒ క్యాంప్‌బెల్ రిజైన్




**ముంబయి, ఏప్రిల్ 7:** ఎయిరిండియా సిఇఒ కాంప్‌బెల్ విల్సన్ తన పదవినుంచి వైదొలిగారని, కొత్త సిఇఒ వచ్చేంతవరకు మాత్రమే ఆయన సిఇఒగా కొనసాగుతారన్న వార్తలు ఎయిర్‌లైన్స్‌రంగంలో సంచలనం కలిగించాయి. ఎయిర్‌లైన్స్ అనేక సవాళ్లను ఒకేసారి ఎదుర్కొనాల్సి రావడం, ఆర్థికంగా నష్టాలు, అనేక అంతరాయాలు, భౌగోళిక ఉద్రిక్తతలతో సర్వీసులు నడపలేకపోవడం వంటి అంశాలు సిఇఒ వైదొలగడానికి కారణం అయినట్లు సమాచారం. అత్యధికంగా ఆర్థిక సవాళ్లే కారణమని తెలుస్తోంది. ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ రెండు కలిపి సుమారు 98బిలియన్ రూపాయలు నష్టం చవిచూసాయని అంచనా. సర్వీసులను ఆధునీకరించడం, టాటా ఏవియేషన్ గ్రూప్‌లో విలీనంచేయడం వంటివి వ్యయాలను కొంతమేర క్రమబద్ధీకరించుకోవాల్సి వచ్చింది. ఎయిరిండియా ప్రస్తుతం 191 విమానాలు నడుపుతోంది. మరో 500విమానాలకు ఆర్డర్లు ఇచ్చింది. ఇటీవలే డిజిసిఎ స్క్రూటినీని కూడా ఎదుర్కొంది. అహ్మదాబాద్ ప్రమాదం తర్వాత ఎయిర్‌లైన్స్‌పై కస్టమర్లకు విశ్వాసం సన్నగిల్లుతోంది. దీనికితోడు పశ్చిమాసియా యుద్ధంతో ఎయిరిండియాతోపాటే ఇతర ఎయిర్‌లైన్స్‌కూడా భారీ నష్టాలు చవిచూసాయి. సుమారుగా 2500 కోట్ల రాబడులు నష్టపోయాయన్న అంచనా కూడా ఉంది. వాటిలో ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ సర్వీసులకే ఎక్కువ వాటా ఉంది.

యుద్ధం మరింతగా కొనసాగితే ఇరాన్, పాకిస్థాన్‌లపై గగనతలం మీదుగా వెళ్లేందుకు వీలు ఉండదు. దీనివల్లప్రయాణదూరం మరింతపెరిగి నిర్వహణ భారం మరింతపెరుగుతుంది. ఆసియా దేశాలకు ఇరాన్‌యుద్ధం కారణంగా 2500 విమానసర్వీసులు రద్దుచేయాల్సి వచ్చిందని సిఇఒ స్వయంగా సిబ్బందికి ఈమెయిల్స్ ఇచ్చారు. కేవలం 30శాతం మాత్రమే ఇపుడు సర్వీసులు నడుస్తున్నాయి. యూకె, యూరోప్; ఉత్తర అమెరికాలకు వెళ్లాలంటే సుదూర రూట్లను ఎంచుకోవాల్సి వస్తోంది. దీనివల్ల వ్యయం మరింత పెరుగుతోంది. ఈపరిణామాలన్నింటి దృష్ట్యా సిఇఒ ఎయిరిండియానుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

పశ్చిమగోదావరి, ఏలూరు
వార్త

# అంతా.. గ్యాసే..!



- రెండు రోజుల్లో డెలివరీ అని ప్రకటనలు
- అమలులో 15 రోజులకంటే పై మాటే
- గృహ వినియోగ సిలిండర్ వీధుల్లో ప్రత్యక్షం
- కొరవడిన తనిఖీలు

**ఏప్రిల్, 7 (పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో)** అమెరికా, ఇజ్రాయిల్, ఇరాన్ గల్ఫ్ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధం భారతదేశంలోని చమురు, గ్యాస్ నిల్వలపైన తీవ్ర ప్రభావం చూపిస్తుందని, రానున్న రోజుల్లో సామాన్యులకు ఇవి అందుబాటులో ఉండవని జరుగుతున్న ప్రచారాన్ని రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి ఉన్నతాధికారులు ఖండించారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వార్తలను నమ్మవద్దని సంబంధిత అధికారులు ప్రెస్ మీట్ లు పెట్టి కిందిస్థాయి అధికారుల ద్వారా ప్రచారం జరిగించారు. ఇందులో భాగంగా ప్రధానంగా గ్యాస్ సరఫరాపై వదంతులు నమ్మవద్దు అని వినియోగానికి సరిపడు గ్యాస్ నిల్వలు ఉన్నాయని బుక్ చేసుకున్న వినియోగదారునికి రెండు నుంచి మూడు రోజుల్లో గ్యాస్ సిలెండర్ అందజేయడం జరుగుతుందని పలుమార్లు భరోసానిస్తూ ప్రకటనలు జారీ చేశారు. అయితే వాస్తవం దీనికి విరుద్ధంగా ఉంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సుమారు 8 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉండగా వీటిలో 80 శాతం మందికి గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకున్న 15 రోజుల నుంచి నెలలోపు సిలిండర్ అందజేస్తున్నారు. ప్రధానంగా ఇండేన్ గ్యాస్ సంస్థ విధించిన షరతులతో వినియోగదారులు గ్యాస్ సిలిండర్ పొందడం కంటే అడవికి పోయి కట్టెలు తెచ్చుకోవడం సులభమని సెటైర్లు వేసుకుంటున్నారు. ఇండియన్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ కనీసం 15 రోజులు గరిష్టంగా 25 రోజుల్లో సిలిండర్ డెలివరీ ఇస్తున్నారు. వినియోగ దారుడు ప్రతి 25 రోజులకు ఒకసారి మాత్రమే గ్యాస్ బుక్ చేసుకోవడానికి అనుమతినిస్తున్నారు. అలాగే ఈకేవైసీ పూర్తికాని వారికి గ్యాస్ సిలిండర్ ఆపివేశారు. తణుకులో ఒక డిస్ట్రిబ్యూటర్ అందించిన వివరాల ప్రకారం తమ ఏజెన్సీ 15 రోజుల్లో సిలిండర్ అందిస్తున్నామని, రోజూ 5000 మందికి పైగా క్యూలో ఉంటున్నారని తెలిపారు. 80 శాతం మంది మాత్రమే ఈ కేవైసీ పూర్తిచేసుకున్నారని మిగతా 20 శాతం మంది అందుబాటులో లేరన్నారు. గ్యాస్ లభించదని వదంతులు నమ్మిన ప్రజలు అవసరం లేకున్నా సిలిండర్లు బుక్ చేసుకుంటున్నారని వివరించారు. ఆన్ టైం డెలివరీలో తమ ర్యాంకులు నెంబర్ వన్ స్థానం నుంచి అట్టడుగు స్థానానికి పడిపోయాయన్నారు. ఆర్డర్ పెట్టినప్పటికీ హెచ్.పీ గ్యాస్, భారత్ గ్యాస్ సంస్థలకు వచ్చినట్టు ఇండియన్ గ్యాస్ రావట్లేదని, వినియోగదారుల ఆగ్రహానికి గురవుతున్నామని ఆ డిస్ట్రిబ్యూటర్ ఆవేదన వ్యక్తం చేశారు. రోజూ అధికారులు తమ కార్యాలయాలు, బిల్లులు తనిఖీలు చేస్తున్నారని అయితే అవసరం లేకున్నా సిలిండర్లు బుక్ చేసి నల్ల బజారులో విక్రయిస్తున్న గృహ వినియోగదారులను అరికట్టలేకపోతున్నారని వాపోయారు. గతంలో సిలిండర్ మీద 300 వరకు సబ్సిడీ ఇచస్తామన్నా ముందుకు రాని కమర్షియల్ గ్యాస్ వినియోగదారులు ఇప్పుడు గ్యాస్ కోసం క్యూ కడుతున్నారన్నారు. ఇదిలా ఉండగా హోటల్, రెస్టారెంట్ యజమానులు పి ఎన్ జీ గ్యాస్ కనెక్షన్లకు దరఖాస్తు చేసుకోమని ప్రభుత్వ అధికారులు పిలుపునిస్తున్నప్పటికీ మన జిల్లాలో ఇప్పట్లో పిఎన్జి గ్యాస్ సరిపడు స్థాయిలో అందుబాటులోకి వచ్చే అవకాశాలు లేవంటున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలోని తాడేపల్లిగూడెం ప్రాంతంలో గోదావరి గ్యాస్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా పిఎన్జి గ్యాస్ సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ నాగరాణి గతంలోనే సూచించారు. అయితే కమర్షియల్ గ్యాస్ యజమానులు బ్లాక్ మార్కెట్లో గ్యాస్ సిలిండర్లు కొనడానికి మొగ్గు చూపుతున్నారు. డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ బ్లాక్ మార్కెట్లో 3000 రూపాయలకు అమ్ముడుపోతుందని సమాచారం. హోటళ్ళు, స్ట్రీట్ ఫుడ్ యజమానులు బహిరంగంగానే గృహ వినియోగ సిలిండర్లో వినియోగిస్తున్నారు. వీరిపై నిఘా లేకపోవడంతో యదేచ్ఛగా సిలిండర్లను బ్లాకులో కొని వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. గ్యాస్ కొరత నేపథ్యంలో తనిఖీలు నిర్వహించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించటంతో గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లు వీధుల్లో దర్శనమిస్తున్నాయని పలువురు బహిరంగనే వ్యాఖ్యానిస్తున్నారు.



## తాడేపల్లిగూడెంలో తొలి రబీ ధాన్యం
# కొనుగోలు కేంద్రం ప్రారంభం

### రైతులు దళారులను ఆశ్రయించవద్దు -- మద్దతు ధరలను పొందండి



**తాడేపల్లిగూడెం: ఏప్రిల్ 7 (ప్రభాతవార్త )** రైతులకు పూర్తి సహకారం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని శాసనసభ్యులు మరియు రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు తాడేపల్లిగూడెం రూరల్ మండలం అప్పారావుపేట గ్రామంలో కృషి అమృత భారత్ ఎఫ్‌పీసీ లిమిటెడ్ ఆధ్వర్యంలో రబీ సీజన్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ మరియు జిల్లా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో రైతులు తమ ధాన్యాన్ని ఎక్కడ అమ్మాలో, ఎప్పుడు చెల్లింపులు అందుతాయో తెలియని పరిస్థితులు ఉన్నాయని గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వం రైతులకు పారదర్శక విధానాలు తీసుకువచ్చి, ధాన్యం అమ్మిన 24 గంటల్లోనే చెల్లింపులు రైతుల ఖాతాల్లో జమ అయ్యేలా చర్యలు తీసుకుందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో పౌరసరఫరాల శాఖ సమర్థంగా పనిచేస్తోందని అన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి చేస్తున్న కృషిని అభినందించారు. ప్రభుత్వం రవాణా ఖర్చులకు కూడా సహాయం చేస్తోందని, ఇప్పటికే నియోజకవర్గానికి సుమారు రూ.5 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వ ద్వారా ధాన్యం అమ్మడం వల్ల క్వింటాల్‌కు రూ.100 నుంచి రూ.150 వరకు అదనపు లాభం పొందే అవకాశం ఉందని తెలిపారు. రైతులు ఎవరికి డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని, ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలని సూచించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రబీ సీజన్‌లో 7.75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. రైతుల వద్ద నుండి ప్రతి గింజను కొనుగోలు చేస్తామని చెప్పారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ మద్దతు ధరలు పొందాలని సూచించారు. కామన్ రకానికి క్వింటాల్‌కు రూ.2,369/- మరియు గ్రేడ్ 'ఏ'కు రూ.2,389/- మద్దతు ధరలు అందుతాయని వివరించారు. ధాన్యం చెల్లింపుల్లో 90 శాతం 24 గంటల్లో, 6--7 శాతం 48 గంటల్లో జమ అవుతున్నాయని, కొంతమంది రైతులు అవసరమైన ప్రక్రియలు పూర్తి చేయకపోవడం వల్ల ఆలస్యం జరుగుతోందని తెలిపారు. ట్రక్ షీట్లు సరిగ్గా జనరేట్ చేయడం వంటి అంశాల్లో రైతులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. రవాణా చార్జీలు ఈ నెలాఖరులోపు రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపారు. రైతులు, మిల్లర్లు పరస్పరం సహకరిస్తే సమస్యలు సులభంగా పరిష్కారమవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్. వెంకటేశ్వరరావు, తహసిల్దార్ రాజరాజేశ్వరి, బీజేపీ సమన్వయకర్త ఈతకోట తాతాజీ, కృషి అమృత భారత్ ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకుడు కొండపల్లి నగేష్ తదితరులు పాల్గొన్నారు!

## ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి బిల్లుకు ఆమోదం

### -- కేజీఆర్ఎల్ ఫార్మసీ కళాశాలలో ఆనందోత్సవాలు




**భీమవరం ఏప్రిల్ 7 ప్రభాతవార్త** కేజీఆర్ఎల్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో ఈరోజు ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి బిల్లుకు పార్లమెంట్ ఆమోదం లభించిన సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులు కలిసి ఆనందోత్సవాలు జరుపుకున్నారు. ఈ బిల్లు ఆమోదంతో అమరావతిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాశ్వత రాజధానిగా ప్రకటించడం రాష్ట్ర చరిత్రలో ఒక ముఖ్యమైన మైలురాయిగా భావిస్తున్నారు. ఇది రాష్ట్ర పరిపాలనలో స్థిరత్వాన్ని తీసుకురావడమే కాకుండా అభివృద్ధి, పెట్టుబడులు మరియు మౌలిక సదుపాయాల విస్తరణకు దోహదం చేస్తుందని కార్యక్రమంలో పాల్గొన్నవారు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో డైరెక్టర్ డా. కవల నాగేశ్వరరావు విద్యార్థులకు ఈ బిల్లుకు సంబంధించిన ముఖ్యాంశాలను వివరించారు. రాష్ట్ర అభివృద్ధిలో యువత పాత్ర ఎంతో ముఖ్యమని, వారు భవిష్యత్తులో బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని ప్రోత్సహించారు.మరియు అమరావతి బిల్లు అమలులో మహిళలు చేసిన కృషి విశేషమని, వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు ఈ చారిత్రాత్మక నిర్ణయాన్ని స్వాగతిస్తూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. కాలేజ్ యాజమాన్యం కూడా ఈ నిర్ణయాన్ని అభినందిస్తూ రాష్ట్ర అభివృద్ధికి ఇది కొత్త దిశ చూపుతుందని ఆశాభావం వ్యక్తం చేసింది. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో రాష్ట్రాభివృద్ధిపై అవగాహన పెంచడంలో కీలక పాత్ర పోషించింది. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డా. కవల నాగేశ్వరరావు , ప్రిన్సిపల్ డా.డి.రాఘవ, వైస్ ప్రిన్సిపాల్ డా.కె.నిర్మలా అధ్యాపకులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పరిశ్రమల అభివృద్ధికి ప్రభుత్వ ప్రోత్సాహం

- వ్యాపారవేత్తలు, యువత ముందుకు రావాలి
- జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి




**తాడేపల్లిగూడెం ఏప్రిల్ 7 ప్రభాతవార్త** జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఎంఎస్ఎంఈ ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్క్ పాలసీపై మంగళవారం తాడేపల్లిగూడెం నిట్ కాలేజీ ప్రాంగణంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామికవేత్తలు, భూస్వాములు, రైతులు, ప్రస్తుత పారిశ్రామికవేత్తలు, ఎంఎస్ఎంఈ రంగంలో ఆసక్తి ఉన్న వారితో ముఖాముఖి చర్చలు జరిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, స్థానిక శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎంఎస్ఎంఈ ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్క్ పాలసీ ముఖ్యాంశాలను అధికారులు వివరించారు. ప్రైవేట్ భూముల్లో ఇండస్ట్రియల్ పార్కుల స్థాపనకు ప్రోత్సాహకాలు, మౌలిక సదుపాయాల



అభివృద్ధికి ఆర్థిక సహాయం, విద్యుత్, నీరు, రహదారి వంటి సౌకర్యాల కల్పనలో ప్రభుత్వ మద్దతు, చిన్న మరియు సూక్ష్మ పరిశ్రమలకు ప్లాట్ల కేటాయింపు, ఉపాధి అవకాశాల సృష్టి, సబ్సిడీలు, అనుమతుల సులభీకరణ, సింగిల్ విండో క్లియరెన్స్ వంటి అంశాలను వివరించారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ తాడేపల్లిగూడెం ప్రాంతం చాలా సంవత్సరాలుగా వ్యాపార చైతన్యానికి కేంద్రంగా ఉందన్నారు. ఉల్లి, పండ్ల వ్యాపారం వంటి రంగాల్లో ఈ ప్రాంతం రాష్ట్రవ్యాప్తంగా ప్రముఖ స్థానంలో ఉందని పేర్కొన్నారు. అంతేకాకుండా, ఇతర రాష్ట్రాలు మరియు విదేశాల నుంచి కూడా వ్యాపార కార్యకలాపాలు ఇక్కడ జరుగుతున్నాయని వివరించారు. ప్రస్తుతం పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం అధికారులు విస్తృతంగా కృషి చేస్తున్నారని, పెద్ద స్థాయి పెట్టుబడులు రాష్ట్రానికి ఆకర్షించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా విశాఖపట్నం ప్రాంతంలో బిలియన్ డాలర్ల పెట్టుబడులు రాబోతున్నాయని తెలిపారు. ఈ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. పరిశ్రమలు స్థాపించడానికి ముందుగా మార్కెట్ పరిస్థితులు, ఉత్పత్తి నాణ్యత, డిమాండ్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. యువతకు అవకాశాలు కల్పించేందుకు స్థానిక శాసనసభ్యులు కృషి చేస్తున్నారన్నారు. అదేవిధంగా, స్థానికంగా క్రీడా మరియు విద్యా వసతుల అభివృద్ధి కోసం స్విమ్మింగ్ పూల్, ఇండోర్ స్టేడియం, జిల్లా పరిషత్ హైస్కూల్ అభివృద్ధి వంటి కార్యక్రమాలు ప్రత్యేక శ్రద్ధతో చేపట్టి పూర్తి చేయడం జరిగిందని అభినందించారు. జిల్లాలో భూమి ధరలు అధికంగా ఉండటం పరిశ్రమల స్థాపనకు ఒక సవాలుగా ఉన్నప్పటికీ, పరిశ్రమలు పెరిగితే ఈ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అభిప్రాయపడ్డారు. హార్టికల్చర్, ఫ్లవర్ రంగాల్లో కూడా మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. వ్యాపారవేత్తలు తమ అనుభవాన్ని యువతతో పంచుకోవాలన్నారు. తాడేపల్లిగూడెం శాసనసభ్యులు ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ తాడేపల్లిగూడెంలో ఉన్న వ్యాపారవేత్తలు, యువత, పరిశ్రమల ప్రతినిధులందరినీ ఒకే వేదికపైకి తీసుకురావడం ఈ సమావేశం లక్ష్యం అన్నారు. కొత్త పరిశ్రమలు స్థాపించడానికి ముందు మార్కెట్ పరిస్థితులు, ఉత్పత్తి నాణ్యత, డిమాండ్ వంటి అంశాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వ్యాపారవేత్తలు తమ అనుభవాన్ని తదుపరి తరం యువతకు పంచి, వారిని ప్రోత్సహించాలని కోరారు. పరిశ్రమల స్థాపనకు భూమి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. తక్కువ ధరలకు భూమిని అందించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం కల్పిస్తాం అన్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గాన్ని మరింత పారిశ్రామికంగా అభివృద్ధి చేయడం, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, పెట్టుబడులను ఆకర్షించడం ప్రధాన లక్ష్యంగా అధికారులు, ప్రజాప్రతినిధులు ముందుకు సాగుతున్నారన్నారు. పరిశ్రమల స్థాపనకు అవసరమైన భూమి, మౌలిక వసతులపై స్వయంగా నేనే ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు ప్రకటించారు. స్థానిక ఉత్పత్తుల తయారీకి ప్రోత్సాహం, వ్యాపారవేత్తలు మరియు యువతకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. వ్యాపారవేత్తలు సంపాదించిన నిధులను తిరిగి పెట్టుబడిగా మార్చి కొత్త పరిశ్రమలు స్థాపించాలని పిలుపునిచ్చారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ స్థానికంగా పరిశ్రమలను ప్రోత్సహించి, పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా ప్రాంతీయ ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేయాలన్నారు. తాడేపల్లిగూడెంలో పరిశ్రమల స్థాపనకు ఉన్న అవకాశాలను విపులంగా వివరించారు. ఈ సమావేశంలో తాడేపల్లిగూడెం ఇంచార్జ్ ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతి రావు, ఏపీఐఐసి జెడ్.ఎం అబ్దుల్ రహీం, డి ఆర్ డి ఏ పి.డి ఎంఎస్ఎస్ వేణుగోపాల్, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సామంతపూడి శ్రీరామరాజు, స్థానిక పారిశ్రామికవేత్తలు, ఔత్సాహిక వేత్తలు, రైతులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పాదయాత్ర విజయవంతం చెయ్యండి



**కుక్కునూరు, ఏప్రియల్ 08, (ప్రభాత వార్త)** మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలని కోరుతూ సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు కె.రామకృష్ణ చేపట్టే పాదయాత్రను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా ఉపాధ్యక్షులు కూరాకుల బాబురావు పిలునిచ్చారు. మంగళవారం స్థానిక సీపీఐ పార్టీ కార్యాలయంలో పాదయాత్ర పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయిన మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీన అనంతరంపురం నుంచి ప్రారంభమై 12వ తేదీ బండ్లపల్లి వరకు పూర్తయ్యే పాదయాత్రకు కార్మిక సంఘాలు అధిక సంఖ్యలో తరలివచ్చి కదం తొక్కాలని ఆయిన కోరారు. కొత్తగా ప్రవేశపెట్టిన జీ రామ్ జీ పేరును తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. ఒక్కొక కుటుంబానికి కచ్చితంగా 200 రోజుల పని దినాలు కల్పించి, రోజు కూలీ రూ. 800/-, ఇవ్వాలని కోరారు. కాగా పెండింగ్ లో ఉన్న ఉపాధి కూలీల డబ్బులను చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కుక్కునూరు మండల కార్యదర్శి కొన్నె లక్ష్మయ్య, సారంగి రాజేష్, పూరెమం వెంకట్, బల్లెం. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఎట్టకేలకు మార్కెటింగ్ చైర్మన్
# పదవి దక్కించుకున్న అరుణ

### చాట్రాయి మండలానికి ఇద్దరు డైరెక్టర్లు



**చాట్రాయి, ఏప్రిల్ 7, ప్రభాతవార్త** నూజివీడు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఎట్టకేలకు భారతీయ జనతా పార్టీకి చెందిన కుంపటి అరుణ దక్కించుకున్నారు. సుమారు ఏడాది క్రితమే కుంపటి అరుణ పేరును సాక్షాత్తు మంత్రి పార్థసారథి ఖరారు చేసినప్పటికీ ఇప్పటివరకు అధికారిక ఉత్తర్వులు రాలేదు. ప్రభుత్వం అధికారికంగా మంగళవారం జీవో విడుదల చేస్తూ ప్రకటించడం పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పేరు ఖరారులో జాప్యం పై ప్రభాతవార్త అనేక కథనాలు ప్రచురించడంతో ప్రభుత్వం స్పందించినట్లు పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఎప్పటినుండో చైర్మన్ పీఠం కోసం ఎదురుచూస్తున్న అరుణకు అవకాశం దక్కటం పట్ల పలువురు అభినందనలు తెలియజేస్తున్నారు. త్వరలోనే ప్రమాణస్వీకారం మహోత్సవ కార్యక్రమం జరుగుతుందని బిజెపి వర్గాలు తెలియజేస్తున్నాయి. అదేవిధంగా చాట్రాయి మండలానికి చెందిన ఇద్దరికీ డైరెక్టర్లుగా అవకాశం దక్కింది. మండలంలోని చిన్నంపేట గ్రామానికి చెందిన అత్తులూరి శ్రీనివాస్ డైరెక్టర్ గా ఎంపిక అయ్యారు. న్యాయవాద వృత్తిలో ఉన్న ఆయన చాట్రాయి మండల లీగల్ సెల్ అధ్యక్షులుగా కూడా పనిచేస్తున్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి ఆయన తండ్రి రామారావు వారసత్వాన్ని పునికి పుచ్చుకుని పని చేస్తున్నారు. పార్టీ కోసం అహర్నిశలు శ్రమించే శ్రీనివాసరావును మంత్రి పార్థసారథి గుర్తించి ఎంపిక చేయటంపై ఆయన ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అత్తులూరి ఎంపికపై మండలంలో పలువురు అభినందనలు తెలియజేశారు. మార్కెట్ కమిటీ అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని చెప్పారు. మండలంలోని చనుబండ శివారు సూరంపాలెం గ్రామానికి చెందిన దళిత నాయకురాలు నక్కా సీతారత్నంను రాష్ట్ర గృహ నిర్మాణ మరియు సమాచార శాఖ మాత్యులు కొలుసు పార్థసారధి నియమించారు. దళిత ఉద్యమంలో దళితుల కోసం దళిత హక్కుల కోసం పోరాడే నక్కా రాము కుటుంబానికి ప్రాధాన్యత ఇచ్చినందుకు మంత్రికి రుణపడి ఉంటామని నక్కా సీతారత్నం ఆమె కుమారుడు రాములు తెలియచేస్తున్నారు. అంతేకాకుండా చనుబండ పిఎసిఎస్ అధ్యక్షులు మోరంపూడి శ్రీనివాసరావు, చనుబండ గ్రామ పార్టీ అధ్యక్షులు చీదిరాల మారేశ్వర రావు, మాజీ ఎంపీపీ కందుల కృష్ణ, మాజీ ఎంపీటీసీ ములగలపాటి శ్రీనివాసరావు,మోరంపూడి రమేష్, బొంతు సతీష్, బొట్టు దుర్గారావు. దార్ల సురేష్ బాబు అభినందనలు తెలియజేశారు.

## నేడు మంత్రి అచ్చెన్నాయుడు మార్టేరు పర్యటన

**పెనుమంట్ర, ఏప్రిల్ 07, (ప్రభాతవార్త)** రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశుసంవర్ధక, పాడి పరిశ్రమ, మత్స్య పరిశ్రమల శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు రేపు ఏప్రిల్ 08వ తేదీ మార్టేరు రానున్నట్లు జిల్లా సమాచార శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఏప్రిల్ 8వ తేదీ ఉదయం 8.00 గంటలకు విజయవాడ నుండి బయలుదేరి 10:30 గంటలకు ఆచంట నియోజకవర్గం మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రానికి చేరుకుంటారు. అనంతరం "మారుతున్న వాతావరణ, వాణిజ్య పరిస్థితులు - సుస్థిర వరి వ్యవసాయం" అనే అంశంపై 'కిసాన్ మేళా'లో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 1:30 గంటలకు మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ నుండి బయలుదేరే విజయవాడ వెళతారని సమాచార శాఖ ఆ ప్రకటనలో తెలిపింది.

## కామవరపుకోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు 'ఎ' గ్రేడ్




**కామవరపుకోట, ఏప్రిల్ 7(ప్రభాత వార్త):** కామవరపుకోట ప్రభుత్వ డిగ్రీ కళాశాల అకడమిక్ ఆడిట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి 'ఎ' గ్రేడ్ సాధించినట్లు కళాశాల ఇన్ ఛార్జ్ ప్రిన్సిపాల్ ఎం. మల్లేశ్వరరావు మంగళవారం తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను కళాశాలలోని మౌలిక వసతులు, బోధనా పద్ధతులు మరియు అన్ని విభాగాల రికార్డులను రాష్ట్ర ఉన్నత విద్యామండలి నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించినట్లు ఆయన పేర్కొన్నారు.డాక్టర్ కొండా రవి, డాక్టర్ కె. నాగభూషణ్ రెడ్డిలు అకడమిక్ ఆడిటర్లుగా వ్యవహరించి, కళాశాల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేస్తూ ఈ గ్రేడ్ ఖరారు చేసినట్లు తెలిపారు. కళాశాల సాధించిన ఈ విజయం పట్ల అధ్యాపక, అధ్యాపకేతర బృందాన్ని ప్రిన్సిపాల్ అభినందించారు.

# మావి'గన్' తూటా ప్రజల్లోకి దూసుకెళ్లింది మాజీ మంత్రి కారుమూరి



**తణుకు, ఏప్రిల్ 7 ( ప్రభాత వార్త)** రాష్ట్ర రాజధాని విషయంలో మాజీ ముఖ్యమంత్రి చేసిన మావిగన్ తూటా ప్రజల్లోకి దూసుకెళ్లిందని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో మంగళవారం నిర్వహించిన సర్పంచ్‌ల సత్కార సభలో ఆయన మాట్లాడారు. లక్షలకోట్లు ఖర్చుచేసి అమరావతి ప్రాంతాన్ని అభివృద్ధి చేసే కంటే మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు 110 కిలోమీటర్ల ప్రాంతాన్ని మావిగన్ నామంతో అభివృద్ధి చేస్తే తక్కువ ఖర్చుతోనే ప్రజలకు మంచి రాజధానిగా నిలుస్తుందని జగన్ పేల్చిన గన్ సూపర్ హిట్ అయ్యిందన్నారు. ఆవిషయాన్ని డైవర్ట్ చేసే క్రమంలో ఏబీఎన్ చానల్‌లో మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేయించారని మండిపడ్డారు. ఏబీఎన్ రాధాకృష్ణ అసలు మనిషేనా అని మహిళలు సైతం విమర్శలు చేస్తున్నారని అన్నారు. నీ ఛానల్‌లో మహిళలను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు మంచివేనా అని మీ ఇంట్లో వారినే అడిగి చూడాలంటూ హితవుపలికారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరె శ్యామల మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండు గుర్రాల మాదిరిగా పాలన అందించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో సర్పంచ్‌లుగా ఉన్న వారంతా ఎంతో అదృష్టవంతులని అన్నారు. కానీ నేడు చంద్రబాబు సర్కారు ఏర్పడి రెండేళ్లు గడుస్తున్నప్పటికీ ప్రజలకు ఏమీ ఒరగలేదని సర్పంచ్‌లంతా ఎన్నో ఇబ్బందులు పడ్డారని స్పష్టం చేశారు. రైతుల ఇబ్బందులు వర్ణనాతీతమని, విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా తయారైందని విమర్శించారు. ఏబీఎన్ చానల్‌లో మహిళలను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు దారుణమని దీనిపై హైదరాబాద్ ఏబీఎన్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతుంటే ఎమ్మెల్యేలను సైతం గొంతునొక్కి ఈడ్చుకెళ్లిన తీరు బాధాకరమని అన్నారు. రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ దిగజారిపోయిందని మండిపడ్డారు. అధికారదర్పంతో చేస్తున్న దాడులు, దౌర్జన్యాలకు సంబంధించి జగన్ మీ తప్పులన్నిటినీ లెక్కిస్తున్నారని 2029 తరువాత జగన్ 2.0లో అన్ని లెక్కలు సరిచేస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు ముదునూరి మురళీకృష్ణంరాజు, పార్టీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబరు కొట్టు నాగు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలు సిద్ధం

**ఆగిరిపల్లి ఏప్రిల్ 7 ప్రభాతవార్త** ఆగిరిపల్లి మండలంలోని 23 రెవెన్యూ గ్రామాలను 2 క్లస్టర్ లుగా చేసి 2 ధాన్యం కొనుగోలు కేంద్రాలను చొప్పరమెట్ల, సూరవరం రైతు సేవ కేంద్రాల్లో ప్రారంభించడానికి అన్ని చర్యలు తీసుకున్నామని మండల వ్యవసాయ అధికారి జె భవాని తెలియజేశారు. సూరవరం కొనుగోలు కేంద్రమును డీసీఎంఎస్ , చొప్పరమెట్ల కొనుగోలు కేంద్రమును ఎఫ్ పి ఓ నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. ధాన్యమును ప్రమాణాలను అనుసరించి ధాన్యం కొనుగోలు కేంద్రములలో విక్రయించి ఏ గ్రేడ్ రకమునకు 75 కేజీ ల బస్తాకు రూ. 1791.75 లకు కామన్ గ్రేడ్ రకమునకు 75 కేజీ ల బస్తాకు రూ. 1776. 75 లకు ప్రభుత్వ మద్దతు ధర పొందవలసినదిగా తెలియచేసారు. దళారులకు ధాన్యమును విక్రయించకుండా ధాన్యము కొనుగోలు కేంద్రములలో విక్రయించి మద్దతు ధర పొందవలసినదిగాఆమె తెలియచేసారు. ఈ కార్యక్రమములో గ్రామ వ్యవసాయ సహాయకులు , గ్రామ రైతులు పాల్గొన్నారు.

## మాముదూరులో పశు వైద్య శిబిరం



**పెనుమంట్ర, ఏప్రిల్ 07, (ప్రభాతవార్త)** మండలంలోని మాముదూరు గ్రామంలో పెనుగొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ సౌజన్యంతో ఉచిత పశువైద్య శిబిరం మంగళవారం జరిగింది. సుమారు 320 పశువులకు పరీక్షలు నిర్వహించి మినరల్ మిక్చర్ ప్యాకెట్స్ మార్కెట్ కమిటీ చైర్మన్ బడేటి వీరబ్రహ్మం ( బ్రహ్మాజీ) ఆధ్వర్యంలో పంపిణీ చేయడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు మేలు కలిగే దిశగా అడుగులు వేస్తుందని అన్నారు. రైతులు మేలు కలిగే పుంత రోడ్లను వెయ్యడానికి ఆచంట శాసనసభ్యులు పితాని సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెనుగొండ ఏఎంసి డైరెక్టర్ చిటికెన తాతారావు, సానబోయిన ప్రకాష్, వైస్ చైర్మన్ బాబీ భాస్కర్, పెనుమంట్ర మండల టిడిపి అధ్యక్షులు వెలగల బుల్లి రామిరెడ్డి, గ్రామ అధ్యక్షులు కోసూరి సీతారామరాజు, సచివరం సొసైటీ అధ్యక్షులు రాము, ఏఎంసీ సూపర్వైజర్ డి నరసింహారావు, వెటర్నరీ ఏడి బి బాబు, పెనుమంట్ర వెటర్నరీ హాస్పిటల్ డా. రవికుమార్, ఏఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

## ద్వారకాతిరుమల జెడ్పీ హై స్కూల్‌లో సదుపాయాల కొరత -- విద్యార్థుల ఆవేదన




**ద్వారకాతిరుమల, ఏప్రిల్ 7 ( ప్రభాతవార్త ):** ద్వారకాతిరుమల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్‌లో ప్రాథమిక సదుపాయాల కొరత విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తోంది. ముఖ్యంగా పాఠశాలలో ఆర్వో ప్లాంట్ లేకపోవడంతో త్రాగునీటి కోసం విద్యార్థులు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారు. అలాగే పాఠశాల పరిసరాల్లో సరైన శుభ్రత లేకపోవడం కూడా ఆందోళన కలిగిస్తోంది. పరిశుభ్రమైన వాతావరణం లేకపోవడంతో విద్యార్థుల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశముందని తల్లిదండ్రులు భావిస్తున్నారు. ఇంకా, పాఠశాలలో సరిపడిన ఆట స్థలం లేకపోవడం వల్ల విద్యార్థులు శారీరక వ్యాయామం, క్రీడలలో పూర్తిగా పాల్గొనలేకపోతున్నారని విద్యార్థులే చెబుతున్నారు. దీంతో వారి మానసిక ఉత్సాహం తగ్గిపోతుందని అభిప్రాయపడుతున్నారు. ఈ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తే పాఠశాల అభివృద్ధి చెందడంతో పాటు మరింత మంది విద్యార్థులు చేరే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు. తక్షణమే ఆర్వో ప్లాంట్ ఏర్పాటు, పరిసరాల శుభ్రత, ఆట స్థలం అభివృద్ధిపై అధికారులు దృష్టి సారించాలని విద్యార్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## వైసీపీ యువ నాయకుడు మృతి



**చాట్రాయి, ఏప్రిల్ 7, ప్రభాతవార్త** మండల కేంద్రమైన చాట్రాయికి చెందిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు బుర్రి రమేష్ (36) గుండెపోటుతో మృతి చెందారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చురుకైన కార్యకర్తగా పనిచేయడంతో పాటు గతంలో జరిగిన సర్పంచ్ ఎన్నికలలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి ఓడిపోయారు.దేనితో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. బుర్రి రమేష్ మృతి చెందటం చాట్రాయి మండల అంబేద్కర్ వాదులకు తీరని లోటు అని నూజివీడు నియోజకవర్గం ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి నక్కా రాము అన్నారు. గ్రామంలో మంచి వ్యక్తిగా అందరికీ మంచి సలహాలు ఇస్తూ గ్రామ దళితులలో ఒక మంచి అనే భావాన్ని నాటిన వ్యక్తి ఈ విధంగా అకాల మరణం చెందడం చాట్రాయి ఎస్సీ కాలనీకి తీరని లోటు అని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బుర్రి శేఖర్,రాచప్రోలు విజయరాజు,దారా సుందర్రావు. గంధం రాజేష్. మొండ్రు ఆనంద్. మొండ్రు సురేష్ తదితర దళిత నాయకులు శ్రద్ధాంజలి ఘటించారు.

## కన్నుల విందుగా శ్రీ ఆనందేశ్వర స్వామి కళ్యాణం



**కైకలూరు,ఏప్రిల్ 7 (ప్రభాతవార్త)** కైకలూరు పట్టణంలోని ఏలూరు రోడ్డు కాలవ గట్టుపై ఉన్న శ్రీ సంతాన నాగేంద్ర స్వామి వారి ఆలయ ఆవరణలో వేంచేసి ఉన్న శ్రీ గంగా పార్వతీ సమేత ఆనందేశ్వర స్వామి వారికి శాంతి కళ్యాణం నిర్వహించారు.శ్రీ స్వామివారి పున ప్రతిష్ట ప్రథమ వార్షికోత్సవాలలో భాగంగా మంగళవారం ప్రత్యేక పూజలు శాంతి కల్యాణం ధర్మకర్త చావలి శంకర శాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహించారు. కోరుకొల్లు వాస్తవ్యులు చినిమిల్లి సత్యనారాయణ వెంకట మహంకాళ్ళమ్మ, ఈశ్వర్ నటరాజ్ కుమార్ గౌతమి దంపతులు వారి సహకారంతో ఈ స్వామి అమ్మవార్ల శాంతి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది.ముందుగా ఆలయంలోని శ్రీ ఆనందేశ్వర స్వామి వారికి పంచామృత పలరస,భస్మగంధ సుగంధ పరిమళ ద్రవ్యాలతో ఏకవార రుద్రాభిషేకం చేశారు.యాగ్నికులు పృథ్వి కుమార్ శర్మ యజ్ఞ తత్వంలో వేదమంత్రాల నడుమ జరిగిన కళ్యాణంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. కళ్యాణశీ అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

# మావి'గన్' లో బుల్లెట్లు మీకే దిగుతాయి..

## తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ధ్వజం తణుకులో సంబరాలు చేసుకున్న కూటమి శ్రేణులు



**తణుకు, ఏప్రిల్ 7 ( ప్రభాత వార్త)** చారిత్రాత్మకంగా అమరావతి శాశ్వత రాజధాని నిలిచిపోతుందని, వైసిపి నాయకులు మావిగన్ అని ఊరేగితే ఆ గన్ లోని బుల్లెట్లు మీకే దిగుతాయని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవతో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సహకారంతో పార్లమెంటులో బిల్లు ఆమోదం పొందడం అభినందనీయమన్నారు. మంగళవారం తణుకు కూటమి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే రాధాకృష్ణ మాట్లాడారు. ఏప్రిల్ 6, 2026 చారిత్రాత్మక దినంగా నిలిచిపోతుందని అన్నారు. అమరావతి శాశ్వత రాజధాని గెజిట్‌కు రాష్ట్రపతి ఆమోద ముద్ర పొందడం హర్షణీయమన్నారు. 2014 పునర్విభజన చట్టం సవరించి పార్లమెంటు ఆమోదంతో ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిగా గెజిట్ విడుదల చేయడం అభినందనీయన్నారు. ప్రజలు, అమరావతి రైతులకు న్యాయం చేసే విధంగా వారి త్యాగాలకు భద్రత కల్పించేవిధంగా చేయడం అన్ని వర్గాల నుంచి మద్దతు లభిస్తోందన్నారు. ఆనాడు శ్రీకృష్ణ కమిటీ నిర్ణయం మేరకు విజయవాడ గుంటూరు మధ్యలో అరావతి నిర్ణయం చేస్తే ఆనాడు ప్రతిపక్ష హోదాలో ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చారని గుర్తు చేశారు. 29 వేల మంది రైతులు 34 వేల ఎకరాలు రాజధానికి ఇస్తే వారి త్యాగాలను విస్మరించి అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు రాజధానులంటూ మూడు ముక్కలాట ఆడిన వ్యక్తి జగన్ అన్నారు. రైతులు, రాష్ట్ర ప్రజల త్యాగాలను తుంగల్లో తొక్కారన్నారు. మహిళ రైతులు పాదయాత్ర చేస్తే వారిని అడ్డుకున్నారని అన్నారు. రాజధానికి భూములు ఇచ్చి త్యాగాలు చేసిన రైతల పట్ల సానుభూతి లేకుండా రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిన దుర్మార్గుడు జగన్ అన్నారు. ఎక్కడ ముఖ్యమంత్రి కూర్చుంటే అక్కడే ర్యాజధాని అని, విశాఖ రాజధాని అని, మూడు రాజధానిలు అంటూ అన్ని విధాలుగా రాష్ట్రాన్ని ్యఅదోగతి పాల్జేశారన్నారు. పార్లమెంటులో కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దాదాపు 50 పార్టీలు ఉంటే 49 పార్టీలు భేషరతుగా మద్దతు తెలియజేశాయన్నారు. అయితే ఒకే ఒక్క వైసీపీ మాత్రం వ్యతిరేకించడం చారిత్రాత్మ తప్పిందం అన్నారు. ఈ విషయంలో జగన్ పిచ్చి తుగ్లగ్ గా వ్యవహరించారని విమర్శించారు. ఏబీఎన్ కేంద్ర కార్యాలయంపై వైసీపీ శ్రేణులు చేసిన దాడులను ఖండించారు. హైదరాబాదు వెళ్లి దాడులు చేస్తున్నారంటే వారి అరాచాలకు పరాకాష్ట అన్నారు. మీడియా ప్రశ్నిస్తే దాడులు చేస్తారా అని ప్రశ్నించారు. సాక్షి పత్రిక అడ్డగోలుగా రాయొచ్చు మిగిలినవాళ్లు రాస్తే దాడులు చేస్తారా అని ధ్వజమత్తారు. మావిగన్ అంటూ లేని పోని మాటలు మాట్లాతున్న జగన్‌కు అవే బుల్లెట్లు రాబోయే ఎన్నికల్లో దిగుతాయని మండిపడ్డారు. విచక్షణ కోల్పోయి మానసని స్థితి బాగోక మాట్లాడుతున్నారని అన్నారు. మావిగన్ అంటూ పిచ్చి ప్రయోగాలు చేస్తున్నారని విమర్శించారు. విచక్షణతో రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేయాలని ఎమ్మెల్యే రాధాకృష్ణ హితవు పలికారు. అనంతరం కేకు కట్ చేసి సంబరాలు చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతు - శాస్త్రవేత్తల చర్చా సమావేశం



**తాడేపల్లిగూడెం, ఏప్రిల్ 7 (ప్రభాత వార్త)** డా. వై.ఎస్.ఆర్. ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని వెంకటరామన్నగూడెం కృషి విజ్ఞాన కేంద్రంలో "తోటపంటలపై రైతు--శాస్త్రవేత్తల చర్చా సమావేశం నిర్వహించబడింది.ఈ కార్యక్రమాన్ని ఉద్యాన విశ్వవిద్యాలయం విస్తరణ విభాగం మరియు ఐసీఏఆర్--అటారి హైదరాబాద్ సంయుక్తంగా నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డా. వైయస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డా. కె. ధనుంజయరావు గారు ముఖ్య అతిథిగా విచ్చేసి, ప్రారంభోపన్యాసం చేస్తూ, కోకో, జీడి మామిడి, మామిడి, కొబ్బరి, ఆయిల్ ఫామ్ పంటలు సాగు చేస్తున్న రైతులు, అంతర్ పంటలపై దృష్టి పెట్టి అధిక ఆదాయం సంపాదించాలని, రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు ఉద్యాన రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నందున ఆయా అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులను సూచించారు. ఈ సందర్భంగా రైతులు అడిగిన అనేక సందేహాలకు ఉపకులపతి జవాబులు ఇచ్చారు. గత వారంలో న్యూఢిల్లీ , కృషి భవన్ లో కోకో – జీడి పంటల సాగు, ఎగుమతుల పై జరిగిన సమావేశం వివరాలు రైతులకు తెలియజేసి, అంతర్జాతీయ స్థాయిలో ఉద్యాన పంటలకున్న మార్కెట్ అవకాశాల గురించి , మన ప్రభుత్వ ప్రోత్సాహాల గురించి తెలియజేశారు. కోకో, ఆయిల్ పామ్ రైతుల కోసం యాజమాన్య పద్ధతులు, సాగులో మెళుకువలపై వెంకట్రామన్న గూడెం, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు తెలుగులో రూపొందించిన కరపత్రాలను ఉపకులపతి ఆవిష్కరించినారు. డా.~= ఉద్యాన విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు డా. జి. రామానందం గారు మరియు విస్తరణ సంచాలకులు డా. జప్త. రూత్ గారు , ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. కొవ్వూరు పరిశోధన కేంద్రం అధిపతి మరియు~ాణ= డా. డి. వెంకట స్వామి గారు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్స్ శ్రీ దుర్గేష్ ( తూర్పుగోదావరి) , శ్రీ ప్రసాద్ (కోనసీమ) గార్లు పాల్గొన్నారు. తదనంతరం జరిగిన సాంకేతిక సలహా సమావేశాల్లో ఆధునిక ఉత్పత్తి సాంకేతికతలు మరియు మెరుగైన రకాలునాణ్యమైన దిగుబడుల ప్రాధాన్యత ఆయిల్ పామ్ తోటల్లో అంతర పంటల సాగు (కోకో, కొబ్బరి మొదలైనవి) మల్టీ స్టోరీడ్ క్రాపింగ్ విధానాలు డ్రాగన్ ఫ్రూట్, బొప్పాయి పంటల్లో ఫ్రూట్ ఫ్లై నియంత్రణ ఆయిల్ పామ్‌లో కీటకాల సమస్యలు మరియు నివారణ చర్యలు కోకో పంటకు పెరుగుతున్న డిమాండ్ మరియు ప్రాముఖ్యత ను గురించి రైతులు శాస్త్రవేత్తలు తో చర్చించారు. పంట తెగుళ్ల నివారణ కొరకు డా. ఉద్యాన విశ్వవిద్యాలయం రూపొందించిన బయో ఏజెంట్స్, ద్రవ రూప బయో జీవ ఎరువులను సరఫరా చేయాలని రైతులు కోరారు. అంతేకాక రైతులు తమ సమస్యలను నేరుగా శాస్త్రవేత్తలతో పంచుకుని, ఆయా ప్రదేశానికి అనుగుణంగా సాంకేతిక సలహాలు పొందారు. ముఖ్యంగా ఆయిల్ పామ్ ం కోకో సమ్మిళిత సాగు ద్వారా అధిక లాభాలు సాధ్యమని నిపుణులు వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్తలు డా. టి. సుశీల, డా. పి. అశోక్, డా. ఎన్.బి.వి. చలపతి రావు, డా. కె. రాజేంద్ర ప్రసాద్, డా. వి. రమణ, డా. వి. శివకుమార్, డా. ఈ. కరుణ శ్రీ గార్లు మరియు శాస్త్రవేత్తలు డా. రేఖ, డా. ప్రసాద్ రెడ్డి, డా. అర్చన సాంకేతిక నిపుణులుగా పాల్గొని విలువైన సూచనలు అందించారు. కృషి విజ్ఞాన కేంద్రం హెడ్, డా. జప్త. కిరణ్ కుమార్ గారు వందన సమర్పణ చేసారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో రైతులు, శాస్త్రవేత్తలు మరియు కృషి విజ్ఞాన కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

# బీసీల రిజర్వేషన్లపై సమగ్ర అధ్యయనం

### డెడికేటెడ్ కమిషన్‌కు వినతులు ఆహ్వానం.

### జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి ఎ.వి.సూరిబాబు



**భీమవరం ఏప్రిల్ 7,ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, స్థానిక సంస్థలలో బీసీ (వెనుకబడిన తరగతులు) రిజర్వేషన్లపై సమగ్ర అధ్యయనం నిర్వహించుటకు, పదవీ విరమణ పొందిన ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా అధ్యక్షతన డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేసినట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి ఎ.వి. సూరిబాబు వెల్లడించారు. సుప్రీంకోర్టు నిర్దేశించిన "ట్రిపుల్ టెస్ట్" మార్గదర్శకాల ప్రకారం, రాష్ట్రంలోని వెనుకబడిన వర్గాల సామాజిక మరియు ఆర్థిక పరిస్థితులపై అనుభవాధారిత అధ్యయనం నిర్వహించి, స్థానిక సంస్థలలో రిజర్వేషన్ శాతం నిర్ణయించబడనుంది. ఈ నేపథ్యంలో, సంబంధిత అంశాలపై అవగాహన కలిగిన వ్యక్తులు, సంస్థలు తమ అభిప్రాయాలు, సూచనలు మరియు ఆధారాలతో కూడిన మెమోరాండాలను ఏప్రిల్ 30, 2026 లోపు సమర్పించాలని కోరారు. వినతిపత్రాలు స్పష్టమైన వాస్తవాలు మరియు ధృవీకరించిన ఆధారాలతో సమర్పించబడాలి. నిర్దిష్ట గడువులోగా, నిర్దేశిత విధానంలో అందని వినతులు పరిగణనలోకి తీసుకోబడవని స్పష్టం చేశారు. వినతిపత్రాలను రిజిస్టర్ పోస్టు ద్వారా విజయవాడ, మొఘల్రాజపురంలో ఉన్న గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ కార్యాలయంలోని డెడికేటెడ్ కమిషన్ కార్యాలయానికి సమర్పించాలని తెలిపారు. ఇమెయిల్ ద్వారా అయితే ఏపీ బీసీడెడికేటెడ్ కమిషన్ 2026ఏజిమెయిల్ .కామ్ వెబ్ సైట్ నందు, అవసరమైతే, ముందస్తుగాడెడికేటెడ్ కమిషన్ నెంబర్ 9010400500 లేక 7989344521 నందు అపాయింట్‌మెంట్ తీసుకుని కార్యాలయంలో వ్యక్తిగతంగా సమర్పించవచ్చు తెలిపారు.

# మోటార్ సైకిల్ దొంగతనం పై కేసు నమోదు

**అత్తిలి,ఏప్రిల్ 7 (ప్రభాత వార్త)** అత్తిలి ఆకుల వారి వీధిలో గల శకినాల సత్య తేజ కు చెందిన మోటార్ సైకిల్ దొంగిలించారనే ఫిర్యాదు పై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ బి. శ్రీనివాస్ తెలిపారు. గత నెల ఒకటో తేదీ న ఇంటి బయట పల్సర్ మోటార్ సైకిల్ సత్య తేజా పార్క్ చేసి నట్లు తెలిపారు. మరునాడు ఉదయం లేచి చూసేసరికి కనిపించలేదని సూర్య తేజ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీనిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## ఇండియా స్కిల్స్ జాతీయ స్థాయి పోటీలలో ఎన్నారైవిద్యార్థి అద్భుత ప్రతిభ



**ఆగిరిపల్లి ఏప్రిల్7 ప్రభాతవార్త** ఇటీవల నోయిడా (ఢిల్లీలో) లో జరిగిన ఇండియా స్కిల్స్ జాతీయ స్థాయి పోటీలలో లిడాక్టర్ ఆర్ వి ఆర్ ఎన్నారై యూనివర్సిటీ డేటా సైన్స్ విభాగంలో నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థి జీ.శ్రీనివాస్ సాఫ్ట్వేర్ టెస్టింగ్ నైపుణ్యాల్లో జాతీయస్థాయిలో ప్రథమ స్థానంసాధించి, బంగారు పథకంతో పాటు లక్ష రూపాయల నగదు బహుమతి సాధించాడు. అద్భుత ప్రదర్శన తో ప్రథమ స్థానం సాధించిన శ్రీనివాస్ కు ఆంధ్రప్రదేశ్ నైపుణ్య అభివృద్ధి సంస్థ ఎండిమరియు సీఈవో జి.గణేష్ కుమార్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. విద్యాసంబంధ విషయాల్లోనే కాకుండా, నైపుణ్య పోటీల లో సైతం అద్భుత ప్రదర్శనతో రాణిస్తూ జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయి, జాతీయస్థాయిలో అంచలంచెలుగా విజయాలు అందుకున్న జి శ్రీనివాస్ ను యూనివర్సిటీ చాన్సర్ డాక్టర్ రావి వెంకటరావు వైస్ ఛాన్సర్ డాక్టర్ కెఆర్ఎస్ సాంబశివరావు , ప్రో వైస్ ఛాన్సర్లు డాక్టర్ జి.సాంబశివరావు , డాక్టర్ నాగ భాస్కర్ , రిజిస్ట్రార్ బి .రాఘవరావు , సీఈవో తేజ సాయి , యూనివర్సిటీ నైపుణ్యాభివృద్ధి విభాగం సమన్వయకర్త డాక్టర్ గోరంట్ల ఆదిలక్ష్మి మరియు సి ఎస్ డి విభాగాధిపతి డాక్టర్ సిహెచ్ వెంకట మురళీకృష్ణ పాల్గొని అభినందించారు.

## విద్యుత్ శాఖ నిర్లక్ష్యం.. పొదల చాటున మృత్యుపాశం



**జంగారెడ్డిగూడెం ప్రభాతవార్త ఏప్రిల్ 7** జంగారెడ్డిగూడెం జేపి సెంటర్ నుండి సాలిపేట వెళ్లే రహదారి పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా మారింది. ట్రాన్స్‌ఫార్మర్ అని గుర్తుపట్టలేనంతగా పిచ్చి మొక్కలు, తీగలు కమ్మేయడంతో అటుగా వెళ్లే ప్రజలు ప్రాణభయంతో వణికిపోతున్నారు. ముఖ్యంగా ఈ మార్గంలో నిత్యం రద్దీగా ఉండే వాహనదారులు, పాదచారులు ఎప్పుడు షార్ట్ సర్క్యూట్ జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగి ప్రాణనష్టం సంభవించాక అధికారులు మేల్కొంటారా? అని స్థానికులు సూటిగా ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి, తక్షణమే ఆ పొదలను తొలగించి ప్రమాదం తప్పించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని ధర్నా



**చాట్రాయి, ఏప్రిల్ 7 ప్రభాతవార్త** ప్రభుత్వం తక్షణమే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని కోరుతూ భారతీయ కిసాన్ సంఘ ఆధ్వర్యంలో చాట్రాయి సెంటర్ లో ధర్నా నిర్వహించారు. కిసాన్ సంగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోలూరి పతిరాజు, యలమందల స్వామి ధర్నాలో పాల్గొని ప్రభుత్వ అందిస్తున్న మద్దతు ధర క్వింటా 2400 ఉంటే దళారీలు 1800 కే కొనుగోలు చేస్తున్నారని దీని వల్ల రైతులు ఎంతో నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దళారులు కొనుగోలు చేసే రేటుకు రైతు అమ్ముకుంటే ఎకరాకు 25 వేల రూపాయలు నష్టపోవాల్సి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొని నినాదాలు చేశారు. ఈ విషయంపై వ్యవసాయ అధికారి శివశంకర్ ను వివరణ కోరగా ఉన్నతాధికారులకు నివేదిక పంపామని అనుమతులు రాగానే మార్కెట్ యార్డ్ ప్రారంభిస్తామని ఆయన స్పష్టం చేశారు.

## : ఉచిత పశు వైద్య శిబిరం ప్రారంభం



**మొగల్తూరు ఏప్రిల్ 7 (ప్రభాతవార్త)** పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం పాతశేరే పాలెం గ్రామంలో పశుసంవర్ధక శాఖ మరియు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రభుత్వ విప్ మరియు శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ చేతుల మీదుగా ఉచిత పశు వైద్య శిబిరాన్ని ఘనంగా ప్రారంభించారు, అనంతరం ఆయన మాట్లాడుతూ పశుసంవర్ధక రంగం గ్రామీణ ఆర్థికవ్యవస్థకు కీలకమైన ఆధారమని, రైతులు పశుపోషణను ఉపాధిగా తీసుకొని ఆర్థికంగా బలపడాలని సూచించారు, పశువుల ఆరోగ్యం పట్ల రైతులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పశు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని, ఇలాంటి శిబిరాల ద్వారా పశువులకు సమయానుకూలంగా చికిత్స అందించడం వల్ల పాల ఉత్పత్తి పెరగడమే కాకుండా రైతుల ఆదాయం కూడా పెరుగుతుందని పేర్కొన్నారు, ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని, పశుసంవర్ధక రంగానికి మరింత ప్రాధాన్యత ఇస్తుందని ఆయన తెలియజేశారు, ఈ కార్యక్రమంలో నరసాపురం నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ పొత్తూరి రామరాజు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, మొగల్తూరు మండల టిడిపి అధ్యక్షులు గుబ్బల వీర వెంకట నాగరాజు, టిడిపి నాయకులు డొల్లారత్నం, సొసైటీ చైర్మన్ నిప్పులేటి తారక రామారావు, తదితరులుపశుసంవర్ధక శాఖ సిబ్బంది, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ప్రజా ప్రతినిధులు గ్రామస్తులు స్థానికులు కూటమి నాయకులు రైతులు పాల్గొన్నారు

## రోడ్డు ప్రమాదంలో మొగల్తూరు వాసి మృతి



**మొగల్తూరు ఏప్రిల్ 7 (ప్రభాతవార్త)** పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం మొగల్తూరు గ్రామపంచాయతీ పరిధి పెదపల్లవ పాలెం గ్రామానికి చెందిన ఒడుగు బాల బాపూజీ(45) కుమారుడు కార్తీక్ (19) ఇరువురు మంగళవారం ఉదయం 5 గంటల కు మొగల్తూరు నుండి విజయవాడకు పరీక్షలు నిమిత్తం బయలుదేరారు, 6 గంటల సమయంలో కృష్ణాజిల్లా కృత్తి వెన్ను మండలం గరిసేపూడి గ్రామం సమీపంలో 216 నేషనల్ హైవే పై ఎదురుగా వస్తున్న వ్యాన్ ఢీ కొట్టడంపై తీవ్ర గాయాలయ్యాయి, ఈ సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకుని క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం 108 వాహనంపై విజయవాడ తరలిస్తుండగా ఒడుగు బాల బాపూజీ మార్గ మధ్యలో మృతి చెందాడు, వారి కుమారుడు కార్తీక్ ని విజయవాడ ఆసుపత్రిలో వైద్యులు పరీక్షించి, పరిస్థితి విషమంగా ఉందని తెలుస్తుంది, ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు శోకసముద్రంలో మునిగిపోయారు, గ్రామంలోని విషాద సాయిలు కమ్ముకున్నాయి

## ఆరోగ్యకరమైన జీవనశైలితో వ్యాధులకు దూరం

### జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ జి.గీతాబాయి



**భీమవరం ఏప్రిల్ 7 ప్రభాతవార్త** ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పశ్చిమ గోదావరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈరోజు మంగళవారం ఉదయం భీమవరం పట్టణంలోని బలుసుమూడి అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వద్ద అవగాహన ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ సంవత్సరం ప్రపంచ ఆరోగ్య దినోత్సవ నినాదం "విజ్ఞానానికి అండగా నిలుద్దాం -- ఆరోగ్యం కోసం కలిసి పనిచేద్దాం" అనే అంశంపై కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జి.గీతాబాయి మాట్లాడుతూ, శాస్త్రీయ సహకారం, సాక్ష్యాధారిత నిర్ణయాలు మరియు మానవ, జంతు, వృక్ష ఆరోగ్యాలను అనుసంధానించే "ఒకే ఆరోగ్యం" విధానం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ప్రపంచవ్యాప్తంగా ఎదురవుతున్న ఆరోగ్య సవాళ్లను ఎదుర్కోవడానికి శాస్త్రీయ పురోగతిని సమర్థంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని, తప్పుడు సమాచారాన్ని నిరోధించడం అత్యంత కీలకమని తెలిపారు. ప్రజలు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం ద్వారా అనేక వ్యాధులను దూరంగా ఉంచవచ్చని పేర్కొన్నారు. మద్యపానం, ధూమపానం, పొగాకు వినియోగం వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. పరిశుభ్రమైన త్రాగునీరు, పోషకాహారం తీసుకోవడం, ప్రతిరోజూ వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. అలాగే వయస్సుకు అనుగుణంగా ఆరోగ్య పరిస్థితులను గుర్తించేందుకు నిరంతరం హెల్త్ చెకప్‌లు చేయించుకోవాలని, వ్యాధులను ముందుగానే గుర్తించి ఆరోగ్యవంతమైన జీవితం గడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బలుసుమూడి యు.పి.హెచ్.సి వైద్యాధికారి డాక్టర్ కృష్ణ దుర్గ, ఎమిజర్ల వారి స్ట్రీట్ మరియు ఎస్పీ స్ట్రీట్ యు.పి.హెచ్.సిల వైద్యాధికారులు డాక్టర్ రాహుల్ చంద్ర, డాక్టర్ భూపతి శాంతి కృష్ణ, డిప్యూటీ డెమో రాజా అక్కులు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ తోట కుమారి మరియు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# వేసవి దొంగలతో జాగ్రత్త

### ప్రజలను అప్రమత్తం చేస్తున్న కైకలూరు టౌన్ పోలీసులు



**కైకలూరు ఏప్రిల్ 7 (ప్రభాతవార్త)** వేసవి కాలంలో దొంగతనాలు పెరిగే అవకాశం ఉన్నందున, ఊళ్లకు వెళ్లేటప్పుడు ఇంటికి బలమైన తాళాలు వేసి, విలువైన వస్తువులను బ్యాంకు లాకర్లలో ఉంచాలని కైకలూరు టౌన్ పోలీసులు గ్రామాల్లో మైక్ ఎనౌన్స్మెంట్ ద్వారా ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. జిల్లా ఎస్పీ శివ కిషోర్, డి.ఎస్.పి శ్రావణ్ కుమార్ ఆదేశాలపై కైకలూరు టౌన్ సిఐ రామకృష్ణ ఆధ్వర్యంలో ఎస్సై వెంకట్ కుమార్ మంగళవారం కైకలూరు టౌన్ ప్రాంతాల్లో మైకు ద్వారా రానున్న వేసవి సెలవులు నేపథ్యంలో దొంగతనాల నివారణ పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఏదైనా ఊరు వెళ్ళేటప్పుడు పక్కింటి వారికి సమాచారం ఇవ్వడం, సోషల్ మీడియాలో టూర్ వివరాలు పెట్టకపోవడం, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వంటి జాగ్రత్తలు పాటిస్తే దొంగతనాలను అరికట్టవచ్చు అని పోలీసులు పేర్కొన్నారు. అనుమానస్పద వ్యక్తులపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## కోలమూరు గ్రామ అభివృద్ధికి కృషి చేసిన రాంబాబు దంపతులకు ఘన సన్మానం



**ఉండి, ఏప్రిల్ 7 ప్రభాతవార్త** మండలంలోని కోలమూరు గ్రామ అభివృద్ధి లక్ష్యంగా పనిచేసిన గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ నడింపల్లి సత్యవతి, నడింపల్లి రామకృష్ణంరాజు గ్రామాన్ని ఎంతో అభివృద్ధి చేశారని ఉండి నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ పివిఎల్ నరసింహారాజు అన్నారు మండలంలోని కోలమూరు గ్రామంలో సర్పంచ్, వార్డు నెంబర్లకు పదవీకాలం పూర్తయిన సందర్భంగా పెద్ద ఎత్తున గ్రామస్తులు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా పివిఎల్ నరసింహారాజు మాట్లాడుతూ గడిచిన ఐదు సంవత్సరాలలో కోలమూరు గ్రామాన్ని ఎంతో అభివృద్ధి చేసిన ఘనత సర్పంచ్ ఉపసర్పంచ్ కె దక్కుతుందన్నారు భార్యాభర్తలు ఇద్దరు కూడా సర్పంచ్ ఉప సర్పంచ్ గా గ్రామాన్ని ఎంతో అభివృద్ధి చేశారని ఈ సందర్భంగా ఆయన అన్నారు. అలాగే గ్రామం అంతా ఏకమై ఈ ఉత్సవాల్లో పాల్గొనడం అనంతరం విందును ఏర్పాటు చేయడంతో ఊరంతా పండగ వాతావరణం నెలకొంది ఈ కార్యక్రమంలో పలువురు వైసిపి నాయకులు తో పాటు బిజెపి నాయకులు గ్రామస్తులు ప్రజాప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.